బుధవారం
28-09-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 98
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

తొలి కమ్యూనిస్టు ముఖ్యమంత్రి ఈఎంఎస్
27 ఏళ్లకే ఎంపీ అయిన కానేటి మోహన రావు
20 వేల మందిని బలిగొన్న సంతాల్ పోరు
7లో

తేలని పంచాయితీ

తెగని గొడవ!

- రాజస్థాన్ కాంగ్రెస్‌లో కొనసాగుతున్న సంక్షోభం
- జైపూర్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలతో గెహ్లాట్ భేటీ
- ఢిల్లీ చేరుకున్న సచిన్ పైలట్

న్యూఢిల్లీ/జైపూర్: రాజస్థాన్ కాంగ్రెస్‌లో గొడవ సద్దుమణగలేదు. సీఎం పీఠం కోసం కుమ్ములాటలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ విధేయులు ఏకంగా పార్టీ అధిష్ఠానానికి ధిక్కార స్వరం వినిపించడంతో గెహ్లాట్ వైఖరి పట్ల అధినేత్రి సోనియా గాంధీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త సీఎం ఎన్నిక కోసం జైపూర్ వెళ్లిన ఏఐసీసీ పరిశీలకులు మల్లికార్జున ఖర్గే, అజయ్ మాకెన్ సైతం సంక్షోభాన్ని చక్కదిద్దలేక చేతులెత్తేసి ఢిల్లీ వచ్చేశారు. 82 మంది ఎమ్మెల్యేలు సీఎల్పీ సమావేశానికి హాజరు కాకుండా ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నిర్ణయించడాన్ని 'క్రమశిక్షణా రాహిత్యం'గా పార్టీ పరిశీలకులు అభివర్ణించారు. ఖర్గే, మాకెన్ రాజస్థాన్ పరిణామాలపై లిఖితపూర్వక నివేదికను సోనియాకు సమర్పించేందుకు సిద్ధమయ్యారు. పార్టీలో తిరుగుబాటుకు కారణమైన ముగ్గురు ఎమ్మెల్యేలకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం అశోక్ గెహ్లాట్ మంగళవారం జైపూర్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, కొంతమంది మంత్రులతో సమావేశమయ్యారు. పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియా గాంధీతో కూడా ఫోన్‌లో మాట్లాడారు. మరోవైపు, సచిన్ పైలట్ సోనియాను కలిసేందుకు ఢిల్లీ వెళ్లారు. అయితే వచ్చే నెలలో జరగనున్న కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల తర్వాత రాజస్థాన్ సీఎం పదవిపై నిర్ణయం తీసుకోవచ్చని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. కాగా, సీఎం అశోక్ గెహ్లాట్‌పై ఇప్పట్లో ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోబోమని కూడా చెబుతున్నాయి.

అశోక్ గెహ్లాట్‌తో మాట్లాడలేదు: సచిన్ పైలట్

రాజస్థాన్ సీఎం పదవి విషయంలో తాను అశోక్ గెహ్లాట్, కాంగ్రెస్ అధిష్ఠానంతో చర్చించలేదని ఆ పార్టీ నాయకుడు సచిన్ పైలట్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. సీఎం గెహ్లాట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకుంటే సీఎం పదవిలో కొనసాగకూడదని పైలట్ న్యూఢిల్లీలో పార్టీ అధిష్ఠానానికి చెప్పినట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఇదిలాఉండగా, సీఎం పదవి కోసం సచిన్ పైలట్‌కు మద్దతు ఇస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంగళవారం జైపూర్‌లోని ఆయన నివాసానికి చేరుకున్నారు. అయితే ఆయన శిబిరంలో జరుగుతున్న పరిణామాలపై మాత్రం పైలట్ పెదవి విప్పలేదు. అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి ఉండాల్సిందిగా ఆయన తన మద్దతుదారులను కోరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలపై

- మిగతా 2 లో

- విభజన అంశాలపై ముగిసిన కేంద్ర హోం శాఖ సమావేశం
- ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధికారులు హాజరు
- కుదరని ఏకాభిప్రాయం
- ప్రత్యేక హోదా ప్రస్తావన ఏదీ?
- విద్యుత్ బకాయిలపై కొనసాగని చర్చ
- రైల్వే జోన్ అసాధ్యమన్న హోం శాఖ
- రాజధానికి నిధుల నిరాకరణ
- వెనుకబడిన జిల్లాల నిధులు ఐదేళ్లకే పరిమితం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల విభజన సమస్యలపై సమావేశం మరోసారి అసంపూర్తిగానే ముగిసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లా నేతృత్వంలో మంగళవారం ఉన్నత స్థాయి అధికారుల సమావేశం జరిగింది. వివాదాలపై రెండు రాష్ట్రాల మధ్య మళ్లీ ఏకాభిప్రాయం కుదరలేదు. సమావేశానికి రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో పాటు ఇంధన, విద్యుత్, పౌర సరఫరాల, పారిశ్రామిక, మార్కెటింగ్ తదితర శాఖల కార్యదర్శులు హాజరై చర్చించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి మొత్తం 14 అంశాలపై చర్చించగా, అందులో ఏడు అంశాలు రెండు రాష్ట్రాల ఉమ్మడి అంశాలుగా ఉన్నాయి. మరో ఏడు అంశాలు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవే ఉన్నాయి. కొత్త రాజధానికి కేంద్రం సహకారం, నిధులు, పన్నుల రాయితీ, ఏడు వెనుకబడిన ప్రాంతాల జిల్లాలకు నిధులు, కొత్త విద్యా సంస్థల ఏర్పాటు, ప్రభుత్వ కంపెనీలు తదితర అంశాలపై చర్చించినా ఏ ఒక్క అంశమూ కొలిక్కి రాలేదు. రెండు రాష్ట్రాలకు సంబంధించి కార్పొరేషన్ల విభజన, 9, 10 షెడ్యూలులోని సంస్థల విభజన, చట్టంలో లేని ఇతర సంస్థల విభజన అంశాల పైనా అదే పరిస్థితి నెలకొంది. బ్యాంకుల్లో ఉన్న నగదు, బ్యాలెన్స్ పంపిణీ పైనా సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కేంద్ర బిందువైన ప్రత్యేక హోదా అంశాన్ని వదిలేశారు. విద్యుత్ బకాయిల పైనా చర్చించలేదు. మళ్లీ మొక్కుబడిగానే ముగిసింది. మళ్లీ భేటీ కావాలా?, వద్దా? అనే దానిపై నిర్ణయించకుండానే సమావేశం ముగిసింది.

ప్రతి అంశానికీ తెలంగాణ అడ్డంకి

ప్రతి అంశంలోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర అధికారులు అడ్డుతగిలారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి సహకరించకుండా, తెలంగాణ అధికారులు ఏదొక సాకు చెబుతూ అంగీకరించలేదు. రైల్వే జోన్ ఏర్పాటు సాధ్యం కాదని రైల్వే బోర్డు స్పష్టం చేయగా, ఆ నిర్ణయాన్ని కేబినెట్‌కు వదిలేయాలని హోం శాఖ కార్యదర్శి సూచించారు. రాజధానికి మరో రూ.1000 కోట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా, ఇప్పటికే ఇచ్చిన రూ.1500 కోట్ల వివరాలు ఇవ్వాలని కేంద్రం వివరణ కోరింది. శివరామకృష్ణన్ కమిటీ రూ.29 వేల కోట్లు ఇవ్వాలని ప్రతిపాదించింది. అందుకు అనుగుణంగా నిధులు ఇవ్వాలని కోరినప్పటికీ కేంద్రం స్పందించలేదు. వెనుకబడిన ఏడు జిల్లాలకు నిధులు ఇవ్వాలని రాష్ట్ర అధికారులు కోరగా, ఐదేళ్లే ఇవ్వాలని నిర్ణయం జరిగిందని హోం శాఖ అధికారులు స్పష్టం చేశారు. షీలా బిడే కమిటీ సిఫార్సులపై న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటామని కేంద్రం తెలిపింది. షీలా బిడే కమిటీ ప్రతిపాదనలను తెలంగాణ ప్రభుత్వం అంగీకరించడం లేదని హోం శాఖ అధికారులు దాటవేశారు. దానిపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు మాట్లాడుతూ తెలంగాణ అంగీకరించకపోయినా, హోం శాఖ నిర్ణయం తీసుకోవచ్చని సూచించింది. న్యాయ నిపుణుల సలహాల మేరకు నిర్ణయం తీసుకుంటామని కేంద్రం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం లేవనెత్తిన ప్రతి అంశాన్ని తెలంగాణ అధికారులు వ్యతిరేకించారు. ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సహా వివిధ సంస్థల వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నాయని తెలంగాణ అధికారులు వెల్లడించారు. పౌర సరఫరాల శాఖ బకాయిల అంకెల్లో తేడాలున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరనందున ఎలాంటి నిర్ణయం లేకుండానే భేటీ అసంపూర్తిగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్‌లోని సమస్యల పరిష్కారానికి చొరవ

- మిగతా 2 లో

ఖాళీ పోస్టులు భర్తీ చేద్దాం

- సేంద్రియ పాల ఉత్పత్తిపై దృష్టి
- తక్కువ పెట్టుబడి, అధికోత్పత్తిపై నిత్య పరిశోధనలు
- పశు వైద్యుడు కాన్సెప్ట్‌కు చర్యలు
- పశుసంవర్ధక శాఖపై జగన్ సమీక్ష

3లో

తానా బోర్డు డైరెక్టర్ ఇంట

విషాదం

రోడ్డు ప్రమాదంలో భార్య, ఇద్దరు కుమార్తెల దుర్మరణం

వాషింగ్టన్: అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) బోర్డు డైరెక్టర్ డా.నాగేంద్ర శ్రీనివాస్ కొడాలి (వాసు) భార్య, ఆయన ఇద్దరు కుమార్తెలు దుర్మరణం చెందారు. కృష్ణా జిల్లా కురుమద్దాలి గ్రామానికి చెందిన డాక్టర్ కొడాలి నాగేంద్ర శ్రీనివాస్ గుంటూరు మెడికల్ కాలేజీలో వైద్యవిద్యను అభ్యసించారు. 1995లో ఉన్నత విద్య అభ్యసించడానికి అమెరికా వెళ్లారు. పీడీయాట్రిక్ కార్డియోవాస్క్యులర్ అనస్థీషియనిస్ట్ గా పనిచేస్తూ హ్యూస్టన్ నగరంలో స్థిరపడ్డారు. 2017 నుంచి తానా బోర్డు సభ్యుడిగా ఉన్నారు. ఇక వాసు భార్య వాణి ఐటీ ఉద్యోగి. వారి ఇద్దరు కుమార్తెల్లో పెద్ద అమ్మాయి వైద్యవిద్యను అభ్యసిస్తుండగా, చిన్న కుమార్తె 11వ తరగతి చదువుతోంది. ఆదివారం ఉదయం 11.30 గంటల సమయంలో కాలేజీ నుంచి కుమార్తెలను తీసుకువచ్చేందుకు కారులో వాణి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో టెక్సాస్ వాలర్ కౌంటీలో వారు ప్రయాణిస్తున్న కారును పికప్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. భార్య ఇద్దరు కుమార్తెల మరణంతో డా.నాగేంద్ర బోరుమన్నారు. ఆయనను ఆపడం ఎవరితరం కాలేదు. నాగేంద్ర షాక్ లోకి వెళ్లిపోయారు. ఈ ఘటనపై తానా సభ్యులు, వాసు మిత్రులు, సన్నిహితులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

అమరావతి రైతులను

రెచ్చగొడతారా?

బొత్స వ్యాఖ్యలపై రామకృష్ణ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రైతులను రెచ్చగొట్టేలా మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు చేయడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హితవు పలికారు. అమరావతి రైతులు రోడ్డెక్కడానికి ప్రధానమైన కారణం సీఎం జగనేనని, మాట తప్పి మడమ తిప్పడం జగన్‌కు ఆనవాయితీగా మారిందని మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. అమరావతి రాజధానికి వైసీపీ ప్రభుత్వం వ్యతిరేకమని, అందుకే పదేపదే మూడు రాజధానుల ప్రస్తావన తెస్తోందని విమర్శించారు. హైకోర్టు అనుమతితో రైతులు చేపట్టిన అమరావతి నుంచి అరసవల్లి పాదయాత్రపై 'మేం తలచుకుంటే పాదయాత్రను ఆపేస్తామంటూ' సీనియర్ మంత్రిగా బొత్స సత్యనారాయణ రెచ్చగొట్టే పద్ధతుల్లో వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. నిజంగా బొత్స సత్యనారాయణకు పాదయాత్రను ఆపే దమ్ముందా? అని ప్రశ్నించారు. గతంలోనూ అమరావతి ఉద్యమానికి పోటీగా వైసీపీ దీక్షలు పెట్టించిందని, కూలీలను తీసుకొచ్చి వాళ్లకు డబ్బులిచ్చిందని గుర్తు చేశారు. వారంతా స్వచ్ఛందంగా వచ్చిన వారు కాదని తెలిపారు. అమరావతి రైతుల పాదయాత్రకు ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభిస్తుంటే ఓర్వలేక వైసీపీ మంత్రులు రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. కొన్ని చోట్ల పోలీసులను ప్రయోగించి పాదయాత్రను ఆపాలనే కుట్రలకు పాల్పడటాన్ని ఖండించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుకు అప్పగిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. కమీషన్లకు కక్కుర్తిపడి గంగవరం పోర్టును అదానీ కంపెనీకి అప్పగించిందనీ, అదానీకి ఊడిగం చేస్తున్న

- మిగతా 2 లో

ఆశా పరేఖ్‌కు

దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం

న్యూఢిల్లీ: ప్రముఖ హిందీ నటి ఆశాపరేఖ్ అత్యున్నత సినీ పురస్కారం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును అందుకోనున్నారు. భారత సినీ పరిశ్రమకు ఆమె అందించిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం 2020 సంవత్సరానికి ఈ అవార్డుకు ఆశాపరేఖ్‌ను ఎంపిక చేసింది. దీనికి ముందు అంటే 2019కిగాను సూపర్‌స్టార్ రజనీకాంత్ ఈ అవార్డుని అందుకున్నారు. అనంతరం కోవిడ్-19 కారణంగా ఈ అవార్డులను ఇవ్వలేదు. బాలనటిగా సినీరంగంలో ప్రవేశించిన ఆశా పరేఖ్ తనకంటూ ఓ గుర్తింపు సాధించుకున్నారు. 1950-60 మధ్య అగ్ర కథానాయికల్లో ఒకరిగా ఉన్నారు. తీస్రీ మంజిల్, కటి పతంగ్, ప్యార్ కా మౌసమ్, దో బదన్, చిరాగ్ వంటి చిత్రాలతో నటిగా గుర్తింపు పొందారు. కథానాయికగా దేవానంద్, షమ్మీ కపూర్, రాజేష్ ఖన్నా వంటి నటులతోజోడీ కట్టారు. అంతేకాకుండా.... మాతృభాష అయిన గుజరాతీతోపాటు పంజాబీ, కన్నడ చిత్రాలలో కూడా నటించారు. 1992లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. కాగా 79 ఏళ్ల ఆశాపరేఖ్ వివాహం చేసుకోలేదు. ఈ అవార్డు ప్రకటించిన తర్వాత కేంద్ర సమాచార మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ... 'ఆశా పరేఖ్‌కి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుని ఇవ్వడం సంతోషంగా ఉంది. ఆమె దాదాపు 95 చిత్రాల్లో నటించి గుర్తింపు పొందారు. 1998-2001 మధ్య సీబీఎఫ్‌సీ ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఈ అవార్డును సెప్టెంబర్ 30న జరిగే జాతీయ చలనచిత్ర అవార్డుల వేడుకలో అందజేస్తాం' అని తెలిపారు. ఉదిత్ నారాయణ్, హేమా మాలిని, ఆశా భోంస్లే, పూనమ్ థిల్లాన్, టీఎస్ నాగభరణతో కూడిన ఐదుగురు సభ్యుల జ్యూరీ ఆశా పరేఖ్‌కు ఈ అవార్డుని ఇవ్వాలని నిర్ణయించింది.

సుప్రీంకోర్టు ప్రత్యక్ష ప్రసారాలు ప్రారంభం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో జరిగే కేసుల విచారణను ఇక సామాన్య పౌరులు సైతం ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. మంగళవారం నుంచి రోజువారీ కార్యకలాపాలను సుప్రీం కోర్టు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రసారం చేస్తోంది. ప్రస్తుతానికి రాజ్యాంగ ధర్మాసనం విచారించే కేసుల్ని మాత్రమే యూట్యూబ్‌లో చూసే వీలు కల్పించిన సుప్రీంకోర్టు... త్వరలోనే ఇందుకోసం సొంత వ్యవస్థను ఏర్పాటు చేసుకోనున్నట్లు తెలిపింది. కేసుల విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయాలని, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యూయూ లలిత్ నేతృత్వంలో గత మంగళవారం జరిగిన ఫుల్ కోర్ట్ సమావేశంలో నిర్ణయించారు. ప్రత్యక్ష ప్రసారం చేయడంపై న్యాయమూర్తులంతా ఏకాభిప్రాయం వ్యక్తం చేయడంతో సుప్రీంకోర్టు సిబ్బంది అందుకు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

వికేంద్రీకరణ చేసి మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాము,ఇక్కడ భూములు కొంటాము!

మధ్యాహ్న భోజనం కలుషితం

- ఆరేళ్ల గరిష్ఠానికి పెరిగిన కేసులు
- పర్యవేక్షణ లోపం-వసతుల లేమి
- 90 రోజుల్లో 120 మందికి
- ఈ ఏడాది 979 మందికి అస్వస్థత
- 13 ఏళ్లలో 9,656 కేసులు నమోదు
- కర్ణాటక, ఏపీ, బీహార్‌లోనే అధికం: కాగ్

దేశంలో మధ్యాహ్న భోజనం (మిడ్డే మీల్) సంబంధిత కలుషిత ఆహారం కేసులు ఆరేళ్ల గరిష్ఠస్థాయికి చేరుకున్నాయి. అరకొర మౌలిక వసతులు, కొరవడిన పర్యవేక్షణ, అక్రమ లైసెన్సులు వంటి చర్యలు ఈ దుస్థితికి దారితీస్తున్నట్లు భారత కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) తేల్చిచెప్పింది.

2లో

మరో వెయ్యి కోట్ల అప్పు

- ఆర్‌బీఐలో సెక్యూరిటీల వేలం ద్వారా సమీకరణ
- ఏప్రిల్ నుంచి రూ.45,890 కోట్లకు చేరిన రుణం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వానికి ఒకటో తారీఖు వస్తుందంటే గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఉద్యోగులకు జీతాలు, పదవీ విరమణ చేసిన వారితో పాటు వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు సామాజిక పెన్షన్లు అందజేయాల్సి ఉండడంతో, అందుకోసం అప్పుల వేట కొనసాగిస్తోంది. ఏ అవకాశాన్ని జారవిడుచుకోకుండా అవకాశమున్న చోటల్లా అప్పులు సమీకరిస్తోంది. దీనిలో భాగంగా మంగళవారం తాజాగా రిజర్వుబ్యాంకులో సెక్యూరిటీల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మరో వెయ్యి కోట్ల రూపాయల రుణం తీసుకుంది. రూ.500 కోట్ల చొప్పున రెండు లాట్లుగా సెక్యూరిటీ బాండ్లను వేలం వేశారు. ఆరేళ్ల కాల పరిమితితో వేలం వేసిన సెక్యూరిటీ బాండ్లకు 7.6శాతం మేర ప్రభుత్వం వడ్డీ చెల్లించనుంది. 2028 నాటికి సెక్యూరిటీ బాండ్లు పూర్తిగా చెల్లించేలా కాల పరిమితి నిర్దేశించారు. 12 ఏళ్ల కాల పరిమితితో వేలం వేసిన సెక్యూరిటీ బాండ్లకు 7.71శాతం మేర ప్రభుత్వం వడ్డీ చెల్లించనుంది. 2022 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా రూ.45,890 కోట్ల రుణాన్ని ప్రభుత్వం తీసుకుంది.

అణుముప్పు తొలగించాలి

గుటెర్రస్ పిలుపు

ఐరాస: అణ్వాయుధ ముప్పు నిర్మూలనకు ప్రపంచదేశాలు అన్ని విధాలా కృషి చేయాలని యుఎన్ చీఫ్ పిలుపునిచ్చారు. "అణ్వాయుధాలను నిర్మూలించకుండా శాంతి,విశ్వాసం, స్థిరమైన మానవాళి భవిష్యత్తు ఉండదు" ఆంటోనియో గుటెర్రెస్ పేర్కొన్నారు. అణు ముప్పును తొలగించేందుకు అన్ని మార్గాలను ఉపయోగించాలని పేర్కొన్నారు. సెప్టెంబరు 26న అంతర్జాతీయ అణ్వాయుధాల సంపూర్ణ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అణ్వాయుధ నిర్మూలన ప్రచారం చేపట్టాలని జనరల్ అసెంబ్లీ ఉన్నత స్థాయి సమావేశంలో గుటెర్రెస్ విజ్ఞప్తి చేశారు. మన ప్రపంచం, మన భవిష్యత్తు రక్షణకు అణు నిరాయుధీకరణను ప్రపంచ దేశాలు కఠినంగా అమలుచేయాలని గుటెర్రెస్ సూచించారు. అణ్వాయుధాల నిర్మూలన భవిష్యత్తు తరాలకు మనం అందించగల గొప్ప బహుమతిగా పేర్కొన్నారు. దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి, ప్రమాదాల నివారణకు తగిన చర్చలు,దౌత్య మార్గాలను ఉపయోగించాలని నేను అన్ని దేశాలను కోరుతున్నాను అని గుటెర్రెస్ అన్నారు. జనరల్ అసెంబ్లీ ప్రతినిధులను అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, శాంతియుత భవిష్యత్తు కోసం కొత్త నిబద్ధతతో ఉండాలని కోరారు.

అంతరిక్షంలోకి మూడు చైనా ఉపగ్రహాలు

తైయువాన్: మూడు ఉపగ్రహాలను మోసుకెళ్లే లాంగ్ మార్చ్-6 రాకెట్‌ను చైనా మంగళవారం అంతరిక్షంలోకి పంపింది. చైనాలోని ఉత్తర ప్రావిన్స్ షాంగ్సీలోని తైయువాన్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుండి ఉదయం 7:50 గంటలకు (బీజింగ్ టైమ్) రాకెట్ దూసుకుపోయింది. షియాన్-16ఏ, షియాన్-16బి, షియాన్-17 ఉపగ్రహాలను ముందుగా నిర్దేశించిన కక్ష్యలోకి పంపింది.షియాన్ అంటే చైనీస్ భాషలో "ప్రయోగం". షియాన్ ఉపగ్రహ త్రయం భూమి సర్వే, పట్టణ ప్రణాళిక, విపత్తు నివారణ, ఉపశమనానికి సంబంధించిన డేటాను అందిస్తుంది.

అబేకు తుది వీడ్కోలు

హాజరైన ప్రధాని మోదీ

టోక్యో: జపాన్ మాజీ ప్రధాని షింజో అబే అంత్యక్రియలు మంగళవారం అధికార లాంఛనాలతో ముగిశాయి. షింజో చితా భస్మానికి నిప్పాన్ బుడోకన్ హాల్‌లో నివాళి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే అబే కుటుంబం ప్రైవేటుగా అంత్యక్రియలు పూర్తి చేసింది. అబేకు నివాళులర్పించడానికి ప్రధాని మోదీతో పాటు ఆస్ట్రేలియా ప్రధాని, అమెరికా ఉపాధ్యక్షురాలు హాజరయ్యారు. ఇక్కడ వేలమంది అబేకు నివాళులర్పించారు. 19 తుపాకుల అభివాదాన్ని సమర్పించారు. ప్రపంచ దేశాలకు చెందిన 217 మంది ప్రతినిధులు హాజరయ్యారు. జపాన్‌లో ప్రభుత్వ లాంఛనాలతో తుది వీడ్కోలు అందుకున్న రెండో నేతగా అబే నిలిచారు. అబే మృతికి మోదీ సంతాపం వెలిబుచ్చారు. జూలైలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న షింజో అబేను ఓ వ్యక్తి కాల్చి చంపిన విషయం తెలిసిందే. అబే తన పదవీకాలంలో నాలుగుసార్లు భారత్‌ను సందర్శించారు. 2014 జనవరిలో భారత గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన జపాన్ ప్రధానిగా ఘనతకెక్కారు. షింజో అబేకు రాచరిక రీతిలో ప్రభుత్వ లాంఛనాలతో నివాళి అర్పించేందుకు జరిగిన ఏర్పా ట్లపై ఆ దేశ ప్రజలు కొందరు వ్యతిరేకిస్తున్నారు. రాచరిక కుటుంబానికి చెందని షింజోకు ఎందుకు ఆ రీతిలో నివాళి అర్పిస్తున్నారని ప్రశ్నించారు. షింజోకు నివాళిని వ్యతిరేకిస్తూ ఇటీవల ఓ వ్యక్తి పీఎంవో ఆఫీసు ముందు నిప్పు అంటిం చుకున్న విషయం తెలిసిందే. ఆ అంత్యక్రియలను రద్దు చేయాలని వేల మంది నిరసన ప్రదర్శన చేపట్టారు. అబే అంత్యక్రియల కోసం జపాన్ సుమారు 11 మిలియన్ల డాలర్లు ఖర్చు చేసినట్లు సమాచారం. భారీ మొత్తం వెచ్చించాల్సిన అవసరం ఏమొచ్చిందని మండిపడుతున్నారు. ఓ సర్వే ప్రకారం 60 శాతం మంది ప్రజలు అబే వీడ్కోలుకు ప్రభుత్వం చేస్తున్న భారీ ఖర్చును ఖండించారు. టోక్యోలోని ఇంటి నుంచి షింజో అబే అస్థికలను .. నిప్పాన్ హాల్‌కు తరలించే రూట్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ దేశాధినేతలు అంత్యక్రియలకు హాజరవుతున్న నేపథ్యంలో సుమారు 20వేల మంది పోలీసులతో భద్రతను కల్పించారు.

అబే మృతికి ప్రధాని మోదీ శ్రద్ధాంజలి

జపాన్ మాజీ ప్రధాని షింజో అబేకు ప్రధాని నరేంద్ర మోదీ ఘన నివాళులర్పించారు. అబే గొప్ప నాయకుడు, అసాధారణమైన వ్యక్తిగా మోదీ శ్లాఘించారు. భారత్-జపాన్ స్నేహాన్ని విశ్వసించే వ్యక్తిగా అబేను కీర్తించారు. కోట్లాది మంది హృదయాల్లో అబే జీవించిఉంటారని మోదీ ట్వీట్ చేశారు. భారత్-జపాన్ భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో అబే చూపించిన అపారమైన సహకారానికి ఘన నివాళి అని మోదీ పేర్కొన్నారు. భారత్-జపాన్ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలోనూ, స్వేచ్ఛ, బహిరంగ, సమ్మిళిత ఇండో-పసిఫిక్ ప్రాంతం దార్శనికతను రూపొందించడంలో దివంగత జపాన్ ప్రధాని సహకారం మరువలేనిదని అన్నారు. జపాన్ ప్రధాని ఫుమియో కిషిదాతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఆ ఇద్దరు నేతలు చర్చించుకున్నారు. అనేక ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలు, భారత్, జపాన్ వ్యూహాత్మక సంబంధాల గురించి కూడా మాట్లాడుకున్నారు.

ఫ్లోరిడా దిశగా హరికేన్ ఇయాన్

ఫ్లోరిడా: అమెరికాలోని ఫ్లోరిడా దిశగా హరికేన్ ఇయాన్ బలంగా ముందుకు దూసుకెళ్తోంది. దీంతో అక్కడ వేగంగా ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అత్యంత తీవ్రమైన రీతిలో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని అధికారులు ప్రకటించారు. ఇయాన్‌ను ప్రస్తుతం రెండవ క్యాటగిరీ హరికేన్‌గా ప్రకటించారు. మియామిలోని జాతీయ హరికేన్ సెంటర్ ఇయాన్ కదలికల్ని పరీక్షిస్తోంది. క్యూబాకు పశ్చిమ దిశలో సుమారు 150 మైళ్ల దూరంలో ఇయాన్ కేంద్రీకృతమై ఉందని నేషనల్ హరికేన్ సెంటర్ తెలిపింది. మంగళవారం నుంచి హరికేన్ ఇయాన్ ప్రభావం ఫ్లోరిడాపై పడే సూచనలు ఉన్నాయి. మోస్తరు నుంచి శక్తివంతమైన హరికేన్‌గా మారే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. క్యూబాలో ఇవాళ్టి నుంచి భారీ వర్షాలకు కురిసే ప్రమాదం ఉంది. జమైకా, క్యూబా దేశాల్లో హరికేన్ ఇయాన్ వల్ల ఆకస్మిక వరదలు వచ్చే ఛాన్సు ఉంది. కొండచరియలు కూడా విరిగిపడనున్నాయి. క్యూబాలోని పినార్ డెల్ రియో ప్రావిన్సు నుంచి 19 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

తెలంగాణకు ద్రోహం చేయడమే

కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై 'కూనంనేని'

విశాలాంధ్ర- హైదరాబాద్: ఉక్కు ఫ్యాక్టరీ, విభజన హామీలను సాధించే వరకు రాజ్‌భవన్, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను స్తంభింప చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విభజన చట్టంలో పేర్కొన్న విధంగా తెలంగాణలో బయ్యారం ఉక్కు కార్మాగారం సాధ్యంకాదని చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి తెలుగు ప్రజలపై ఎంత ప్రేమ ఉందో కిషన్‌రెడ్డి ప్రకటన అర్థం పడుతుందన్నారు. నాణ్యత లేని ఇనుప ఖనిజం బయ్యారంలో వుందని, ఉక్కు ఫ్యాక్టరీ అసంభవమని చెప్పడం తెలంగాణ ప్రజలకు కిషన్‌రెడ్డి ద్రోహం చేయడమే అవుతుందని అన్నారు. ప్రైవేట్ వ్యక్తులు రక్షణ స్టీల్ ప్లాంట్ పేరుతో లక్ష 41 వేల 691 ఎకరాల భూమిని ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. కేంద్రానికి చెందిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం 54 శాతం నుంచి 65 శాతం (ఎఫ్.ఇ) నాణ్యత గలిగిన 300 మిలియన్ టన్నుల ఉక్కు బయ్యారంలో లభ్యమవుతుందన్నారు. విభజన చట్టం, షెడ్యూల్ 9లో 91 కార్పొరేషన్లు, షెడ్యూల్ 10లో వున్న 142 విద్యాసంస్థలకు సంబంధించిన సంస్థను ఎందుకు ఏర్పాటు చేయలేదన్నారు. అదే విధంగా సింగరేణి సంస్థలకు చెందిన ఆంధ్రప్రదేశ్‌కు హెవి మిషనరీ ఇంజనీరింగ్ లిమిటెడ్ కూడా ఇంత వరకు పూర్తి కాలేదని, రాష్ట్ర విభజన జరిగి ఎనిమిది ఏండ్లు పూర్తయిన రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల పంపిణీ కూడా చేయలేదన్నారు. డొల్ల ప్రకటనలు మానుకొని తక్షణమే బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ప్రారంభించాలని కూనంనేని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

తెగని గొడవ!

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే ఖిలాడీ లాల్ బైర్వా మీడియాతో మాట్లాడుతూ 2023 ఎన్నికల కోసం పార్టీ అగ్ర నాయకత్వం సంస్థను పునర్నిర్మిస్తున్నదని, రాజస్థాన్ ముఖ్యమంత్రి ఎవరనేది నిర్ణయించేది వారేనని చెప్పారు. అజయ్ మాకెన్ చేసిన క్రమశిక్షణా రాహిత్యం వ్యాఖ్యపై రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్ విప్ మహేష్ జోషి మంగళవారం మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం పై ఒత్తిడి పెంచడానికి ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌కు విధేయులైన ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేయలేదని తెలిపారు. 'మేం అధిష్ఠానం పై ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదు. కానీ మా అభిప్రాయం చెప్పేందుకు ప్రయత్నించాం. నాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటాం.. ఎవరైనా సందేహాలు లేవనెత్తితే కట్టుబడి ఉంటాం. మా విధేయత లేకుంటే, రాజస్థాన్‌లో చాలా కాలం క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోయి ఉండేది' అని విలేకరులతో అన్నారు. మరోవైపు, కాంగ్రెస్ అధ్యక్ష పదవి బరిలో ఎవరెవరు ఉంటారన్న దానిపై సందేహాలు ఇంకా నివృత్తి కాలేదు. అయితే పార్టీ కేంద్ర ఎన్నికల మండలి చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ మాత్రం కొంత స్పష్టత ఇచ్చారు. 'కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు చేసిన పనిని మేము కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియా గాంధీకి వివరించాం. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరుగుతాయి. ఇప్పటి వరకు శశి థరూర్, పవన్ బన్సాల్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు' అని మిస్త్రీ మంగళవారం మీడియాతో తెలిపారు. గెహ్లాట్‌కు విధేయులుగా ఉన్న ఎమ్మెల్యేలు అక్టోబర్ 19న పార్టీ అధ్యక్ష ఎన్నికల తర్వాత గెహ్లాట్‌ను సంప్రదించి ముఖ్యమంత్రి ఎంపిక పై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

ప్రత్యక్ష ప్రసారాలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. https://main.sci.gov.in/display-board, https://webcast.gov.in/scindiaలో వేర్వేరు ధర్మాసనాల విచారణల ప్రత్యక్ష ప్రసారం లింకులు అందుబాటులో ఉంటాయి. అయితే అత్యున్నత న్యాయస్థానంలో జరిగే కార్యకలాపాల కాపీరైట్ హక్కులను యుట్యూబ్ వంటి ప్రైవేట్ సంస్థలకు అప్పగించ కూడదంటూ బీజేపీ మాజీ నేత కేఎన్ గోవిందాచార్య తరపు న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వెబ్‌కాస్ట్‌పై కాపీరైట్ హక్కులను యూట్యూబ్ స్పష్టంగా కోరినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు విన్న సీజేఐ జస్టిస్ లలిత్ నేతృత్వంలోని ధర్మాసనం... ప్రస్తుతం ప్రారంభ దశలోనే యూట్యూబ్ ఉపయోగిస్తామని తెలిపింది. కాపీరైట్ సమస్యలపై దృష్టిసారిస్తామని పేర్కొంటూనే, ప్రత్యక్ష ప్రసారం కోసం ప్రత్యేకంగా సొంత వేదిక ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. తదుపరి విచారణను అక్టోబర్ 17కు వాయిదా వేసింది.

అమరావతి రైతులను రెచ్చగొడతారా?

(మొదటిపేజీ తరువాయి)

ఈ పాలకులు తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు 'విశాఖను ముంబైలా చేస్తామని' చెబుతున్నారనిఎద్దేవా చేశారు. ఇప్పటికే రూ.10 వేల కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు జరిగిన అమరావతిని నిర్వీర్యం చేసి, విశాఖను ముంబైలా చేస్తామని చెప్పడం 'ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికెగిరినట్లు'గా ఉందని పేర్కొన్నారు. అమరావతి రాజధానిని అభివృద్ధి చేయకుండా మూడు రాజధానుల పేరుతో ప్రజలను మధ్య పెట్టేందుకు జగన్ సర్కార్ కుట్ర చేస్తోందని విమర్శించారు. పాదయాత్ర చేస్తున్న రైతులకు జగన్ ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు తలపెట్టినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మధ్యాహ్న భోజనం కలుషితం

న్యూఢిల్లీ: దేశంలో మధ్యాహ్న భోజనం (మిడ్డే మీల్) సంబంధిత కలుషిత ఆహారం కేసులు ఆరేళ్ల గరిష్ఠసాయికి చేరుకున్నాయి. అరకొర మౌలిక వసతులు, కొరవడిన పర్యవేక్షణ, అక్రమ లైసెన్సులు వంటి చర్యలు ఈ దుస్థితికి దారితీస్తున్నట్లు భారత కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) తేల్చిచెప్పింది. దేశవ్యాప్తంగా దశాబ్దం పాటు నిర్వహించిన సర్వేలు, ఆడిట్‌లు ఈ విషయాన్ని వెల్లడించాయి. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ఇటువంటి కేసులు అధికమని కాగ్ తెలిపింది. కోవిడ్ వేళ పాఠశాలలు తెరుచుకోని కారణంగా కేసులు తగ్గాయని, ఇప్పుడు కలుషిత ఆహారం కేసులు పెద్దసంఖ్యలో వెలుగులోకి వస్తున్నట్లు వెల్లడించింది. 90 రోజుల్లో 120 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ముఖ్యంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ఎక్కువగా కేసులు నమోదయ్యాయి. ఆరేళ్లలో గరిష్ఠంగా 2022లో దేశవ్యాప్తంగా ఉన్న బడులలో 979 మంది కలుషిత ఆహారానికి బాధపడ్డారు. 13 ఏళ్లలో 9,656 కేసులు నమోదు అయినట్లు ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ డేటా, వార్తా నివేదికల గణాంకాలు చెబుతున్నాయి. బల్లులు, ఎలుకలు, పాములు, బొద్దింకలు వంటివి ఆహారంలో కలవడం వల్ల పదార్థాలు విషపూరితంగా మారి, వాటిని తిన్న 12శాతం మంది పిల్లలు అనారోగ్యానికి గురైనట్లు తెలిపాయి. అధికంగా కర్ణాటకలో 1,524 కేసులు నమోదు కాగా ఒడిశాలో 1,327, తెలంగాణలో 1,092, బీహార్‌లో 950, ఆంధ్రప్రదేశ్‌లో 794 చొప్పున కేసులు నమోదయ్యాయి.

బీహార్‌లో మధుబని జిల్లాలో 2015లో 223 మంది పిల్లలు మధ్యాహ్న భోజనం తిన్న తర్వాత తల తిరగడం, కడుపు నొప్పితో ఇబ్బంది పడ్డారు. 2016లో మహారాష్ట్రలోని పాలఘర్ జిల్లాలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కిచిడి తిన్న 247 మంది అనారోగ్యానికి గురయ్యారు. 2017లో ఉప్మా తిన్న 221 మంది వాంతులు, కడుపు నొప్పితో బాధపడిన ఘటన కర్ణాటకలోని బెళగామ్‌లో జరిగింది. 2009 నుంచి ఇలాంటివి మొత్తం 232 ఘటనలు చోటుచేసుకున్నాయి. నాసిరకం మధ్యాహ్న భోజనానికి పేలవమైన మౌలిక వసతులు, తగిన విధంగా పర్యవేక్షణ లేకపోవడం, అక్రమంగా లైసెన్సులు పొందిన వారు ఉండటం, రిపోర్టింగ్ పరిమితంగా జరగడం, తగిన ఫీడ్‌బ్యాక్ యంత్రాంగాలు లేకపోవడమే కారణాలని దశాబ్దం పాటు అనేక రాష్ట్రాల్లో నిర్వహించిన ఆడిట్‌ల తర్వాత కాగ్ తేల్చింది. 2019లో మధ్యప్రదేశ్‌లో కాగ్ ఆడిట్ నిర్వహించింది. కలుషిత ఆహారం కేసుల గురించి భారత ఆహార భద్రతా, ప్రమాణాల యంత్రాంగం (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ)కి సమాచారం ఇచ్చేలా వైద్యులకు ఆదేశాలు లేవని గుర్తించింది. 2014-19లో నమోదు అయిన కేసుల వివరాలేమీ ఆహార భద్రతా కమిషనర్‌కు తెలియకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. 2014 ఆగస్టులో హోషంగాబాద్ జిల్లాలో 110 కేసులు వివరాలు లేకపోవడం కాగ్ దృష్టికి వచ్చింది. డేటా సేకరణ జరగని కారణంగా ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు (ఎఫ్‌బీఓ)పై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. 2015-16లో మధ్యప్రదేశ్‌లోని 14,500 స్కూళ్లలో మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు వంటశాలలకు తగిన స్థలాలు/షెడ్లు లేవని కాగ్ గుర్తించింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని 40శాతం స్కూళ్లలో వంట చేసేందుకు షెడ్లు లేనట్లు 2016లో కాగ్ దృష్టికి వచ్చింది. చత్తీస్‌గఢ్‌లో 2011-2015లో నిర్వహించిన సర్వేలో 8,932 స్కూళ్లలో వంట స్థలాలు పరిశుభ్రంగా లేవని తెలిపింది. 2018లో గుజరాత్‌లోని వల్సాద్ జిల్లాలో స్కూళ్లను పర్యవేక్షించి అక్కడ ఎన్జీవోలు వేడిగా భోజనం వడ్డించడం లేదని గుర్తించింది. ఈ రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లోని 80శాతం స్కూళ్ల పర్యవేక్షణ డిప్యూటీ కలెక్టర్ల ద్వారా జరగలేదని, ఇందుకు సిబ్బంది కొరతే కారణమని వెల్లడించింది. ఎఫ్‌బీఓల పర్యవేక్షణ లేకుండానే 2017లో హిమాచల్ ప్రదేశ్‌లో 97శాతం నుంచి 100శాతం లైసెన్సుల జారీ, రిజిస్ట్రేషన్లు జరిగినట్లు కాగ్ తెలిపింది.

తెలంగాణ వైతాళికుల త్యాగాలను

భావితరాలకు తెలియజెప్పాలి

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ సభలో కేటీఆర్

విశాలాంధ్ర ప్రతినిధి- రాజన్నసిరిసిల్ల: తెలంగాణ పోరాట యోధులు, మహనీయుల గొప్పదనాన్ని గుర్తించి గర్వపడే సంస్కారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. పట్టణంలోని మానేరు నది సమీపంలో ఎల్లమ్మ గుడి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని మంగళవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడిన వెంటనే ఎవరూ అడగకుండానే తెలంగాణ వైతాళికుల త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలిసేలా చేసేందుకే నూతన జిల్లాలు, విశ్వవిద్యాలయాలు, సంస్థలకు వారి పేర్లు పెట్టామని గుర్తు చేశారు. ఉద్యానవన విశ్వద్యాలయానికి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టడమే దీనికి ఉదాహరణ అని చెప్పారు. స్వాతంత్ర్యోద్యమం సహా తెలంగాణ ఉద్యమంలో బాపూజీ చేసిన పోరాటాలు మరువలేనివి అని పేర్కొన్నారు. పోరాట యోధులకూ సహకారం అందించారని తెలిపారు. అప్పటి ప్రభుత్వం బాపూజీ ఇంటిని ఎక్కడైతే తీసి బయట పడేశారో అక్కడే 20 అడుగుల కొండా లక్ష్మణ్ విగ్రహాన్ని నేడు ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణ వైతాళికుల గొప్పదనాన్ని భవిష్యత్తు తరాలకు తెలియజేసేందుకే విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

సిరిసిల్లలో కొత్త చెరువు ట్యాంక్ బండ్, కొత్త జంక్షన్‌ల వద్ద మహనీయుల విగ్రహాలు పెట్టుకుందామని చెప్పారు. మీ ఆశీస్సుల వల్లే ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. జిల్లాలో జరిగిన అభివృద్ధి చాలదు... ఇంకా జరగాల్సింది చాలా ఉంది... దశల వారీగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని పేర్కొన్నారు. వరంగల్‌లో 1250 ఎకరాలలో మెగా టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణం జరుగుతుందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు సిరిసిల్ల లో నేతన్నల ఆత్మహత్యలను చూసి కేసీఆర్ చలించి నేతన్నల సంక్షేమం కోసం రూ. 50 లక్షలు విరాళాలు సేకరించి ఆర్థిక సహాయం అందజేశారన్నారు. స్వరాష్ట్రం లో నేతన్నల అభివృద్ధికి ఇచ్చే రూ. 70 కోట్ల బడ్జెట్‌ను రూ. 1200 కోట్లకు పెంచామని తెలిపారు. నేతన్నల సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించి ఆపెరల్ పార్క్, వీవర్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నేతన్నబీమా పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, తెలంగాణ మర మగ్గాలు, జౌళి అభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షుడు గూడూరి ప్రవీణ్, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణా రాఘవరెడ్డి, కలెక్టర్ అనురాగ్ జయంతి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీపై

కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు: మంత్రి పువ్వాడ

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేయాల్సిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం సాధ్యం కాదని చెప్పడంపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా టిఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పువ్వాడ మీడియాతో మాట్లాడారు. విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వం బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తామని, ఖాజీపేటలో రైల్వే కోచ్ నిర్మాణం, గిరిజన యూనివర్సిటీ మంజూరు చేస్తామని వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. హామీలను నెరవేర్చకుండా తెలంగాణకు కేంద్రం మొండి చేయి చూపిస్తోందని మంత్రి విమర్శించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా పనిచేస్తున్న కిషన్ రెడ్డి తెలంగాణ ప్రజలకు ఉపయోగపడే బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం కృషి చేయాల్సింది పోయి బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం సాధ్యం కాదని చెప్పడం సరైనది కాదని అన్నారు. తెలంగాణ యువత కోసం కనీసం ఉక్కు ఫ్యాక్టరీ సాధనకైనా కృషి చేయాలని హితవు పలికారు. బయ్యారంలో ఫ్యాక్టరీ నిర్మాణానికి కావాల్సిన అన్ని అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. పెద్ద ఎత్తున ముడిసరుకు నిక్షేపాలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికైనా తన వైఖరి మార్చుకొని ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పువ్వాడ డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ రావు, నగర మేయర్ పునుకుల్ల నీరజ, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం , టిఆర్ఎస్ అధ్యక్షులు పగడాల నాగరాజు, సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్, టిఆర్ఎస్ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

తేలని పంచాయితీ

(మొదటిపేజీ తరువాయి)

చూపడంలో కేంద్రం మరోసారి మెతక వైఖరి అవలంభించింది. ఈ సమావేశం అనంతరం తెలంగాణ ప్రభుత్వ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. షెడ్యూలు-9లోని సంస్థల విభజనకు షీలాబిడే కమిటీ మొత్తం 90 సంస్థల విభజనకు ప్రతిపాదించిందన్నారు. ఆ మేరకు వివాద పరిష్కారానికి హోం శాఖ ఉప కమిటీ నియమించిందని, 90 సంస్థలను 3 భాగాలుగా విభజించారని పేర్కొన్నారు. 53 ప్రభుత్వ రంగ సంస్థల విభజనకు ఏకాభిప్రాయం ఉందని, 15 సంస్థలకు తెలంగాణ అంగీకరిస్తే, ఆంధ్రప్రదేశ్ ఒప్పుకోలేదని వివరించింది. 22 సంస్థల విషయంలో తెలంగాణ అంగీకరించలేదని, వాటిపై తెలంగాణ హైకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపింది.

25 సార్లు భేటీ వృథా

రెండు రాష్ట్రాల విభజన అంశాల పై ఇప్పటివరకూ 25 సార్లుగా ఢిల్లీ కేంద్రంగా నిర్వహించిన సమావేశాలు వృథాగా మారాయి. ఈ ఏడాదిలో ఢిల్లీ కేంద్రంగా ఇది నాలుగో భేటీ కొనసాగినా ఫలితం లేదు. విభజన అంశాలను కొలిక్కి తేవడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరి అవలంభిస్తోంది. ఆది నుంచి తెలుగు రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష చూపుతోంది. మొక్కుబడిగా హోం మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో ఉన్నత స్థాయి సమావేశాలను నిర్వహించి హడావుడీ చేస్తుందేగానీ సమస్య పరిష్కారంపై చొరవ చూపడం లేదు. ప్రతి ఏటా కేంద్ర బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి పూర్తిగా అన్యాయం చేస్తోంది. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల పంపిణీలో వివక్ష చూపుతోంది. ప్రత్యేక హోదా అంశాన్ని పూర్తిగా మరుగున పడేసింది. గత ఎన్నికల సమయంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామంటూ మోదీ చేసిన ప్రకటన అమలుకు నోచుకోలేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలకు మోదీ నిధులను కేటాయించి, మిగిలిన రాష్ట్రాలను చిన్న చూపు చూస్తున్నారనే విమర్శలున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోంది. పార్లమెంటులో చేసే బిల్లులకు సంపూర్ణ మద్దతిస్తోంది. అటు తెలంగాణ సీఎం కేసీఆర్‌తో జగన్ సన్నిహితంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రధాని మోదీ, తెలంగాణ సీఎం కేసీఆర్‌తో జగన్ భేటీలు నిర్వహించి, గట్టిగా విభజన సమస్యలపై మాట్లాడితే కొంత వరకైనా పరిష్కారమయ్యేవి. మూడేళ్ల నుంచి మోదీతో జగన్ భేటీలు నిర్వహించినా నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా సీఎం మేల్కొని రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉంది.

ఆరోగ్యశ్రీ సేవల్లో

తెలంగాణ భేష్!

- 34 నుంచి 53 శాతానికి పెరుగుదల
- ఆయుష్మాన్ ఉత్కృష్ణత పురస్కారం అభినందనీయం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు 34 శాతం నుంచి 53 శాతానికి పెరిగాయని రాష్ట్ర ఆర్థిక, వైద్యఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలులో తెలంగాణ ఉత్తమ రాష్ట్రంగా నిలిచినందుకు ఆరోగ్య మంథన్ -2022 లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఆయుష్మాన్ ఉత్కృష్ణత పురస్కారం అందజేయడాన్ని పురస్కరించుకుని ఆరోగ్య, వైద్య సిబ్బందికి మంగళవారం మంత్రి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ, 2020-21లో 34 శాతం అంటే 88,467 సర్జరీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగాయని, 2021-22లో ఆరోగ్య శ్రీ సర్జరీలు 43 శాతం అంటే 1,52,096 సర్జరీలు పెంచగలిగామని వివరించారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికే 1,14,681 సర్జరీలు జరిగాయని, అంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సర్జరీలు 53 శాతంకు పెంచగలిగామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడం, ఎంఆర్ఐ స్కాన్, సిటీ స్కాన్, క్యాథ్ ల్యాబ్ వంటి ఆధునిక సదుపాయాలు కల్పించడం వల్ల సేవలు, సర్జరీలు 34 నుంచి 53 శాతానికి అంటే 18 శాతం పెరిగాయన్నారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో మినహా మిగతా అన్ని జిల్లాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అధికంగా ఆరోగ్య శ్రీ సేవలు అందుతున్నాయని వివరించారు. ఆయా జిల్లాల ఆసుపత్రుల్లో ఎందుకు తగ్గాయో సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. కారణాలు అన్వేషించాలన్నారు.

ఈడబ్ల్యూఎస్ కోటాపై సుప్రీం తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసుకు సంబంధించిన తీర్పును రిజర్వ్ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్, న్యాయమూర్తులు జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ రవీంద్ర భట్, జస్టిస్ త్రివేది, జస్టిస్ పార్దీవాలాతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసును విచారించింది. రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ అనేక మంది సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఈ కేసుకు సంబంధించి ప్రధాన వ్యాజ్యాన్ని 'జనహిత్ అభియాన్' అనే సంస్థ 2019లో దాఖలు చేసింది. 103వ సవరణ... రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని మార్చేస్తోందని పేర్కొంటూ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వీటితో పాటు సుమారు 40 వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం.. ఆరున్నర రోజుల పాటు సుదీర్ఘంగా విచారణ జరిపింది. కేంద్రం ప్రత్యేక నిబంధనలు రూపొందించడానికి అనుమతించే 103వ రాజ్యాంగ సవరణ.. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని అతిక్రమిస్తోందా అన్న విషయాన్నీ పరిశీలించింది. వాదనలు విన్న తర్వాత తీర్పు రిజర్వు చేసింది.ఉన్నత వర్గాల్లోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో అక్రమంగా తొలగించిన ఉద్యోగస్తులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్ల యూనియన్ (ఏఐటీ యూసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజనికి మంగళవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మునియప్ప, పూదోట ప్రకాష్ వినతిపత్రం అందజేశారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో దాదాపు రెండు దశాబ్దాల నుంచి రేడియోగ్రాఫర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులు, పంప్ ఆపరేటర్లు, విద్యుత్ విభాగం సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు. వారికి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా మార్చి 31న అకారణంగా తొలగించారన్నారు.

జగన్ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీ కరిస్తామని చెబుతుంటే, ఇక్కడ అధికారులు మాత్రం ఉన్న ఉద్యోగాలను తీసేస్తూ, కొత్త ఉద్యోగాలు కాసులకు అమ్ముకుంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే అధికారులపై చర్యలు తీసుకోవాలని, అక్రమంగా తొలగించిన ఉద్యోగులకు తిరిగి విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఉద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుమార్, వేణుగోపాల్, ఖాదర్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేద్దాం

- ఆర్గానిక్ పాల ఉత్పత్తిపై దృష్టి
- తక్కువ పెట్టుబడి, అధికోత్పత్తిపై నిత్య పరిశోధనలు
- పశు వైద్యుడి కాన్సెప్ట్‌కు చర్యలు
- పశుసంవర్ధకశాఖపై సీఎం జగన్ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి తక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ప్రతి ఆర్బీకేలోనూ ఈ పోస్టులు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆర్గానిక్ పాల ఉత్పత్తిపై దృష్టిసారించాలని, తక్కువ పెట్టుబడి, సేంద్రీయ ఉత్పత్తుల ద్వారా స్వచ్ఛమైన పాల ఉత్పత్తి సాధించే అంశంపై పరిశోధనలు చేపట్టాలని, తర్వాత ఆ ఫలితాలను రైతులకు అందించే చర్యలు తీసుకోవాలని సూచించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పశువుల ఆస్పత్రుల్లో నాడు- నేడు, పశువులకు బీమా, ఫ్యామిలీ డాక్టర్ తరహాలో పశువులకు వైద్య సేవలు తదితర అంశాలపై సీఎం మంగళవారం సమీక్షించారు. జగన్ మాట్లాడుతూ స్వచ్ఛమైన పాల ఉత్పత్తి కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పురుగుమందులు, రసాయనాలు ఎక్కువగా వాడుతున్నందున అవి జంతువుల్లోకి ఆహారం, వివిధ రూపాల్లో చేరి తద్వారా పాలల్లో వాటి అవశేషాలకు దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకనే స్వచ్ఛమైన పాల ఉత్పత్తిపై రైతులకు అవగాహన పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అమూల్‌ద్వారా పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ఆలోచన చేయాలని సూచించారు. పాలు, గుడ్లు వాడితే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, వాటిని వినియోగిస్తాం కాని, అవే పాలలో రసాయన అవశేషాల కారణంగా పిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందనే పరిస్థితులను చూస్తున్నామన్నారు. ఆరోగ్యవంతమైన పిల్లల ద్వారానే మంచి భవిష్యత్తు తరాలు నిర్మాణమవుతాయన్నారు. పశు యాజమాన్యంలో ఉత్తమ పద్ధతులపై రైతులకు అవగాహనను నిరంతరం కల్పించాలన్నారు. వైయస్సార్ చేయూత, ఆసరా ద్వారా కొనుగోలు చేసిన పశువులన్నింటికీ బీమా ఉందా?లేదా? అనేది మరోసారి పరిశీలించాలని, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను హెచ్చరించారు. ఎందుకంటే ప్రమాదవశాత్తూ రోగాల వల్ల పశువులు చనిపోతే రైతులు తీవ్రంగా నష్టపోవల్సి వస్తుందన్నారు. ఇలాంటి సమయంలో వారికి అండగా నిలిచేందుకు ఈ పథకం తోడ్పడుతుందని, దీనికయ్యే ఖర్చులో 80శాతం ప్రీమియాన్ని ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. పశువులకు పౌష్టికాహారం అందించే విషయంలో రైతులకు తగిన అవగాహన కల్పించాలని, సాయిల్ డాక్టర్ మాదిరిగా కేటిల్ డాక్టర్ కాన్సెప్ట్ కూడా అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ఏటా క్రమం తప్పకుండా పశువుల ఆరోగ్యాలను పరిశీలించి, పరీక్షించి వాటి వివరాలను పశు ఆరోగ్య కార్డుల్లో పొందుపర్చాలని సూచించారు. అనంతరం పశువుల ఆస్పత్రుల్లో నాడు - నేడు కింద చేపడుతున్న మౌలిక సదుపాయాల కల్పన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలం ఒక యూనిట్‌గా తీసుకుని ప్రతిచోటా వెటర్నరీ వైద్య సదుపాయాలు ఉండేలా సమగ్ర ప్రణాళిక అమలు చేయాలని చెప్పారు. వైయస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలపై నిరంతరం సమీక్ష చేయాలని, రెండోదశ కింద అక్టోబరులో మరిన్ని పశు అంబులెన్స్‌లు ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. ఆర్బీకేల ద్వారా పశువులకు ఆరోగ్య సేవలను ఫ్యామిలీ డాక్టర్ తరహాలోనే గ్రామాల్లోని పశువులకూ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు సిబ్బందినీ నియమించుకోవాలన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయాలు పశుపోషణ ద్వారా వచ్చేలా చూడాలని, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని సీఎం ఆకాంక్షించారు. సమావేశంలో పశు సంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, అగ్రి మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, పశు సంవర్ధక శాఖ స్పెషల్ సీఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ ఆర్. అమరేంద్ర కుమార్, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మోదీ సర్కారును సాగనంపుదాం

బీవీ రాఘవులు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: నరేంద్ర మోదీ ప్రభుత్వం నుంచి దేశాన్ని, ప్రజలను కాపాడుకోవడమే తక్షణ కర్తవ్యమని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. ఈ నెల 14 నుంచి 27 వరకు దేశవ్యాప్తంగా 'దేశ రక్షణ భేరి' కార్యక్రమాన్ని సీపీఎం నిర్వహించింది. అందులో భాగంగా చివరి రోజైన మంగళవారం సీపీఎం విశాఖపట్నం జిల్లా కమిటీ అధ్వర్యంలో విశాఖలో సరస్వతీ పార్కు నుండి డాబాగార్డెన్స్, ఎల్ఐసీ బిల్డింగ్ మీదుగా వైఎస్ఆర్. సెంట్రల్ పార్కుకు మహాప్రదర్శన జరిగింది. ప్రదర్శనలో బీవీ రాఘవులతో పాటు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కె.లోకనాధం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులందరూ ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం జగ్గునాయుడు అధ్యక్షతన సెంట్రల్ పార్కు వద్ద బహిరంగ సభ జరిగింది. సభలో రాఘవులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీ వంటి బడా పెట్టుబడిదారులకు దేశ సంపదను దోచుపెడుతున్నదని విమర్శించారు. ప్రపంచంలో చమురు ధరలు తగ్గుతున్నా దేశంలో పన్నులపై పన్నులు వేసి ప్రజలపై భారాలు మోపుతున్నదని మండిపడ్డారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మేధావులు సైతం మోదీ ప్రభుత్వ విధానాల వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా రాజ్యాంగ హక్కులను, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. మరోవైపు రాష్ట్రాల హక్కులను హరిస్తోందన్నారు. ఏపీకి ప్రత్యేకహోదా, రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టు, అమరావతి, ఇతర విభజన హామీలు ఒక్కటీ అమలు చేయలేదన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకపోగా...విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయడానికి సిద్ధపడటం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. రాష్ట్రానికి ఇంత నష్టం జరుగుతున్నా వైసీపీ ప్రభుత్వం బీజేపీని ఒక్క మాట కూడా అనడం లేదని అన్నారు. బీజేపీకి ఎదురుతిరుగుతున్న కేరళలో వామపక్ష ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు మతోన్మాద చర్యలకు పూనుకుంటోందన్నారు. ఇటువంటి దుర్మార్గపు పాలన అంతం కావాలంటే మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని అన్నారు. వామపక్ష పార్టీలు చేపట్టే ప్రజా ఉద్యమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి, ఆంధ్ర మాల్యాద్రి, జిల్లా నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.పద్మ, బి.గంగారావు, బి.ఈశ్వరమ్మ, కేఎం శ్రీనివాస్, బి.జగన్, బి.రమణి, వీఎస్.పద్మనాభరాజు, పి.వెంకటరెడ్డి, ఎం.రాంబాబు, వి.నరేంద్రకుమార్, ఎం.సుబ్బారావు, శ్రీనివాస్ రాజు, యూఎస్ఎన్ రాజు, అప్పలరాజు పాల్గొన్నారు.

పరిశోధనలపై కేంద్రం దృష్టి

- ఏఐసీటీఈ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ బుద్దా చంద్రశేఖర్
- ఏఐసీటీఈ-ఎస్ఆర్ఎం మధ్య ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పరిశోధనల పరంగా భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం విస్తృతంగా కృషి చేస్తోందని అఖిల భారత సాంకేతిక విద్యామండలి ముఖ్య సమన్వయ అధికారి డాక్టర్ బుద్దా చంద్రశేఖర్ చెప్పారు. ఇందులో భాగంగా దేశంలోని 330 విద్యాసంస్థల నుంచి 13 వేల మంది విద్యార్థులను ఎంపిక చేసే ప్రక్రియ మొదలైందని, వీరందరినీ వివిధ రంగాల్లో పరిశోధనలకు ప్రోత్సహించనున్నామని తెలిపారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 'రీసెర్చ్ డే' సందర్భంగా మంగళవారం ఉదయం ప్రత్యేక సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ చంద్రశేఖర్...విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు, ప్రొఫెసర్లను ఉద్దేశించి ప్రసంగించారు. నేషనల్ లాంగ్వేజ్ ప్రాసెస్ అభివృద్ధిలో భాగంగా ఏఐసీటీఈ దేశంలోని 20 అధికార భాషల అనుసంధాన ప్రక్రియను విజయవంతం చేసేందుకు సరికొత్త అప్లికేషన్, టూల్స్ డిజైన్ చేస్తుందన్నారు. దీనివల్ల భాషల అనుసంధానం జరిగి రీసెర్చ్, వ్యాపారం, విద్య, ఆరోగ్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు ఒనగూరి భారత్ అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. ఇందుకోసం వివిధ యూనివర్సిటీల నుంచి ప్రతిభ గల విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నామన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నుంచి 40 మంది విద్యార్థులను ఇందుకోసం ఎంపిక చేసుకోనున్నామన్నారు. వైస్ చాన్సలర్ ఆచార్య డి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు పరిశోధనలపై సమగ్ర అవగాహన పెంచేందుకు యూనివర్సిటీ పరిధిలో రీసెర్చ్ డే నిర్వహిస్తున్నామన్నారు. ఏఐసీటీఈ ప్రతిపాదనలను ఉటంకిస్తూ, ఏఐసీటీఈ-ఎస్ఆర్ఎం మధ్య పరిశోధనలపరంగా సరైన ఒప్పందం జరిగిన తరువాత సెంటర్ ఫర్ ఎకిలెన్స్ ఏర్పాటుకు సమగ్ర ప్రాజెక్టును తయారు చేస్తున్నామన్నారు. 2023 డిసెంబరు నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్దేశించుకున్నామని వివరించారు. ఈ సందర్భంగా వివిధ పరిశోధనా పత్రాల రూపకల్పనలో ప్రతిభ కనబర్చిన రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బంగారు పతకాలను ప్రదానం చేశారు. డాక్టర్ చంద్రశేఖర్‌ను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమకుమార్, డీన్ డాక్టర్ బీవీ బాబు, అసోసియేట్ డీన్ రఘునాథ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వినాయక్, రీసెర్చ్ కన్వీనర్ డాక్టర్ రంజిత్ థాపా, ప్రొఫెసర్లు మణికందన్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలుపై హర్షం

సీఎంను కలిసిన ఆర్టీసీ ఉద్యోగులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎం జగన్‌ను ఆర్టీసీ ఉద్యోగులు కలిశారు. పీఆర్సీ అమలుపై సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఏపీ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ, జగన్ ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగుల్ని ప్రభుత్వంలోకి తీసుకున్నారన్నారు. కరోనా సమయంలోనూ వేతనాలకు ఇబ్బంది లేకుండా చేశారని కొనియాడారు. అక్టోబరు 1 నుంచి పీఆర్సీ అమలు చేస్తామని చెప్పడంతో హర్షం వ్యక్తం చేశారు. గురుకుల, ఎయిడెడ్, యూనివర్సిటీ ఉద్యోగుల వయోపరిమితి పెంపు, పెన్షన్ తదితర అంశాల్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. పదోన్నతుల దస్త్రాన్ని సైతం ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌ఫోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఏపీపీటీడీ) వైఎస్ఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు చల్లా చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇనుపయుగపు ఆనవాళ్లు కాపాడుకుందాం: ఈమని

> గంగలకుంటలో క్రీస్తుపూర్వం వెయ్యేళ్లనాటి సమాధులు, అతిపెద్ద స్మారక శిలలు!

విశాలాంధ్ర-వెల్దుర్తి/మాచర్ల/విజయవాడ: పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గంగలకుంటలో క్రీస్తుపూర్వం వెయ్యేళ్లనాటి ఇనుపయుగపు ఆనవాళ్లు కనుమరుగౌతున్నాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. మాచర్లకు చెందిన ఔత్సాహిక చరిత్రకారుడు పావులూరి సతీష్ బాబు ఇచ్చిన సమాచారం మేరకు ఆయన మంగళవారం గంగలకుంటలో ఇనుపయుగపు సమాధులు, నిలువురాళ్లను పరిశీలించారు. గ్రామానికి నైరుతి దిక్కులో కృష్ణానది కుడిగట్టుపైన గల ముగ్గదిన్నె కాలువకు అటూ ఇటూ దాదాపు 3 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన 1000కి పైగా ఇనుపయుగపు స్మారక కట్టడాలను అవగాహన లేక వ్యవసాయ పనుల్లో భాగంగా స్థానికులు తొలగిస్తున్నారని, తద్వారా ఆంధ్రప్రదేశ్ చరిత్రకు ఆధారాలు లేకుండా పోయే ప్రమాదముందని ఆయన అన్నారు. 5 నుంచి 10 మీటర్ల వ్యాసంతో, 1 నుంచి 2 మీటర్ల ఎత్తులో నాపరాళ్లను గుండ్రంగా పేర్చి, ఆపైన గులకరాళ్లతో ఉబ్బెత్తుగా అమర్చారని, ఈ సమాధుల్లో నాలుగురాళ్లను ఒక గదిలా అమర్చి అందులో శవాలను పాతిపెట్టి పైన కప్పు బండల్ని పెట్టారని చెప్పారు. ఈ సమాధులకు ఉత్తరం వైపు 10 నుంచి 25 అడుగుల ఎత్తు, 3 నుంచి 5 అడుగుల వెడల్పు, 6 అంగుళాల మందంగల నిలువు రాళ్లను చనిపోయిన వారికి గుర్తుగా నిలిపారని, ఆ నిలువురాళ్ల బయటి భాగంపై ఎద్దు, చదరం, గంద్రం, ముగ్గును పోలిన రేఖాచిత్రాలున్నాయని, ఇవి ఇనుప యుగపు అంత్యక్రియ పద్ధతుల్ని తెలియజేస్తున్నాయని శివనాగిరెడ్డి వివరించారు.

ఇక్కడున్న 25 అడుగుల నిలువురాయి (శిల) రాష్ట్రంలోనే అతి పెద్దదని, దాన్ని కాపాడుకుని భావి తరాలకు అందించాలని స్థానిక రైతులు, గొర్రెల కాపర్లు, గ్రామాధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. గతంలో రైతులు నీటి గొట్టాలు వేసినప్పుడు, మైనింగ్ వల్ల దాదాపు 500 సమాధులు, 700 నిలువురాళ్లు ధ్వంసమయ్యాయని శివనాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ఇనుపయుగపు సమాధులు, నిలువరాళ్ల (మెన్‌హిర్‌లు) చారిత్రక ప్రాధాన్యత, పరిరక్షించాల్సిన అవసరంపై స్థానికులకు అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన నెమలితోక మల్లయ్య ... గతంలో ఇక్కడ వందలాది నిలువు రాళ్లు, రాకాసి గుళ్లు ఉండేవని, ఇప్పుడు పదో పదిహేనో మిగిలి ఉన్నాయని ఈ సందర్భంగా చెప్పారు. మాచర్లకు చెందిన ఉప్పుతోళ్ల రమేష్, యువ పురావస్తు పరిశోధకుడు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అమరావతే రాజధాని!

- ఉత్తరాంధ్ర భూములు దోచుకోవడానికే తెరపైకి మూడు రాజధానులు...
- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు 'కన్నా'

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా అమరావతే ఉంటుందనీ, ఉత్తరాంధ్రలో విలువైన భూములను దోచుకోవడానికే తెరపైకి మూడు రాజధానుల అంశాన్ని వైసీపీ తీసుకువచ్చిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. విశాఖలో మంగళవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర సంపదను ఏకీకృతం చేసి దోచుకున్న వ్యక్తి జగన్ అని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు బతకలేని పరిస్థితి ఉందన్నారు. జగన్ ప్రభుత్వమే లిక్కర్ వ్యాపారం చేయడంతో రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిందని కన్నా తెలిపారు. జగన్ సీఎంగా ఉండడం దురదృష్టకరమని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతం ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడమేనని అన్నారు. అమరావతి యాత్ర ను అడ్డుకుంటామని చెప్పడం దారుణమన్నారు. యాత్రకు హైకోర్ట్ అనుమతి ఇచ్చిందని, బీజేపీ పూర్తి మద్దతు ఇస్తోందన్నారు. విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలు పెంచారని, చివరకి చెత్తపై కూడా పన్ను వేశారన్నారు. ఉత్తరాంధ్రలో రాజధాని రైతులు పాదయాత్ర చేస్తే ఊరుకోబోమని వైసీపీ నేతలు అంటున్నారనీ, ఇదేమైనా వారి సొంత జాగీరా? అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణు కుమార్ రాజు ప్రశ్నించారు. జగన్ సర్కారు అమరావతి రైతులను మానసిక క్షోభకు గురిచేస్తోందని, అవసరమైతే కేంద్రం జోక్యం చేసుకుంటుందని హెచ్చరించారు. ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రారంభించిన సీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: క్యాంపు కార్యాలయంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం-2022 వేడుకలను మంగళవారం సీఎం జగన్ ప్రారంభించారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధిలో భాగంగా విజిట్ ఆంధ్రప్రదేశ్-2023 ప్రచార పత్రాలను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో సులువుగా పర్యాటక ప్రదేశాలను గుర్తించేందుకు వీలుగా రూపొందించిన జీఐఎస్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. పర్యాటక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తూ పర్యాటక, ప్రయాణ, ఆతిథ్య రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనపరచాలని సీఎం సూచించారు. అరకు నుంచి వచ్చిన గిరిజన థింసా నృత్య కళాకారులతో సీఎం ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగడమే..

- భవనానికి తాళం వేసిన వర్సిటీ అధికారులు
- 2024 వరకు గడువుందంటూ
- కోర్టును ఆశ్రయించిన జన శిక్షణ సంస్థాన్

విశాలాంధ్ర-విశాఖ సిటీ: ఆస్తుల పరిరక్షణకు ఆంధ్ర విశ్వవిద్యాలయ అధికారులు తీసుకుంటున్న చర్యలు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నాయి. మద్దిలపాలెం పిఠాపురంకాలనీ జన శిక్షణ సంస్థాన్‌కు గతంలో జరిపిన కేటాయింపులు వివాదాస్పదంగా మారాయి. వివరాల్లోకి వెళితే... విశ్వవిద్యాలయ అధికారులు 1991లో పిఠాపురం కాలనీలోని కొంత స్థలాన్ని జన శిక్షణ సంస్థాన్‌కు లీజుకిచ్చారు. ఇప్పటికీ అదే స్థలంలో జన శిక్షణ సంస్థాన్ తమ కార్యకలాపాలు సాగిస్తోంది. 16 ఏళ్ల కాలపరిమితితో 2007 వరకు ఉండేలా అగ్రిమెంట్ చేసుకున్నారు. కాల పరిమితి ముగిసిన తర్వాత 2008లో మరో పదహారేళ్లు అంటే 2024 వరకు లీజు పొడిగించారు. అప్పుడు చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇప్పటికే ఉన్న భవనంతో పాటు పక్కనే ఉన్న మరికొంత స్థలాన్ని కూడా ఆ సంస్థకు అధికారులు కేటాయించారు. కాల పరిమితి ముగిసిన తర్వాత రెండు భవనాలను యూనివర్సిటీకి అప్పగించేలా ఒడంబడిక కుదుర్చుకున్నారు. దీంతో పాటు ఆయా భవనాల్లో జన శిక్షణ సంస్థాన్ ఏమైనా మార్పులు చేసినా, ఆధునీకరించినా ఏయూ అధికారుల అనుమతి తీసుకునేలా నిబంధన పెట్టారు.

2008 తరువాత సంస్థాన్‌కు ఏయూ కొత్తగా కేటాయించిన స్థలంలో భవన నిర్మాణం సగంలో నిలిచిపోయింది. కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించలేదంటూ కోర్టును ఆశ్రయించారు. ఈ అంశంలో ఆంధ్రా యూనివర్సిటీని కూడా చేర్చారు. దీంతో ఆ భవనం నిరుపయోగంగా ఉండిపోయింది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కొంతమంది అక్కడ మద్యం తాగడం, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు. దీంతో స్థానికులు, ఏయూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంతమేర కట్టడి చర్యలు తీసుకున్నప్పటికీ అసంపూర్తి నిర్మాణంతో పాటు ఆనుకొని ఉన్న వర్సిటీ స్థలాన్ని కలిపి యూనివర్సిటీకి సంబంధం లేని కొందరు వ్యక్తులు వివిధ ఫంక్షన్లకు కేటాయిస్తూ పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో వర్సిటీ అధికారులు ఆ భవనాన్ని జన శిక్షణ సంస్థాన్ నుంచి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నం చేశారు. దీంతో వివాదం మరింత ముదిరింది.

ఇదిలా ఉండగా, జన శిక్షణ సంస్థాన్ భవనం మొదటి అంతస్తులో ఆంధ్రా యూనివర్సిటీకి సంబంధించి సెమినార్లు, విద్యా సంబంధిత కార్యక్రమాలు 2012 వరకు జరిగేవి. ఇటీవల భవనంలో మరమ్మతు పనులు జరుగుతుండడంతో మొదటి అంతస్తులోని హాలుకు వర్సిటీ అధికారులు తాళాలు వేసి జన శిక్షణా సంస్థాన్ అధికారుల నుంచి వివరణ కోరారు. 2024 వరకు కాలపరిమితి ఉందనీ, తాళాలు వేయడానికి ఏయూ అధికారులకు ఎటువంటి అధికారం లేదని సంస్థాన్ అధికారులు కోర్టును ఆశ్రయించారు. తమ స్థలాన్ని తీసుకోవడమే కాక తమపై గలాటా సృష్టిస్తున్న సంస్థాన్ అధికారుల తీరు సరిగాలేదని ఈ విషయమై న్యాయ పోరాటం చేయనున్నట్టు ఏయూ అధికారులు చెబుతున్నారు. స్థలాన్ని లీజుకు తీసుకుని ఇప్పుడు ఏయూ అధికారులపైనే వివాదానికి దిగడం మంచిది కాదని విద్యావేత్తలు చెబుతున్నారు. ఈ వివాదం ఎన్ని మలుపులు తిరగనుందో వేచి చూడాల్సి వుంది.

ఉత్తరాంధ్ర మంత్రులు దద్దమ్మలు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ధ్వజం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ఉత్తరాంధ్ర మంత్రులు దద్దమ్మలు కావడం వల్ల ఉత్తరాంధ్ర అభివృద్ధి వెనుక బడిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజ రాపు అచ్చెన్నాయుడు అన్నారు. కొత్తమ్మతల్లిని మంగళవారం దర్శించుకున్న అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజధాని విషయమై ఆనాడు దేవాలయం వంటి అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్, అమరావతి రాజధాని అంటూ అక్కడే ఇల్లు కూడా కట్టుకుని ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాటమార్చడం దురదృష్టకరమన్నారు. మూడు రాజధానులంటూ ప్రాంతాలు, కులాలు, వర్గాల మధ్య చిచ్చుపెడుతూ 34వేల ఎకరాలు ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చిన రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు చెప్పుకొనేందుకు అమరావతి నుంచి అసంవల్లి వరకు మహా పాదయాత్ర చేస్తుంటే... ఎలా ఆపాలనే దృక్పథంతో పన్నాగాలు చేస్తున్నా రన్నారు. ఆబద్దాలకోరు జగన్‌ను అనుసరిస్తున్న ఉత్తరాంధ్ర మంత్రుల అసమర్థత వలనే అభివృద్ధిలో 10 ఏళ్లు వెనుకబడిందన్నారు. విశాఖలో ఆస్తులు దోచుకోవడాన్ని చూస్తూనే మంత్రి బొత్స సత్యన్నారాయణ ఇంకా నీతులు బోధిస్తున్నారని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. అమరావతి రైతులు చేపడుతున్న పాదయాత్రకు పార్టీలకు అతీతంగా మద్దతివ్వాలని పిలుపు నిచ్చారు. కోటబొమ్మాళి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, విజయమాధవి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల అధ్యక్షుడు రమేష్, మెండ దాసునాయుడు, సాసుమంతు ఆనందరావు, గొండు లక్ష్మణరావు, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను కార్పొరేట్లకు కట్టబెట్టడం దుర్మార్గం

593వ రోజుకు రిలే దీక్షలు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: పోరాటాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను కారుచౌకగా కార్పొరేట్లకు మోదీ కట్టబెట్టడం దుర్మార్గమని పోరాట కమిటీ నాయకుడు డీ ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతన్న రిలే దీక్షలు మంగళవారం 593వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ చరిత్రలోనే వేలాది మందిని మమేకంచేసి కేంద్ర నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం కొత్త చరిత్రకు నాంది అన్నారు. బీజేపీ మినహా అన్ని ప్రాంతీయ, జాతీయ పార్టీలు విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఆకాంక్షించాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రికి కూడా ఉత్తరాలు రాశాయన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న బీచ్ వాక్, ఉక్కు సత్యాగ్రహ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. గంధం వెంకటరావు, ఎస్.రామారావు, వరసాల శ్రీనివాసరావు, రామచంద్రరావు, రామకృష్ణ, వై.మస్తానప్ప, రాజాబాబు, గుమ్మడి నరేంద్ర, త్రినాథ్, రమణ శ్రీనివాస్, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ప్రతిపక్ష ఐక్యతపై కొత్త ఆశలు

లక్ష్య శుద్ధి ఉంటే గమ్యం చేరడం అసాధ్యం కాదు. మోదీ-అమిత్ షా ద్వయం పరిపాలనకు తిరుగులేదనీ, మోదీ ఉంటే అన్నీ సాధ్యమే అన్న ప్రచారార్భాటాలూ కొనసాగుతున్నా జనంలో మాత్రం మోదీ మీద వ్యతిరేకత పెరుగుతూనే ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందూ ఇలాంటి వాతావరణమే ఉన్నా ప్రతిపక్షాల అనైక్యత కారణంగా మోదీ నాయకత్వంలో బీజేపీ అంతకు ముందు కన్నా ఎక్కువ మెజారిటీతో అధికారం సంపాదించింది. 2024లో సార్వత్రిక ఎన్నికలలో మోదీని గద్దె దించాలన్న ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. రాష్ట్రపతి ఎన్నికలకు ముందు కూడా మాజీ కేంద్ర మంత్రి యశ్వంత్ సిన్హాను ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా నిలబెట్టడంలోనూ ప్రతిపక్షాల ఐక్యతా యత్నం కనిపించింది. ప్రతిపక్ష అభ్యర్థి యశ్వంత్ సిన్హా సైతం ప్రతిపక్ష ఐక్యత గురించే మాట్లాడారు. కానీ రాష్ట్రపతి ఎన్నికలలో ఓటమి తరవాత ఆయన మాటే వినిపించడం లేదు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్ర శేఖర రావు (కె.సి.ఆర్.) మొదలైన వారు ప్రతిపక్షాల ఐక్యత గురించి మాట్లాడుతున్నారు. కె.సి.ఆర్. కొన్ని రాష్ట్రాలలో పర్యటించారు కూడా. అయితే మమత, కె.సి.ఆర్. ప్రతిపక్ష ఐక్యతా యత్నాలలో ఓ సమస్య ఉంది. ఆ రెండు రాష్ట్రాలలో అధికార పార్టీలకు బలమైన ప్రత్యర్థి కాంగ్రెస్. అందుకని మమత, కె.సి.ఆర్. కాంగ్రెస్‌తో కూడిన ప్రతిపక్ష ఐక్యతకు సుముఖంగా లేరు. వీరు ప్రాంతీయ పార్టీల ఐక్య సంఘటనకు మొగ్గు చూపుతున్నారు. కానీ దేశమంతటా కాంగ్రెస్‌కే ప్రాబల్యం ఉంది. వచ్చే లోకసభ ఎన్నికలలో బీజేపీతో ఒక వేపు కాంగ్రెస్, మరో వేపు ఏదో ఒక రూపంలో ఐక్యమయ్యే ప్రతిపక్ష కూటమి పోటీ పడితే ముక్కోణపు పోటీ తప్పదు. ఇది అంతిమంగా బీజేపీకే ఉపకరిస్తుంది. అన్నింటికన్నా మించి కె.సి.ఆర్., మమతా బెనర్జీ తామే ప్రధానమంత్రి కావాలని భావిస్తున్నట్టున్నారు. వారిద్దరూ బహిరంగంగా ఆ మాట ఎన్నడూ చెప్పకపోయినా ఆంతర్యం అదే. మరో వేపు ఇటీవల పంజాబ్ శాసనసభ ఎన్నికల్లో అనూహ్యమైన విజయం సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ కూడా మోదీని ఢీకొనే ప్రయత్నంలోనే ఉన్నారు. ఆయనతో రెండు సమస్యలున్నాయి. కేజ్రీవాల్ ఇతర ప్రతిపక్ష పార్టీలతో కలిసే ఆలోచనలో లేరు. ఆయన విమర్శలు మొన్న మొన్నటిదాకా కాంగ్రెస్ మీదే ప్రధానంగా ఎక్కుపెట్టే వారు. ఇటీవలి కాలంలోనే మోదీతో తలపడే ధోరణిలో మాట్లాడుతున్నారు. ప్రత్యర్థులను సహించే లక్షణం ఏ మాత్రం లేని మోదీ ప్రభుత్వం ఆమ్ ఆద్మీ పార్టీ మంత్రి సత్యేంద్ర కుమార్ జైన్‌ను కొద్ది నెలల కింద జైలులో పెట్టడం, మొన్నమొన్ననే ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా మీదకు సీబీఐని ఉసిగొల్పడంవల్ల కేజ్రీవాల్ మోదీ వ్యతిరేక వైఖరి అనుసరించక తప్పలేదు. రెండవది సైద్ధాంతికంగా కేజ్రీవాల్ పార్టీ బీజేపీకి అనుకూలమైందే తప్ప మతతత్వాన్ని ఎదిరించే ఆలోచన ఉన్నది కాదు. ఆమ్ ఆద్మీ పార్టీ పలుకుబడి పెరగడానికి ప్రధాన కారణం కేజ్రీవాల్ కల్పించే ఉచిత సదుపాయాలేనని మోదీ భావిస్తున్నట్టున్నారు. వీటినే ఆయన తాయిలాల సంస్కృతి అని ఈసడించారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఉచితాలకు దూరంగా లేదు. ఆ మాటకు వస్తే అన్ని ప్రభుత్వాలూ ఏదో ఒకటి ఉచితంగా అందిస్తూనే ఉన్నాయి. మోదీని గద్దె దింపాలన్న ఆశ అనేక పార్టీలలో ఉన్నప్పటికీ ఏక సూత్రత లేదు.

బిహార్‌లో నితీశ్ కుమార్ బీజేపీతో తెగతెంపులు చేసుకుని లాలూ ప్రసాద్ యాదవ్ నాయకత్వంలోని రాష్ట్రీయ జనతా దళ్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ప్రతిపక్ష ఐక్యతపై కొత్త ఆశలు చిగురింప చేసింది. నితీష్ సోషలిస్టు భావాలు ఉన్నవారు. బీజేపీతో కలిసి ప్రభుత్వం నడిపినన్నాళ్లూ ఆయన ఇబ్బంది పడుతూనే ఉన్నారు. కడకు ఆయన చేరవలసిన గూటికి చేరారు. మూడు రోజులు ఢిల్లీలో పర్యటించి కాంగ్రెస్‌తో సహా అనేక పార్టీల నాయకులను సంప్రదించారు. ఇంకా ఆ దారిలోనే ఉన్నారు. ప్రతిపక్ష కూటమికి ఆయనే నాయకుడవుతాడు, ప్రతిపక్షాల తరఫున ప్రధానమంత్రి అభ్యర్థి కూడా ఆయనేనన్న ఊహాగానాలు సాగుతున్నాయి. కానీ నితీశ్ ఆ ఛాయలేమీ కనిపించనివ్వడం లేదు. సోమవారం ఇండియన్ నేషనల్ లోక్ దళ్ నాయకుడు చౌతాలా ఏర్పాటు చేసిన సమావేశానికి నితీశ్ హాజరయ్యారు. ఈ సమావేశానికి కాంగ్రెస్‌తో పాటు, మమతా బెనర్జీ, తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కె.సి.ఆర్., సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ హాజరు కాలేదు. వీరందరూ కాంగ్రెస్ రహిత ప్రతిపక్ష ఐక్యత కోరుకుంటున్నారు. అది వారి రాష్ట్రాలలో ఉన్న పరిస్థితికి అనుగుణమైన వ్యూహం అయితే కావచ్చు కానీ దేశవ్యాప్తంగా మోదీని ఓడించడానికి ఎంత మాత్రం ఉపకరించదు. లాలూ ప్రసాద్‌తో కలిసి నితీశ్ సోమవారం సోనియాగాంధీనీ కలుసుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి ఎన్నికలు పూర్తి అయిన తరవాత మాట్లాడదాం అని సోనియా చెప్పారు. నితీశ్ వ్యూహం ప్రకారం ప్రతిపక్ష ఐక్యత అంటే కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన ఐక్యతే. ఇప్పుడు ఏర్పడవలసింది మూడవ ఫ్రంట్ కాదు. ప్రతిపక్షాల ఫ్రంట్ మాత్రమేనన్న స్పష్టమైన అవగాహన నితీశ్‌కు ఉంది. ఈ ధోరణి కె.సి.ఆర్. లాంటి వారికి నచ్చకపోవచ్చు. బెంగాల్ రాజకీయాల దృష్టితో చూస్తే మమతా బెనర్జీకి కాంగ్రెస్, వామపక్షాలతో మైత్రి అసౌకర్యంగా ఉండొచ్చు. కానీ బీజేపీని ఓడించాలని కనక గట్టిగా భావిస్తే మమత దిగిరాక తప్పదు. ఎటొచ్చీ మోదీ మీద ఒంటికాలి మీద లేస్తున్న కేజ్రీవాల్ ఇతర ప్రతిపక్షాలతో కలిసి నడవడానికి అంగీకరించకపోవడం అంతిమంగా బీజేపీకి అనుకూలాంశం కావచ్చు. బీజేపీ ఇప్పటికే పటిష్ఠంగా ఉంది. తాను ఎప్పుడూ గెలవని స్థానాలలో విజయం సాధించడానికి అనువైన వ్యూహాలను రూపొందించడంలో బీజేపీ నిమగ్నమై ఉంది. కానీ దేశంలో హిందూ-ముస్లింల మధ్య ఏ గొడవా లేదనీ, అదంతా కృత్రిమంగా సృష్టిస్తున్నారని బీజేపీ నేతలు గట్టిగా ప్రచారం చేస్తున్నారని నితీశ్ కుమార్ చెప్తున్నారు. నితీశ్ అకాలీ నాయకుడు సుఖ్బీర్ బాదల్‌ను కూడా కలుసుకున్నారు. శివసేన, జె.డి.(యు), అకాలీ దళ్ లాంటివే అసలైన ఎన్.డి.ఎ. అని సుఖ్బీర్ కరాఖండిగా చెప్తున్నారు. వాస్తవానికి మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేరుకే ఎన్.డి.ఎ. సర్కారు. అందులో చెప్పుకోదగ్గ రాజకీయ పార్టీలు ఏమీ మిగల లేదు. తమకు మిత్రపక్షాలుగా ఉన్న పార్టీలను మింగేసే పథకాన్ని బీజేపీ పకడ్బందీగా అమలు చేస్తోందని అకాలీ దళ్, శివసేన లాంటివి అనుభవ పూర్వకంగా గ్రహించాయి. మోదీని గద్దె దించాలన్న ఏకైక లక్ష్యంతో ప్రతిపక్షాలు ఒక్కుమ్మడిగా పోరాడితే అసాధ్యం కాకపోవచ్చు. ప్రతిపక్షాలు విజయం సాధిస్తే ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరు అన్న చర్చ ప్రస్తుతానికి అనవసరం. నితీశ్ ఇదే మాట చెప్తున్నారు. విస్తృతమైన ప్రతిపక్ష ఐక్యత సాధ్యమైతే మోదీని ఓడించడం కష్ట సాధ్యం కావచ్చు కానీ అసాధ్యం అయితే కాదు. నితీశ్ నడుస్తున్న దారి ఆ దిశగానే ఉంది. ఆయనకు లక్ష్య శుద్ధి ఉంది. కావలసింది లక్ష్య సిద్ధి. అది బీజేపీకి వ్యతిరేకం అని చెప్పుకుంటున్న పార్టీల వైఖరి మీద ఆధారపడి ఉంటుంది.

సమాజానికి దూరంగా సంచార జాతులు

ఐ. ప్రసాదరావు

నేటికీ కోట్లాది మంది ప్రజలు అనేక కులాలు, జాతులకు చెందిన వారు సమాజానికి దూరంగా నివసిస్తున్నారు. ఇందులో అత్యంత ప్రధానంగా చెప్పుకోవలసిన వారు సంచార జాతులు. ఎక్కడా సరైన ఉపాధి లేకపోవడమే ఇందుకు కారణం. రోడ్లమీద పాములు ఆడిస్తూ, రకరకాల తమాషాలు, మేజిక్‌లు చేస్తూ, ఏ ఆధారం లేకుండా తాడు మీద నడుస్తూ పల్టీమొగ్గలు వేస్తూ చిన్నపాటి సర్కస్‌లు నిర్వహిస్తూ ఊరు చివర పాత సామాన్లు బాగుచేస్తూ కనపడుతూ ఉంటారు. ఇందుకోసం గ్రామంలో లేదా ఆయా ప్రాంతాల్లో తాత్కాలిక గుడిసెలు వేసుకొని నివాసం ఉంటే, కొన్ని సందర్భాల్లో ఆ ఊళ్ళో వాళ్ళే పై అధికారులకు ఫిర్యాదు చేయటం నేటికీ కనపడుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఈ జాతుల జీవితాలు చీకట్లు ముసురుకున్నాయి. కనీస అవసరాలు అయిన కూడు, గుడ్డ, గూడు లేవు. కనీసం రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ లేని పరిస్థితి ఏర్పడింది.

సమాజంలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరిగినా ముందుగా అభియోగాలు, అరెస్టులు, కేసులు ఈ సమూహాల ప్రజల మీదనే ముఖ్యంగా పురుషులపై నమోదు చేయుట పరిపాటిగా మారింది. మనదేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఈ జాతులు వారు ఉన్నారు. వీరి అభివృద్ధికి, కనీస అవసరాలు తీర్చడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరైన నిధులు మంజూరు చేయటం లేదు. ముఖ్యంగా విద్య, ఉపాధి కల్పించకపోవడం శోచనీయం. సుమారు 200 జాతులు కనీస అవసరాలు తీరక అలమటిస్తున్న పరిస్థితి. సంచార జీవులు కావడంతో కనీసం ఆధార కార్డు, ఓటరు గుర్తింపు కార్డు కూడా రావడం లేదు. దీంతో ప్రభుత్వాలు ఇచ్చే సంక్షేమ పథకాలేవీ వారికి అందటం లేదు. కనీసం ఆహార ధాన్యాలు కూడా దరిచేరడం లేదు. ఇలా సమాజంలో ఆర్థిక, సామాజిక అంతరాలతో, అవమానాలతో వారు మరింత కుంగిపోవడం అత్యంత బాధాకరమైన విషయం. ఈ దుస్థితిని వెంటనే మార్చాలి. వీరిలో ఆత్మ విశ్వాసం కల్పించాలి. ప్రపంచంలో నాలుగో పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలబెడతామని చెబుతున్న పాలకులకు ఈ దేశంలోని ఇలాంటి సంచార జాతులు కనపడడం లేదా? వీరి అభివృద్ధి కోసం ఏం చేస్తున్నారు? మన దేశ అభివృద్ధి మేడి పండు చూడ మేలిమై ఉండు అన్నట్లుగా ఉంది. ఇటీవల ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యు.యన్.డి.పి ప్రకటించిన 2021 మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ) ఈ వాస్తవాన్ని బహిర్గతం చేసింది. ఈ సూచికలో మన దేశం 132వ స్థానంలో ఉండుట మన అభివృద్ధి స్థాయిని, అసలు రంగును బయటపెట్టింది. మనదేశ పాలకులు ఇకనైనా సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవితాలు ఎలా ఉన్నాయో వాస్తవ పరిస్థితిని విశ్లేషణ చేయాలి. అదానీ అంబానీ అభివృద్ధే దేశాభివృద్ధి అనే భ్రమల నుంచి బయటపడాలి. ముఖ్యంగా సమాజంలో వెనుకబడిన అనేక కులాలు జాతులు మతాల వారికి రాజ్యాంగం కల్పించిన అన్ని వసతులు అందించాలి. దోపిడి, అవమానం, అణచివేతల నుండి ఈ జాతులను బయటపడేయాలి. ఈ దిశగా ఆలోచన చేయకపోగా వారిని మరింత వేధించే పనులకు ఈ ప్రభుత్వం పాల్పడుతోంది. ఎన్.పి.ఆర్, ఎన్.ఆర్.సి, సి.ఎ.ఎ అమలు జరిగితే ఇతర దేశాల నుంచి మనదేశానికి వచ్చిన జనాభా సంగతేమోగానీ, మనదేశంలో పుట్టి పెరిగిన ఈ సంచారుల జీవితాలు మాత్రం గందరగోళంగా మారతాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో కొన్ని స్వచ్ఛంద సంస్థలు "గ్రామీణ వికాస్ కేంద్ర, లోక్‌హిత్ సమాజిక్ వికాస్ సంస్థ, అనుభూతి ట్రస్ట్" లాంటివి ఇలాంటివారి అభివృద్ధికి అనేక రకాల సేవలు అందిస్తున్నాయి. మన ప్రభుత్వం కూడా ఐ.టి.డి.ఎ వంటి సంస్థలు ఏర్పాటు చేసి కార్యక్రమాలు చేపట్టింది కానీ బడ్జెట్లో కేటాయింపులు తగినంతగా ఉండడం లేదు. వీరికి భూములు కేటాయించి, వ్యవసాయం చేసుకోవడానికి అవకాశం కల్పించాలి. సంక్షేమ పథకాలు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి. వారి జీవన ప్రమాణాలు పెంచాలి.

వ్యాస రచయిత సెల్ 6305682733.

ముస్లింలను కలవడం కొత్త ఎత్తుగడ

అరుణ్ శ్రీవాస్తవ



దిల్లీలో భగవత్ మసీదు, మదర్సాలను సందర్శిస్తున్న సమయంలో యుపి, అసోంలలో సంఘ పరివార్ శక్తులు మదర్సాలపై ద్వేషం గక్కుతూ ప్రచారం చేస్తున్నారు. టెర్రరిజం, దాని భావజాలాన్ని విస్తరిస్తున్నారని, దాడులకు వ్యూహం పన్నారని, ముస్లిం పీపుల్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా కేంద్రాలపై దర్యాప్తు అధికారులు చేస్తున్నారు. మదర్సాలలో ఏ అంశాలని బోధిస్తున్నారో నని తెలుసుకొనేందుకు బీజేపీ ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో ఆర్ఎస్ఎస్ శక్తులు నిర్విరామంగా ఈ కృషి చేస్తున్నాయి. ఇందు కోసం సర్వే చేశారు. అయితే ఆర్ఎస్ఎస్ నిర్వ హించే సరస్వతి శిశుమందిర్‌లో బోధించేదేమిటో చెప్పరు. మదర్సాలలో ఖురాన్, బైబిలు, భగవద్గీతలను చదివించాలని, బోధించాలని ఇమామ్‌ను భగ వత్ కోరారు. మరి శిశు మందిర్‌లలో ఇవన్నీ బోధిస్తారా? ఆర్ఎస్ఎస్ శక్తులు ముస్లింలు, దళితులను ఈ దేశ పౌరులుగా చూడడంలేదు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే ఇలాంటి ఎత్తుగడలను అనుసరిస్తున్నారని భావించాలి.

ముస్లింలు, క్రైస్తవులు, ఇతర మైనారిటీ తరగతుల ప్రజలు భారత దేశస్తులు కాదని, దేశాన్ని హిందూ రాష్ట్రగా మార్చవలసిందేనన్న లక్ష్యంతో ఆర్ఎస్ఎస్ పని చేస్తోంది. ఆర్ఎస్ఎస్, బీజేపి నాయకత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం హిందూ రాష్ట్రం ఏర్పాటు దిశగా పని చేస్తోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎనిమిదేళ్ల కాలంలో మత మైనారిటీలు, ముస్లింలు, దళితుల పట్ల విద్వేష ప్రచారం చేస్తున్న ఆర్ఎస్ఎస్ నేత మోహన్ భగవత్ పది రోజుల క్రితం దిల్లీలో మసీదు, మదర్సా స్కూలును సందర్శించి ముస్లిం పెద్దలతో ముచ్చటించడం కొత్త ఎత్తుగడగా భావిస్తున్నారు. పైగా ఇది కంటి తుడుపు చర్యే. మత సామరస్యాన్ని ఆర్ఎస్ఎస్ ఏ రోజు కోరలేదు, ఆచరించలేదు. ముస్లింలను గందరగోళ పరిచి, క్రమంగా సన్నిహితంగా ఉన్నామని చెప్పి ఓట్లు పొందడానికి పన్నిన వ్యూహం అయి ఉండవచ్చు. ప్రజాస్వామ్య సూత్రాలను తాము కూడా విశ్వసిస్తున్నామని ముస్లింలు, ఉదారవాదులు, లౌకిక వాదులకు సందేశం పంపడానికి ఈ వ్యూహం కావచ్చు. ప్రజాస్వామ్య వ్యవస్థను, ప్రజాస్వామ్యం అంటే ఏమిటి అన్న విషయాన్ని ఏనాడు చర్చించలేదు. దేశంలో సామాజిక వాతావరణంలో భగవత్ మార్పు తీసుకురాగలరేమోనని కొందరు ముస్లిం పెద్దలు భావిస్తున్నారు.

స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన మహాత్మాగాంధీని దేశ ప్రజలు జాతిపిత అని భావిస్తుండగా, మొదటిసారి ఒక ముస్లిం మత క్లెర్జీ భగవత్‌ను రాష్ట్రపిత అని పొగిడారు. అంటే భగవత్‌ను గాంధీ సరసన చేర్చాడు. ఆర్ఎస్ఎస్ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనకపోగా బ్రిటీషు పాలకులకు సహకరించిందని చరిత్రకారులు స్పష్టం చేశారు. ఇప్పుడు సావర్కర్‌ను హీరోగా తెర పైకి తీసుకురావాలని నిరంతరం ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. మరో వైపు గాంధీని చంపిన గాడ్సేను ఆరాధించేవారు, అతని విగ్రహాలు ఏర్పాటు చేసేవారు తయారయ్యారు. ఏనాడు ముస్లింల పట్ల అభిమానంలేని ఆర్ఎస్ఎస్ ఇప్పుడు ముస్లింలతో సఖ్యంగా ఉంటారనుకోవడం పిల్ల చేష్టగా ఉంటుంది. దేశంలో సామాజిక, రాజకీయ వాతావరణాన్ని ప్రశాంతంగా ఉంచుతారని కూడా ఆశించడం కష్టమే. ఇలాంటి పరిస్థితి ఉండి ఉంటే రైతులు, కార్మికులు, విద్యార్థులు, కొన్ని మత, ప్రాంతీయ మైనారిటీలను దూరంగా ఉంచేవారు కాదు. ఈ దేశ భవిష్యత్ పట్ల హిందువులతో సహా అన్ని తరగతుల ప్రజలకు స్పష్టమైన అభిప్రాయం ఉంది. ఇందుకు భిన్నంగా బీజేపీ, ఆర్ఎస్ ఎస్‌ల సిద్ధాంతాన్ని అమలు చేయాలని అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నారు. గోమాత రక్షణ పేరుతో ఆర్ఎస్ఎస్ అనుబంధ సంఘాల మూకలు రెచ్చిపోయి దాడులు చేయడమేగాక హతమార్చిన రోజు కూడా భగవత్ నోరు విప్పలేదు. అలాంటి మూకలను ప్రోత్సహించేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయి. ఇలాంటి మూకలను కాపాడారేగాని, శిక్షించలేదు. నిత్యం ఈ శక్తులు ముస్లింలు, దళితులపై ద్వేషం వెళ్లగక్కుతుండగా హిందువులను ఎందుకు శత్రు భావంతో చూస్తున్నారని భగవత్ ఇటీవల కొందరు ముస్లిం మేధావులను కలిసి ప్రశ్నించడం చాలా పాతగా ఉంది. ముస్లింలను కలవడం పైన ప్రభుత్వానికి వంగి వంగి సేవలు చేస్తున్న మీడియా, ఇతరులు కొందరు భగవత్‌ను ప్రశంసించారు.

దిల్లీలో భగవత్ మసీదు, మదర్సాలను సందర్శిస్తున్న సమయంలో యుపి, అసోంలలో సంఘ పరివార్ శక్తులు మదర్సాలపై ద్వేషం గక్కుతూ ప్రచారం చేస్తున్నారు. టెర్రరిజం, దాని భావజాలాన్ని విస్తరిస్తున్నారని, దాడులకు వ్యూహం పన్నారని, ముస్లిం పీపుల్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా కేంద్రాలపై దర్యాప్తు అధికారులు చేస్తున్నారు. మదర్సాలలో ఏ అంశాలని బోధిస్తున్నారోనని తెలుసుకొనేందుకు బీజేపీ ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో ఆర్ఎస్ఎస్ శక్తులు నిర్విరామంగా ఈ కృషి చేస్తున్నాయి. ఇందు కోసం సర్వే చేశారు. అయితే ఆర్ఎస్ఎస్ నిర్వహించే సరస్వతి శిశు మందిర్‌లో బోధించేదేమిటో చెప్పరు. మదర్సాలలో ఖురాన్, బైబిలు, భగవద్గీతలను చదివించాలని, బోధించాలని ఇమామ్‌ను భగవత్ కోరారు. మరి శిశు మందిర్‌లలో ఇవన్నీ బోధిస్తారా?

ఆర్ఎస్ఎస్ శక్తులు ముస్లింలు, దళితులను ఈ దేశ పౌరులుగా చూడడంలేదు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే ఇలాంటి ఎత్తుగడలను అనుసరిస్తున్నారని భావించాలి. మైనారిటీలు, దళితులు, ముస్లింల పట్ల తమ అభిప్రాయాలను మార్చుకుంటారని భావించడం దురాశ అవుతుంది. జనం బాధలను పట్టించుకోకుండా ఇలాంటి ఎత్తుగడలను వేస్తూ తమ హిందూ రాష్ట్ర లక్ష్యాన్ని నెరవేర్చుకోవడం సాధ్యమా?

ఇ-మెయిల్

మూఢ నమ్మకాలే వారి బతుకుదెరువు!

మహాలయ అమావాస్య నుండి పదిహేనురోజులు చనిపోయిన వారి ఆత్మలు వచ్చి వారి సంతానం పెట్టే పిండాకూళ్లు తింటాయని, అందుకు ఇవి చాలా మంచిరోజులని పురోహితవర్గం ప్రచారం చేస్తోంది. నిజమేనా!! అసలు ఆత్మలు ఉన్నాయా! చనిపోయినవారి ఆత్మ మనిషి కున్న నవరంధ్రాలలో నుండి ఎగిరిపోతుందని పురాణ గ్రంథాలలో ఎక్కడో చదివి ఆ మధ్య తమిళనాడులో ఒక వ్యక్తి ఆత్మ ఎలా ఉంటుందో చూడాలన్న తపనతో తన దగ్గరి మనిషిని నరికాడు. అన్ని దిక్కులు చూసాడు ఎటుపోతుందోనని. కనపడలా! అడ్డమొచ్చిన భార్యను కూడా నరికాడు. ఆత్మ కనపడలా!

మనిషి మెదడు పనిచేయటం ఆగిపోయిందంటే ఆ మనిషి చనిపోయినట్టే. ఈ విషయాన్ని ప్రజలకు చెప్పాలి. కృష్ణుడు గీతలోని (వ్యాసుడు రాసిన గీత) రెండవ అధ్యాయం 22 శ్లోకంలో చనిపోయిన వారి అత్మ వెంటనే అప్పటికే రెడీగా ఉన్న వేరొక శరీరంలోకి ప్రవేశిస్తుంది అని స్పష్టంగా చెప్పాడు రెడీగా ఉన్న శరీరమంటే అప్పటికే దానిలో కూడా ఒక ఆత్మ ఉండిఉండాలి కదా! మరిదాని సంగతియేమిటి? ఆ విషయాన్ని పక్కన పెడితే కృష్ణుడు చెప్పిన దాని ప్రకారం ఆత్మ పురోహితుడు మంత్రం ద్వారా పెట్టే పిండాకూడు కోసం వెంపర్లాడదు. మరి పురోహితుడు చెప్పేది అబద్ధమే కదా! అంతేనా చనిపోయిన వారి అత్మ వైతరణీనది దాటాలని, అది దాటాలంటే పురోహితునికి మంచి ఆవుని దానం చేస్తే దానితోక పట్టుకొని ఆత్మ వైతరణీనది దాటుతుందని నమ్మపలికించి ఆవుని కాజేస్తాడు. వైతరణీ నదిలో విషంతో కూడుకున్న మొసళ్ళు, చేపలు, తాబేళ్లు, తేళ్లు ఉంటాయని భయపెట్టి ఆవుని, చనిపోయిన వారు వర్షంలో తడవకుండా ఉండేందుకు అని చెప్పి కొత్త గొడుగు, ఎండలో కాళ్ళు కాలకుండా ఉండేందుకు కొత్తచెప్పులు పురోహితుడు కాజేస్తాడు. మరి ఆ మొసళ్లు, తేళ్లు, పాములు ఆవుని ఏమి చెయ్యవా! పూర్వం శ్రార్ధ ఖర్మలు అంటే వానప్రస్థానం వెళ్లిన ముసలివారిని సంవత్సరానికి ఒకసారి వారి పిల్లలు ఇంటికి తీసుకొచ్చి ప్రేమతో కొత్తబట్టలు, చెప్పులు, కావలసిన వస్తువులు ఇచ్చిపంపేవారు. దీనిని పురోహితులు తమ బతుకు దెరువుకొరకు ఈ విధంగా చనిపోయిన వారికి పిండాకూళ్లు అంటూ అమాయక ప్రజలను కొల్లగొడుతున్నారు. ప్రజలలో ఉన్న మూఢ నమ్మకాలను పురోహిత వర్గము తమ బతుకుదెరువుగా మార్చుకుంది. ఈ విషయాన్ని జనం గ్రహించాలి. ఇలాంటి మూఢ నమ్మకాలకు స్వస్తి పలకాలి.

నార్నె వెంకట సుబ్బయ్య

రూపాయి విలవిల - విదేశీ నిల్వలు వెలవెల !

ఎం కోటేశ్వరరావు

చైనాను వెనక్కు నెట్టి అమెరికాతో పోటీ పడే విధంగా దేశాన్ని ముందుకు తీసుకుపోగల సమర్థుడు ప్రధాని నరేంద్ర మోదీ అని ఇప్పటికీ అనేక మంది భావిస్తున్నారు. ఆచరణలో చూస్తే ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి ఉంది. ఇతర దేశాలతో పోటీ పడడం మాటేమోగానీ మన రూపాయి విలువ అంతకంతకూ పడిపోతోంది. మన విదేశీ మారక నిల్వలు తరిగిపోతున్నాయి. రూపాయి విలువ సోమవారం (ఈ నెల 26న) రూ.81.67కు దిగజారి రూ. 81.6225 వద్ద ముగిసింది. రానున్న మూడు నాలుగు నెలల్లో అది రూ. 82-83 మధ్య ఉంటుందని, తరవాత 85-86కు దిగజారవచ్చని కొందరి అంచనా. తరలిపోతున్న ఎఫ్‌పిఐ పెట్టుబడులు నిలిచినా, తిరిగి వచ్చినా రూ.81-82 దగ్గర స్థిరపడవచ్చని, ఈ ఆర్థిక సంవత్సరం 79-83 మధ్య ఉండవచ్చని, పరిపరి విధాల ఎవరి జోస్యం వారిది. 2014 ఎన్నికలకు ముందు బీజేపీ నేతలు చెప్పిన రూ.38-48కి పెరగటం గురించి ఎవరూ ప్రస్తావించటం లేదు. రూపాయి పతనాన్ని అరికట్టేందుకు ఇప్పటికే ఆర్‌బిఐ 80 బి.డాలర్లను విక్రయించిందని, రూపాయి పతనమైతే దాన్ని వదిలి వేయటం తప్ప ఆర్‌బిఐకి మరొక మార్గం లేదని కొందరు చెబుతున్నారు. ఏడు నెలల కాలంలో గురువారం ఒక్కరోజే 83 పైసలు పతనమైంది. ఎవరేం చెప్పినా ప్రపంచీకరణ వల్ల చాలా అంశాలు మన చేతుల్లో లేవన్నది వాస్తవం.

ఆర్‌బిఐ శుక్రవారం విడుదల చేసిన సమాచారం ప్రకారం ఏడు వారాలుగా వరుసగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు పడిపోతున్నాయి. పది రోజులక్రితం ఇవి (ఈ నెల 16కి) 545.652 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2020 అక్టోబరు రెండవ తేదీ తరవాత ఇంత తక్కువగా ఎన్నడూ లేవు. తగ్గటానికి కరెన్సీ మారకపు విలువలో మార్పులు కొంత కారణం కాగా రూపాయి విలువ పతనాన్ని అరికట్టేందుకు ఆర్‌బిఐ తీసుకుంటున్న చర్యలే ఎక్కువ ప్రభావం చూపుతున్నట్లు కొందరి అభిప్రాయం. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జులై నెలల్లో రూపాయి పతనాన్ని అడ్డుకొనేందుకు ఆర్‌బిఐ 35 బి.డాలర్లను, ఈ మొత్తంలో జులై నెలలో 19 బి.డాలర్లను విక్రయించింది. ఈ నెల 23వ తేదీ ఒక్క రోజే రెండు బిలియన్ డాలర్లను విక్రయించినట్లు వార్తలు. 2021 సెప్టెంబరు మూడవ తేదీన 642.45బి.డాలర్లు మన దగ్గర ఉన్నాయి. విదేశీ పెట్టుబడులు వెనక్కు వెళ్లటం, మన ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా పెరగటంతో పాటు మన కరెన్సీ విలువ తగ్గినందువలన కూడా డాలరు నిల్వ కరిగిపోతున్నది.

విదేశీ మారక ద్రవ్యంగా చెబుతున్న మొత్తంలో అన్నీ డాలర్లే ఉండవు. ఆర్‌బిఐ వెల్లడించిన తాజా సమాచారం ప్రకారం మన దగ్గర ఉన్న 545.652 బిలియన్ డాలర్లలో నగదు 484.901 బి.డాలర్లు కాగా బంగారం రూపంలో 38.186, ఎస్‌డిఆర్లు 17.686, ఐఎంఎఫ్ వద్ద 4.880 బి.డాలర్లు ఉన్నాయి.

ప్రస్తుతం దిగుమతులు-ఎగుమతుల అంతరం పెరిగి జీడీపీలో 4 శాతానికి కరెంటు ఖాతా లోటు పెరిగినా మొత్తం నిల్వలు 510 బి.డాలర్లకు తగ్గవచ్చని, 2013 మే నెలలో ఉన్న 300 బి.డాలర్లతో పోలిస్తే పరిస్థితి మెరుగేనని కొందరి అభిప్రాయం. పదేళ్ళ కిందట ఆ నిల్వలు 4.1 నెలల దిగుమతులకు సరిపోగా ఇప్పుడున్న నిల్వలు 8.9 నెలలకు వస్తాయని అంచనా.

వర్తమాన ఆర్థిక సంవత్సరంలో మన జీడీపీ వృద్ధి గురించి గతంలో వేసిన అంచనాలను క్రమంగా తగ్గించటమే తప్ప స్థిరంగా ఉంటుందని ఏ సంస్థా చెప్పటం లేదు. ప్రస్తుతం ఏడు శాతంగా చెబుతున్నారు, వచ్చే ఏడాది 6.4 శాతానికి తగ్గుతుందని అంచనా. ఆర్‌బిఐ వడ్డీ రేట్లను ఇంకా పెంచనుందనే వార్తల పూర్వరంగంలో వృద్ధి రేటు ఇంకా తగ్గేందుకే అవకాశం ఉంది. డాలరు రేటు పెరిగింది తప్ప మన కరెన్సీ విలువ తగ్గలేదని కొందరు వాదిస్తున్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా మీద అమెరికా కూటమి దేశాలు అనేక ఆంక్షలు విధించినా దాని కరెన్సీ రూబుల్ విలువ పెరిగింది. మన జీడీపీ ప్రపంచంలో ఐదవ స్థానంలో ఉంటే దాని జీడీపీ పదకొండవదిగా ఉంది. అలాంటపుడు మన కరెన్సీ విలువ ఎందుకు పెరగలేదు? జపాన్ ఎన్ విలువ పెరిగింది, దక్షిణ కొరియా కరెన్సీ వన్ పెరిగింది. అందువలన పతనమైన వాటితో చూపి మనదీ అలాగే ఉందని చెబుతామా, మెరుగ్గా ఉన్నవాటితో పోల్చుకుంటామా? మనకు పతనం కావటమా, పెరగటమా ఏది లాభం. దిగుమతులు ఎక్కువగా ఉన్నందున ఎక్కువ మందికి పెరగటం లాభం. ఎగుమతులు తక్కువగా ఉన్నందున కొందరికి తగ్గటం లాభం.

మన కరెన్సీతో దిగుమతులు చేసుకొనేందుకు కొన్ని దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నారు. దీంతో డాలర్లకు గిరాకీ తగ్గి కొంత వెసులుబాటు కలుగుతుంది తప్ప మనకు కలిగే లబ్ధి ఏముంటుంది. ఏ దేశమైనా డాలరుతో పోల్చి దాని బదులు దాని విలువకు సమానమైన రూపాయలు అడుగుతుంది తప్ప రోజురోజుకు దిగజారుతున్న మన కరెన్సీ స్థిర విలువకు ఎవరూ అంగీకరించరు. మనం ఇతర దేశాల కరెన్సీ తీసుకున్నప్పటికీ ప్రాతిపదిక అదే ఉంటుంది. అమెరికాలో వడ్డీ రేట్లు పెంచుతున్నారు గనుక అక్కడ పెట్టుబడులు పెట్టినా లేదా ప్రభుత్వ బాండ్లు కొనుగోలు చేసినా మదుపుదార్లకు లాభం కనుక ఇతర దేశాల నుంచి డాలర్లు అమెరికా చేరుతున్నాయి. వడ్డీ రేటు తగ్గితే అంతకంటే ఎక్కువ వడ్డీ వచ్చే దేశాలకు తిరిగి దారిపడతాయి. మన ఆర్‌బిఐ వడ్డీ రేటు పెంచటం వెనుక మతలబు ఇదే. అయితే అది మన పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు, రుణాలు తీసుకొని ఇండ్లు, వాహనాలు కొనుగోలు చేసిన వారి మీద అదనపు భారం మోపుతుంది. డాలర్లు కొని విదేశాల్లో చదువుకొనే వారికి, టూర్లకు వెళ్లే వారికి భారం పెరుగుతుంది. మంచి పనితీరును కనపరచిన ఎనిమిది కరెన్సీలలో మనది ఒకటని విశ్లేషణలు వెల్లడించాయి. దాన్ని పట్టుకొని మన సామర్థ్యానికి భంగం కలగలేదని బీజేపీ నేతలు చెబుతున్నారు. నిజం కావచ్చు, దాని వలన మనకు ఒరిగేదేమిటి? కేసు పోతేనేంగానీ మన ప్లీడరు భలే వాదించాడు అన్నట్లుగా ఉంది.

ప్రపంచంలో తమ వద్ద డిపాజిట్ చేసిన మదుపుదార్లకు బ్యాంకులు వడ్డీ చెల్లించటం తెలిసిందే. కానీ ఐదు దేశాల్లోని బాంకులు తమ వద్ద డబ్బు దాచుకున్న వారి నుంచి ఎదురు వడ్డీ వసూలు చేస్తున్నాయి, వినటానికి చిత్రంగా ఉన్న అది నిజం. పెట్టుబడిదారులు ఏది చేసినా తమ లాభాలకే అన్నది గ్రహిస్తే ఇది కూడా దానిలో భాగమే అన్నది స్పష్టం. బహిరంగ మార్కెట్లో ఉన్న వడ్డీ రేట్ల కంటే మన దేశంలో బ్యాంకుల వడ్డీ రేటు తక్కువ. పెట్టుబడిదార్లకు చవకగా రుణాలు కావాలంటే బ్యాంకులు కావాలి. వాటి దగ్గర డిపాజిట్లు ఉండాలి కనుక మన బ్యాంకులు డిమాండ్‌ను బట్టి వడ్డీ రేట్లను ఖరారు చేస్తాయి. అమెరికా, ఐరోపా దేశాల్లో అతి తక్కువ వడ్డీ రేట్లు అక్కడి వారికి లబ్ధి చేకూర్చేందుకే. వడ్డీ తక్కువ ఉంటే వారి వస్తువుల తయారీ ఖర్చు తక్కువగా ఉండి ప్రపంచ మార్కెట్లో పోటీ పడవచ్చు. ఐదు దేశాల బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన వారే అవి నిర్ణయించిన మేరకు ఎదురు వడ్డీ చెల్లించాలి. డబ్బు వచ్చేకొద్దీ అవి కూడా రేట్లు మారుస్తూ ఉంటాయి. ఎదురు వడ్డీ స్విట్జర్లాండ్‌లో 0.75, డెన్మార్క్ 0.60, జపాన్ 0.1, స్వీడన్ 0.25, స్పెయిన్ 0.0 శాతం ఉంది. అనేక ఐరోపా ధనిక దేశాల్లో వడ్డీ రేట్లు నామ మాత్రంగా ఉంటాయి. ఇలా ఎందుకు అంటే పొదుపు వద్దు- ఖర్చే ముద్దు అని ప్రభుత్వాలు చెబుతున్నాయి. ఖర్చు చేస్తేనే కదా కార్పొరేట్ల వస్తువులు, సేవలకు గిరాకీ ఉండేది, లాభాలు వచ్చేది. జపాన్‌లో ఎలాంటి వడ్డీ లేకుండా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం, బ్యాంకులు రుణాలు ఇస్తాయి. డాలరు దెబ్బ కు జపాన్ ఎన్ కూడా ప్రభావితమైంది. దాంతో 1998 తరవాత తొలి సారిగా గతవారంలో జపాన్ రిజర్వుబాంక్ రంగంలోకి దిగి తమ కరెన్సీ విలువ పడిపోకుండా, పెరిగేందుకు జోక్యం చేసుకుంది. 2011లో ఎన్ విలువ పెరగటంతో తగ్గేందుకు లేదా స్థిరంగా ఉండేందుకు చూసింది. ఎగుడు దిగుడులు సహజం, ఇబ్బందులు, పతనాలు తాత్కాలికం అంటూ కొందరి నోట ఉపశమనాలు వినిపిస్తున్నాయి, మంచిదే అంతకంటే కావాల్సింది ఏముంది? అందుకోసం సమర్థుడైన నరేంద్ర మోదీ చేస్తున్నదేమిటి అన్నదే ప్రశ్న.

కాంగ్రెస్ స్వయంకృతం

రాజస్థాన్ సంక్షోభానికి తెరపడేనా?

న్యూదిల్లీ: పార్టీ అధ్యక్ష ఎన్నిక వేళ రాజస్థాన్‌లో ఏర్పడిన సంక్షోభం కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాకు తలనొప్పిగా మారింది. గతంలో జరిగినటువంటి తప్పిదాన్నే పునరావృతం చేయడం వల్ల ఈసారి కొత్త సంక్షోభం తలెత్తినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇష్టం లేకపోయినా రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌ని అధ్యక్ష ఎన్నికల బరిలోకి సోనియా దింపారు. సోనియాకు చెప్పలేక కనీసం రాహుల్ గాంధీనైనా ప్రసన్న చేసుకుందామని కేరళ వెళితే ఆయన గెహ్లాట్ నెత్తిన మరో పిడుగు వేశారు. అధ్యక్ష ఎన్నికల బరిలో ఉండాలని రాహుల్ సైతం చెప్పారు. అంతేకాకుండా రాజస్థాన్ సీఎంగా సచిన్ పైలట్‌కు అవకాశం ఇవ్వాలని ఒత్తిడి చేశారు. దీంతో గెహ్లాట్‌కు కోపం కట్టలు తెంచుకుంది. గెహ్లాట్ వ్యూహంలో భాగంగానే 108 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 92 మంది సచిన్ పైలట్‌కు వ్యతిరేకంగా గళమెత్తారు. పైకి తన ప్రమేయం లేదంటున్నా రాజస్థాన్ కాంగ్రెస్ సంక్షోభం వెనుక అశోక్ గెహ్లాట్ వ్యూహముందన్నది ప్రతి ఒక్కరికీ అర్థమవుతోంది. స్పీకర్‌ని కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బుజ్జగించేందుకు దిల్లీ నుంచి వెళ్లిన అజయ్ మాకెన్ లాంటి వారు ఏమీ చేయలేక తిరుగు పయనమయ్యారు. అయితే, జరిగిన పరిణామాల నేపథ్యంలో సోనియాకు గెహ్లాట్‌పై ఆగ్రహం వచ్చినట్లు వార్తలు వచ్చాయి. అధ్యక్ష ఎన్నిక బరి నుంచి గెహ్లాట్‌ను తప్పించి.. మరొక వీర విధేయుడిని ఎంపిక చేయాలని సోనియా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రేసులో కర్ణాటకకు చెందిన మల్లికార్జున ఖర్గే పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. 2023లో రాజస్థాన్ అసెంబ్లీకి ఎన్నికలు జరగబోతున్నాయి. తన అధ్వర్యంలోనే రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలు ఎదుర్కోవాలని గెహ్లాట్ భావిస్తున్నారు. ఆర్నెల్ల క్రితం జరిగిన పంజాబ్ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం నుంచి కాంగ్రెస్ అధిష్ఠానం గుణపాఠం నేర్చుకోలేదనడానికి తాజా చర్యలే నిదర్శనం. పంజాబ్ అసెంబ్లీకి మరో ఆర్నెల్లలో ఎన్నికలు జరుగుతాయనగా కాంగ్రెస్ అక్కడ ముఖ్యమంత్రిని మార్చింది. కెప్టెన్ అమరేందర్ సింగ్‌ను తప్పించింది. దళితుల ఓట్ల కోసం చరణ్‌జిత్ సింగ్ చన్నీకి సీఎం బాధ్యతలు అప్పగించింది. అంతకుముందు పంజాబ్ పీసీసీ బాధ్యతలను నవ్‌జోత్ సింగ్ సిద్ధూకు అప్పగించి..కాంగ్రెస్ మరో తప్పు చేసింది. దీంతో పంజాబ్‌లో కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. అంతకుముందు మధ్యప్రదేశ్‌లోనూ యువనేత జ్యోతిరాదిత్య సింధియాను కాదని సీనియర్ పేరుతో కమల్‌నాథ్‌కు సీఎం పదవి కట్టబెట్టారు. కొంతకాలానికి జ్యోతిరాదిత్య బీజేపీకి దగ్గరయ్యారు. 28 మంది ఎమ్మెల్యేలతో కలిసి ఆయన కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. తన వర్గం ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి.. తిరిగి బీజేపీ తరపున గెలిపించుకున్నారు. కేంద్ర మంత్రి పదవిని సైతం చేజిక్కించుకున్నారు. ఇలాంటి ఉదంతాల తర్వాత కూడా కాంగ్రెస్ అధిష్ఠానం సరైన నిర్ణయాలు తీసుకోకపోవడం ఆశ్చర్యంగా ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. నిజానికి నాలుగేళ్ళ క్రితం జరిగిన రాజస్థాన్ ఎన్నికల తర్వాత తననే సీఎం చేస్తారని సచిన్ పైలట్ భావించారు. ఆయనకు రాహుల్‌గాంధీ అండదండలుండడంతో పైలెటే సీఎం అన్న వార్తలు పెద్దఎత్తున వచ్చాయి. కానీ సోనియా తనదైన శైలిలో సీనియారిటీ పేరిట అశోక్ గెహ్లాట్‌కు అవకాశమిచ్చారు. సీఎం సీటు చేజారడంతో కినుక వహించిన సచిన్ పైలట్ డిప్యూటీ సీఎం పదవితో సంతృప్తి పడాల్సి వచ్చింది. అయితే ఆ సీటులోను సచిన్‌ను సరిగ్గా నిలవకుండా గెహ్లాట్ కుట్రలు చేశారు. ఏడాదిన్నర క్రితం తన వర్గానికి చెందిన ఎమ్మెల్యేలతో బీజేపీలో చేరిపోయేందుకు సచిన్ ప్రయత్నించారు. కానీ రాహుల్ బుజ్జగింపుతో ఆగిపోయారు. తాజా పరిణామాల నేపథ్యంలో తనకు సీఎం సీటు ఖరారవుతుందని సచిన్ పైలట్ భావించారు. కానీ గెహ్లాట్ రాజకీయ వ్యూహం ఆయనకు అవకాశం లేకుండా చేసినట్లు అయింది. రాజస్థాన్‌లో 2018 ఎన్నికల్లో విజయపథాన నడిపిన పీసీసీ అధ్యక్షుడు సచిన్ పైలట్‌ని కాదని పరిపాలనా అనుభవం పేరిట అయిదేళ్లుగా ఇంటికే పరిమితమైన గెహ్లాట్‌కు సీఎం పదవి ఇచ్చారు. సచిన్ పైలట్‌నే సీఎం చేయాలని రాహుల్ గాంధీ యత్నించినా కుదరలేదు. ఇపుడు తనకు సీఎం సీటు దక్కకపోతే సచిన్ పైలట్ అయితే బీజేపీ వైపు చూడడమో లేక వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మౌనంగా ఉండిపోవడమో చేస్తారోమో. ఇందులో ఏది జరిగినా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోను అసమ్మతి రగులుకునే సంకేతాలు కనిపిస్తున్నాయి. మొత్తం మీద స్వయంకృతాపరాధాలే కాంగ్రెస్ పతనానికి కారణమవుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

30న శశిథరూర్ నామినేషన్

న్యూదిల్లీ: కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం సీనియర్ నేత శశిథరూర్ ఈ నెల 30వ తేదీన నామినేషన్ వేయనున్నారు. 30వ తేదీన ఉదయం 11 గంటలకు ఆయన నామినేషన్ వేస్తారనే సమాచారం తమకు అందినట్లు కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ అథారిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. శశిథరూర్ సెప్టెంబర్ 30న ఉదయం 11 గంటలకు నామినేషన్ పత్రాలు అందజేయనున్నట్లు ఆయన ప్రతినిధి ఒకరు తమ కార్యాలయానికి తెలిపారని మిస్త్రీ వివరించారు. దిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... 10 జనపథ్‌లో సోనియా గాంధీని కలిసి ఆమెకు ఓటర్ ఐడీ కార్డు అందించానని, ఇప్పటివరకు జరిగిన ఎన్నిక ల ప్రక్రియ గురించి వివరించానని చెప్పారు. కాగా థరూర్‌కు ప్రత్యర్థిగా ఎవరు పోటీ చేయనున్నారనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. తమ ఆఫీసు నుంచి ఏఐసీసీ ట్రెజరర్ పవన్ కుమార్ బన్సల్ నామినేషన్ పత్రాలు తీసుకెళ్లారని మధుసూదన్ మిస్త్రీ వివరించారు. బహుశా ఆ పత్రాలు ఇతరుల కోసమై ఉంటాయని అభిప్రాయపడ్డారు. కొద్దిరోజులుగా అశోక్ గెహ్లాట్ బలమైన అభ్యర్థిగా ప్రచారం జరిగినప్పటికీ రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేల తిరుగుబాటుతో పోటీ నుంచి ఆయన దాదాపు తప్పుకున్నట్టేనని పరిశీలకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం సెప్టెంబర్ 24 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా 30వ తేదీతో గడువు ముగియనుంది. నామినేషన్లను అక్టోబర్ 1న పరిశీలిస్తారు. అక్టోబర్ 8వ తేదీ లోపు ఉపసంహరణకు అవకాశం ఇస్తారు. అక్టోబర్ 8వ తేదీ సాయంత్రం 5 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తారు. ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఉంటే... అక్టోబర్ 17వ తేదీన పోలింగ్ ఉంటుంది. అక్టోబర్ 19న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

జామియా వర్సిటీ చూట్టూ ఆంక్షలు

న్యూదిల్లీ: దిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా పరిసరాలు, ఓఖ్లా (జామియా నగర్) ప్రాంతంలో పోలీసులు 144 సెక్షన్ విధించారు. ఈ విషయాన్ని వర్సిటీ చీఫ్ రెక్టార్ ధృవీకరించారు. కొన్ని శక్తులు ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉందన్న సమాచారం మేరకు ఈ నెల 19 నుంచి నవంబరు 17 వరకూ వర్సిటీ చుట్టపక్కల 144 సెక్షన్‌తో పాటు కర్ఫ్యూ అమలులో ఉంటుందని జామియా నగర్ పోలీసు స్టేషన్ అధికారుల నుంచి తమకు సమాచారం వచ్చినట్లు తెలిపారు. వర్సిటీ క్యాంపస్ పరిసరాల్లో గుంపులుగా గుమిగూడవద్దని తమ విద్యార్థులు, అధ్యాపకులను కోరినట్టు తెలిపారు. వర్సిటీలో ధర్నాలు, ఆందోళనలు, సమావేశాలు, పాదయాత్రలు చేయవద్దని నోటీసు జారీ చేసినట్టు తెలిపారు. ఇదిలా ఉండగా సెప్టెంబరు 18న వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపట్టడంతోనే పోలీసులు ఈ రకమైన ఆంక్షలు విధించినట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా కార్యకర్తలు, నేతలపై ఎన్ఐఏ దాడులు చేస్తోన్న నేపథ్యంలో ఈ తరహా ఆంక్షలు పెట్టినట్టు కొందరు విద్యార్థులు ఆరోపించారు. ముస్లిం వర్సిటీ కాబట్టే తమపై ఈ తరహా ఆంక్షలు విధిస్తోందని ప్రభుత్వ చర్యలను తప్పుబట్టారు. పోలీసులు మాత్రం ఈ ఆరోపణల్ని కొట్టి పడేశారు. కొన్ని శక్తులు అల్లర్లకు పాల్పడే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికల కారణంగానే 144 సెక్షన్ రూపంలో ఆంక్షలు విధించినట్లు జామియా నగర్ పోలీస్ స్టేషన్ అధికారి ఒకరు తెలిపారు. చుట్టపక్కల ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పారామిలటరీ సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. ఒకచోట నలుగురికి మించి సమావేశమైతే చర్యలు తప్పవని న్యూ ఫ్రెండ్స్ కాలనీ ఏసీపీ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఉన్నట్టు తెలిపారు.

బీజేపీవి మత రాజకీయాలు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- బీహార్ వ్యాప్తంగా జేడీ(యూ) ప్రదర్శనలు

పాట్నా: బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ (యునైటెడ్) మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా భారీ ప్రదర్శనలు చేపట్టింది. బీజేపీ మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జేడీ(యూ) నాయకులు కోరారు. రాష్ట్ర రాజధానిలో జేడీ(యూ) జాతీయ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లాలన్, పార్లమెంటరీ బోర్డు అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహా 'సతర్కట ఏవం జాగ్రత్త మార్చ్'లో పాల్గొన్నారు. 'మాది బీజేపీ కుట్ర (సాజిష్) నుంచి ప్రజలను హెచ్చరించే లక్ష్యంతో కూడిన ఉద్యమం' అని అన్నారు. 'మతోన్మాద విభజనలను పదును పెట్టడానికి బీజేపీ ఒక ప్రణాళికను రూపొందించింది. తద్వారా జనాభాలో గణనీయమైన భాగం తనకు అనుకూలంగా ఉంటుంది. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు ఏమీ సాధించకుండా అధికారంలో ఉండటానికి సహాయపడుతుంది' అని కుష్వాహా ఈ సందర్భంగా విలేకరులతో అన్నారు. పాట్నా హైకోర్టు ప్రాంగణానికి సమీపంలో ఏర్పాటు చేసిన బాబాసాహెబ్ భీమ్ రావ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించడం ద్వారా ప్రదర్శన ప్రారంభమయింది. అక్కడ నుంచి వేలాది మంది జేడీ(యూ) కార్యకర్తలు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చారిత్రాత్మక గాంధీ మైదానానికి నడిచారు. 'నితీశ్ కుమార్‌కు ప్రత్యామ్నాయం లేదు. అతను మొత్తం ప్రతిపక్షానికి ఇరుసు' అని జేడీ(యూ) కార్యకర్తలు ఇక్కడ చెప్పారు. జేడీ(యూ) నేత నితీశ్ తాను ప్రధానమంత్రి పదవి రేసులో లేనని చెప్పినప్పటికీ, 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీని ఓడించగలదని ఆయన విశ్వసిస్తున్న ప్రతిపక్ష ఐక్యతను పెంపొందించడానికి ప్రయత్నిస్తున్నారు. కాగా బీహార్‌లోని మొత్తం 38 జిల్లాల్లో ఈ ప్రదర్శనలు జరిగాయని జేడీ(యూ) రాష్ట్ర ప్రధాన కార్యాలయం పేర్కొంది.

దేశ విభజనకు మోదీ సర్కారు కుట్ర: రాహుల్

తిరువనంతపురం: భారత్ రెండు హిందుస్థాన్‌లను అంగీకరించదని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ దేశవ్యాప్త భారత్ జోడో యాత్ర 20 రోజుకు చేరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్రంలోని మోదీ సర్కారు దేశ విభజనకు పాల్పడుతున్నదనీ, రెండు హిందుస్థాన్‌లను సృష్టిస్తోందని ఆరోపించారు. సంపన్నులకు లాభం చేకూర్చే విధంగా ప్రభుత్వం పేదలపై భారం మోపుతున్నదని విమర్శించారు. "ఈరోజు బడా పారిశ్రామికవేత్తలకు వేలకోట్ల రుణాలు మాఫీ చేస్తున్నారు.. కానీ రైతులు, చిన్న వ్యాపారులు కొద్ది మొత్తం రుణం తీర్చలేకపోతే 'డిఫాల్టర్' అంటూ జైల్లో పెడుతున్నారు. ప్రతి అన్యాయానికి భారత్ జోడో యాత్ర వ్యతిరేకం. ఈ 'దో హిందుస్థాన్' వెర్షన్‌ను దేశం అంగీకరించదు" అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ భారత్ జోడో యాత్రను అడ్డుకునేందుకు బీజేపీ, ఆరెస్సెస్ కుట్రలు పన్నుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

20వ రోజుకు భారత్ జోడో యాత్ర

కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలు, ప్రజా సమస్యలను ఎత్తిచూపడంతో పాటు పార్టీకి గత వైభవాన్ని తీసుకురావడానికి రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన భారత్ జోడో యాత్ర మంగళవారం 20 రోజుకు చేరుకుంది. కేరళలోని మలప్పురం జిల్లాలోకి ప్రవేశించిన కాంగ్రెస్ భారత్ జోడో యాత్రలో వందలాది మంది పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు రాహుల్ గాంధీ వెంట నడిచారు. పాలక్కాడ్ జిల్లా కొప్పంలో సోమవారం యాత్ర ముగియగా, మంగళవారంఉదయం పులమంథోల్ జంక్షన్ నుండి యాత్ర ప్రారంభమైంది. రాహుల్ గాంధీ వెంట కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్, ఎంపీ కే మురళీధరన్, ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నితన్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు ఉన్నారు. 14 కిలోమీటర్ల పాదయాత్ర అనంతరం రాహుల్ గాంధీ మధ్యాహ్నం పొరుగు ప్రాంతాల రైతులతో ముచ్చటిస్తూ మోదీ రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టారు.

ఉప్పొంగిన యమున

- ప్రమాదకరంగా ప్రవాహం
- లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపు

న్యూదిల్లీ: ఎగువ పరివాహక ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ ఏడాది ఇప్పటి వరకు యమునా నది ప్రవాహం 205.33 మీటర్ల ప్రమాద స్థాయిని అధిగమించింది. ఈ ఏడాదిలో ఎన్నడూ లేనంతగా 206.18 మీటర్లకు నీటి మట్టం పెరగడంతో దిల్లీలోని యమునా తీరానికి సమీపంలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అధికారులు ఖాళీ చేయించడం ప్రారంభించారు. మంగళవారం ఉదయం నీటి మట్టం 206 మీటర్ల మార్కును దాటిన తర్వాత తరలింపు హెచ్చరిక జారీ చేసినట్లు తూర్పు దిల్లీ జిల్లా మేజిస్ట్రేట్ అనిల్ బంకా తెలిపారు. యమునా నదీ తీర సమీపంలో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. సమీప ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, నైట్ షెల్టర్లలో వారు బస చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలను హెచ్చరించడానికి ప్రకటనలు చేస్తున్నట్లు బంకా తెలిపారు. దిల్లీలో నదికి సమీపంలో ఉన్న లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యే అవకాశం ఉంది. వాటిలో దాదాపు 37,000 మంది ప్రజలు నివసిస్తున్నారు. దీంతో ముందు జాగ్రతలు తీసుకుంటున్నట్టు అధికారులు తెలిపారు. వరదల కారణంగా యమునా నదీ ప్రవాహ ప్రాంతాల్లో నివసించే ప్రజలను అధికారులు ఖాళీ చేయించడం రెండు నెలల్లో ఇది రెండోసారి. యమునా నది ఆగస్టు 12న 205.33 మీటర్ల ప్రమాద స్థాయిని అధిగమించింది. దీని తర్వాత దాదాపు 7 వేల మందిని నదీతీరానికి సమీపంలో ఉన్న లోతట్టు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. ఇక మంగళవారం ఉదయం 5.45 గంటలకు పాత దిల్లీ రైల్వే బ్రిడ్జి వద్ద నీటి మట్టం 206 మీటర్ల తరలింపు స్థాయిని దాటిందని దిల్లీ విపత్తు నియంత్రణ అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల సమయానికి నది 206.18 మీటర్లకు ఉప్పొంగింది. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్య నీటిమట్టం 206.5 మీటర్లకు పెరగవచ్చని అంచనా వేశారు. హరియాణాలోని హత్నికుండ్ బ్యారేజీ నుంచి ఉదయం 7 గంటలకు దాదాపు 96వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటలకు నీటి విడుదల రేటు 2,95,212 క్యూసెక్కులుగా ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఇదే అత్యధికం. సాధారణంగా హత్నికుండ్ బ్యారేజీ వద్ద 352 క్యూసెక్కుల ప్రవాహం ఉంటుంది. అయితే పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసిన తర్వాత నీటి విడుదల పెరుగుతుంది. బ్యారేజీ నుంచి విడుదలయ్యే నీరు దేశ రాజధానికి చేరుకోవడానికి సాధారణంగా రెండు నుంచి మూడు రోజులు పడుతుంది. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలను అతలాకుతలం చేస్తున్నాయి. సెప్టెంబరు 21 నుంచి దిల్లీలో నాలుగు రోజుల పాటు వర్షపాతం నమోదైంది. యమునా నదీ పరివాహక ప్రాంతం ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, దిల్లీలోని కొన్ని ప్రాంతాలను కవర్ చేస్తుంది.

ఎయిర్ హోస్టెస్‌పై అత్యాచారం... నిందితుడి అరెస్టు

న్యూదిల్లీ: తనపై అత్యాచారం చేసిన వ్యక్తిని ధైర్యంగా బంధించిన ఓ ఎయిర్ హోస్టెస్ అతనిని పోలీసులకు పట్టించింది. ఈ ఘటన దిల్లీలో చోటుచేసుకొంది. మహిళపై దారుణానికి పాల్పడిన నిందితుడిని కాన్పూరుకు చెందిన హర్‌జీత్ యాదవ్‌గా గుర్తించారు. అతడొక పార్టీకి చెందిన బ్లాక్ అధ్యక్షుడిగా తేలింది. నిందితుడు హర్‌జిత్ యాదవ్ బాధితురాలికి నెలన్నరగా పరిచయం. అతడు మత్తుపదార్థాలు సేవించి ఆ ఎయిర్ హోస్టెస్ ఇంటికి వెళ్లి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు నిందితుడిని బంధించి సాయం కోసం 112 నెంబర్‌కు కాల్ చేసింది. ఈ ఘటనపై దక్షిణ జోన్ డీసీపీ చందన్ చౌదరీ మాట్లాడుతూ సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించారని పేర్కొన్నారు. బాధితురాలి వాంగ్మూలం మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు. నిందితుడిని కోర్టు ఆదేశాల మేరకు కస్టడీకి తరలించారు.

ఉపాధ్యాయుడు కొట్టడంతో దళిత విద్యార్థి మృతి

ఆరైయా: పాఠశాల ఉపాధ్యాయుడు కొట్టడంతో గాయాలపాలై దళిత విద్యార్థి మరణించిన ఘటన ఉత్తర ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. అచల్దా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫాఫాండ్ రోడ్‌లోని స్థానిక ఇంటర్ కళాశాలలో 10వ తరగతి చదువుతున్న నిఖిల్ కుమార్ (15) అనే విద్యార్థిని పరీక్షల్లో తప్పులు చేశాడని అతని సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు అశ్విని సింగ్ సెప్టెంబర్ 7న కొట్టాడు. దీంతో గాయాలపాలైన విద్యార్థిని ఆస్పత్రిలో చేర్పించగా, సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడైన ఉపాధ్యాయుడిపై భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 304, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంతో సహా సంబంధిత సెక్షన్ల కింద చర్యలు ప్రారంభించినట్లు బిధునా సర్కిల్ ఆఫీసర్ మహేంద్ర ప్రతాప్ సింగ్ తెలిపారు. ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని స్కూల్ మేనేజర్‌ని ఆదేశించినట్లు పాఠశాలల జిల్లా ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ మాలవ్య చెప్పారు. కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న ఉపాధ్యాయుడిని పట్టుకునేందుకు బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసు సూపరింటెండెంట్ చారు నిగమ్ తెలిపారు. కాగా ఉపాధ్యాయుడు తన కుమారుడిని కర్రతో కొట్టాడని, దీంతో పాఠశాలలో స్పృహతప్పి పడిపోయాడని మృతుడి తండ్రి రాజు దోహ్రే ఆరోపించారు. కుటుంబ సభ్యులు పాఠశాలకు వెళ్లగా.. తొలుత బెదిరించారు. అయినప్పటికీ, బాలుడి పరిస్థితి మరింత దిగజారడంతో ఉపాధ్యాయుడు అతన్ని ఇటావాకు తీసుకువెళ్లాడు. అక్కడ నుంచి సైఫాయ్ పీజీఐ (పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్)కి తరలించినట్లు దోహ్రే తెలిపారు. విద్యార్థి మృతి నివేదిక అందిన వెంటనే పాఠశాలను మూసివేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో కొద్దిసేపటికే భీమ్ ఆర్మీ కార్యకర్తలు బాలుడి ఇంటికి చేరుకుని నిరసనకు దిగారు. విద్యార్థి మృతదేహాన్ని అంబులెన్స్‌లో తీసుకురావడంతో స్థానికులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు.

పులకిత్ ఆర్య క్రూరుడు

ఆ రిసార్టులో వ్యభిచారం, డ్రగ్స్ మామూలే

రిషికేశ్: ఉత్తరాఖండ్‌లోని పౌరి జిల్లా రిషికేశ్ సమీపంలోని వనంత్ర రిసార్ట్‌లో పనిచేస్తున్న రిసెప్షనిస్టు అంకితా బందారి అనే యువతి వ్యభిచారం చేయడానికి నిరాకరించిందన్న కసితో హత్య చేసిన నిందితుడు పులకిత్ ఆర్య అత్యంత క్రూరుడని అక్కడ పని చేసిన మాజీ ఉద్యోగులు తెలిపారు. ఆ రిసార్టులో మద్యం, గంజాయి, డ్రగ్స్ సర్వసాధారణమని పేర్కొన్నారు. అక్కడకు వచ్చే అతిథుల కోసం రిసార్టు నిర్వాహకుడు పులకిత్ ఆర్య వ్యభిచారాన్ని నిర్వహించినట్టు స్పష్టంగా తెలిపారు. అంకితా బందారి కన్నా ముందు అక్కడ పని చేసి, రిసార్టు యజమానులు చేస్తున్న అకృత్యాల కారణంగా పనిమానేసిన రిషిత, ఆమె భర్త వివేక్... ఆ రిసార్టులో ఎటువంటి కార్యక్రమాలు జరిగేవో కళ్లకు కట్టినట్టు వివరించారు. రిషిత మాట్లాడుతూ...తన భర్త ఆ రిసార్టులో హౌస్ కీపర్‌గా పని చేస్తుండగా రెండు నెలల కిందట తాను అదే రిసార్టులో రిసెప్షనిస్టుగా చేరానని తెలిపారు. రిసార్టు నిర్వాహకులే అక్కడకు వచ్చే వారి కోసం మద్యం, గంజాయి సహా ఇతర మాదకద్రవ్యాలను సరఫరా చేసేవారని తెలిపారు. రిసార్టుకు ఎక్కువగా అమ్మాయిలు వచ్చి పోతుండే వారన్నారు. తనను కూడా వ్యభిచార రొంపిలోకి దింపాలని నిర్వాహకులు భావిస్తున్నారనే విషయం తనకు అర్థమైందని పేర్కొన్నారు. తాను వారికి లొంగకపోవడంతో దొంగతనం నేరాన్ని అంటగట్టి వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసు పెడతామని బెదిరించి లొంగదీసుకోవాలని చూశారన్నారు. పులకిత్ ఆర్యకు మద్దతుగా నిలిచిన స్థానిక పట్వారీ తనపై దాడి చేసి హింసకు గురిచేసినట్టు చెప్పారు. దాదాపు నెల రోజులు వారి చిత్రహింసలకు గురైన తాను అనారోగ్యం బారినపడి అక్కడ పని మానుకున్నట్టు వివరించారు. రిషిత భర్త వివేక్ మాట్లాడుతూ తాము పని మానుకున్న తరువాత పులకిత్ ఆర్య, రిసార్టు మేనేజర్లు తనను పిలిచి ఇకపై అలా జరగదని, పనిలో చేరాలని కోరినట్టు తెలిపారు. అయితే కొన్ని రోజుల్లోనే రిసార్టులో అదేపని మొదలు పెట్టినట్టు చెప్పారు. ఎప్పటిలాగే డ్రగ్స్ వ్యాపారం, అతిథుల కోసం వ్యభిచారం మొదలైందన్నారు. నెల పూర్తి కాగానే జీతం ఇస్తే తాను పని మానేస్తానని చెప్పగా దొంగతనం నేరం మోపి... పోలీసు కస్టడీలో చిత్రహింసలకు గురిచేస్తామని బెదిరించినట్టు తెలిపారు. ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోవడానికి సిద్ధమై తాము పని మానేశామని వివరించారు.

వీడియోలు, ట్వీట్లు తొలగించండి

న్యూదిల్లీ: లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనాపై 'తప్పుడు' ఆరోపణలు చేయకుండా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), ఆ పార్టీ నాయకులను దిల్లీ హైకోర్టు మంగళవారం నిరోధించింది. సామాజిక మాధ్యమాల్లో ఎల్‌జీపై అవమానకర పోస్టులు, వీడియోలు, ట్వీట్లను తొలగించాలని ఆదేశించింది. ఇందుకు సంబంధించి న్యాయమూర్తి జస్టిస్ అమిత్ బన్సల్, మధ్యంతర ఉపశమన ఉత్తర్వును ప్రకటిస్తూ, 'నేను వాదికి అనుకూలంగా మధ్యంతర నిషేధ ఉత్తర్వును, ఉపసంహరణ ఉత్తర్వును ఆమోదించాను' అని అన్నారు. అయితే ఇంకా వివరణాత్మక ఆదేశాలు జారీ కావలసి ఉంది. తనకు, తన కుటుంబానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో ఆరోపించిన తప్పుడు, అవమానకరమైన పోస్టులు లేదా ట్వీట్లు లేదా వీడియోలను తొలగించేందుకు దిల్లీలోని ఆప్ ప్రభుత్వం డైలాగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్‌గా నియమించిన ఆప్, దాని నాయకులు అతిషి సింగ్, సౌరభ్ భరద్వాజ్, దుర్గేష్ పాఠక్, సంజయ్ సింగ్, జాస్మిన్ షాకు ఉత్తర్వులు జారీ చేయాలని సక్సేనా కోరారు. రాజకీయ పార్టీ, దాని ఐదుగురు నాయకుల నుంచి వడ్డీతో పాటు రూ. 2.5 కోట్ల నష్టపరిహారాన్ని ఆయన కోరారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) చైర్మన్‌గా సక్సేనా నవంబర్ 2016లో రద్దయిన నోట్లను అందుకున్నారని, దానిని మార్చారని ఆప్ నేతలు ఆరోపించారు. సక్సేనా రూ.1400 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని పార్టీ ఆరోపించింది. అంతకుముందు, వాది (సక్సేనా), అతని కుటుంబ సభ్యుల చిత్రాలతో పాటు ట్వీట్లు,

దిల్లీ ఎల్‌జీకి హైకోర్టులో ఊరట

రీ-ట్వీట్లు, పోస్టులు, వీడియోలు, క్యాప్షన్‌లు, ట్యాగ్‌లైన్లను తొలగించాలని ట్విట్టర్, యూట్యూబ్ (గూగుల్ ఇంక్)ను ఆదేశించాలని సక్సేనా తరపు న్యాయవాది హైకోర్టును కోరారు. సక్సేనా కేవీఐసీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఆయన కుమార్తెకు నిబంధనలకు విరుద్ధంగా ఖాదీ కాంట్రాక్టు ఇచ్చారని ఆప్, నాయకుల తరపు న్యాయవాది వాదించారు. ఇది వాస్తవ ప్రకటన అని, ఎవరూ ఖండించలేదని న్యాయవాది చెప్పారు. ఖాదీ లాంజ్‌ను ప్రో బోనో ప్రాతిపదికన రూపొందించడంలో తన కుమార్తె సహకరించిందని, ఆమె సేవలకు ఒక్క పైసా కూడా తీసుకోలేదని సక్సేనా తరపు న్యాయవాది చెప్పారు. దీనికి, న్యాయమూర్తి 'డబ్బు తీసుకోనప్పుడు అది ఎలా అవినీతికి సమానం' అని వ్యాఖ్యానించారు. రద్దయిన నోట్ల మార్పిడి కేసుకు సంబంధించిన అభియోగపత్రంలో కేవీఐసీకి చెందిన ఇద్దరు నిందితుల ఆరోపణలు, వాంగ్మూలాలపై ఆప్, దాని నాయకులు పూర్తిగా దుష్ప్రచారం చేశారని సక్సేనా తన పరువు నష్టం దావాలో పేర్కొన్నారు. సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న మొత్తం కేవలం రూ.17 లక్షలు మాత్రమేనని, అయితే ప్రతివాదులు కొన్ని అస్పష్టమైన లెక్కల ఆధారంగా రూ.1,400 కోట్ల 'భారీ' మొత్తాన్ని సృష్టించారని వివరించారు. సక్సేనా తరపు న్యాయవాది ఆరోపణలను రుజువు చేయడానికి ఏమీ లేదని, పత్రాలు కూడా ఫోర్జరీ, కల్పితమని, సమాచారమంతా విన్నవాటిపై ఆధారపడి ఉందని వాదించారు. తనపై కించపరిచే ప్రకటనలను ప్రచురించవద్దని, ఇప్పటికే ప్రచురించిన వాటిని తొలగించాలని ఆప్, దాని నాయకులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని సక్సేనా తరపు న్యాయవాది కోరారు. ఈ దశలో కోర్టు మధ్యంతర నిషేధం విధించరాదని, చేసిన ఆరోపణల్లో వాస్తవం ఉందో లేదో విచారణ దశలోనే తేలుతుందని ఆప్, దాని నాయకుల తరపు న్యాయవాదులు వాదించారు. సక్సేనా ఇంతకుముందు ఆప్, దాని నాయకులకు లీగల్ నోటీసు పంపారు. పార్టీలోని సభ్యులందరినీ, దానితో సంబంధం ఉన్న వ్యక్తులందరినీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తప్పుడు, పరువు నష్టం కలిగించే, దురుద్దేశపూరిత ప్రచారం నుంచి దూరంగా ఉంచాలని ఆదేశిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేయాలని కోరారు. లీగల్ నోటీసు అందిన 48 గంటల్లోగా అభ్యర్థనలను పాటించాలని పేర్కొంది.

ప్రగతిశీల కళలకు ముప్పు

బూర్జువా సంస్కృతిని పెంచి పోషిస్తున్న మోదీ సర్కారు

సీపీఐ మహాసభల సీడీ ఆవిష్కరణలో నారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రధాని మోదీ హయాంలో ప్రగతిశీల కళలు, సంస్కృతిని తీవ్రంగా దెబ్బతీస్తున్నారని, బూర్జువా సంస్కృతిని పెంచి పోషిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. అలాంటి సంస్కృతిని పెంచిపోషించడంలో భాగంగానే బిగ్ బాస్ వంటి టీవీ షోలు వస్తున్నాయని మండిపడ్డారు. విజయవాడలో అక్టోబర్ 14-18 తేదీలలో జరిగే సీపీఐ 24వ జాతీయ మహాసభలను పురస్కరించుకొని ప్రజా నాట్యమండలి అధ్వర్యంలో రూపొందించిన పాటల సీడీని మంగళవారం నారాయణ ఆవిష్కరించారు. హైదరాబాద్ మగ్దూంభవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రా నాయక్ అధ్యక్షతన జరిగిన సీడీ ఆవిష్కరణ సభలో జాతీయ మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శులు కె.రామకృష్ణ, చాడ వెంకటరెడ్డి, ఇప్టా ఉపాధ్యక్షుడు కె.ప్రతాప్ రెడ్డి, సినీ సంగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాస్, తెలంగాణ ప్రజానాట్య మండలి అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, మాజీ ఎంఎల్‌సీ పీజే చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు. సీడీని ఆవిష్కరించిన అనంతరం నారాయణ మాట్లాడుతూ ప్రజలకు ప్రత్యామ్నాయ, ప్రగతిశీల సంస్కృతిని, కళలను అందించేది కమ్యూనిస్టు పార్టీ ప్రజాకళాకారులు మాత్రమేనని తెలిపారు. విజయవాడలో మహాసభ సందర్భంగా కమ్యూనిస్టు అగ్రనేత చండ్ర రాజేశ్వరరావు చరిత్రను విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రజా నాట్యమండలి అధ్వర్యంలో ఆయనపై ఒగ్గు కథ రూపొందుతున్నదని తెలిపారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ మహాసభలో భాగంగా అక్టోబర్ 14న విజయవాడలో భారీ బహిరంగసభను ఏర్పాటు చేస్తున్నామని, దీనికి ఏపీ, తెలంగాణ నుండి పెద్దఎత్తున ప్రజలు హాజరుకానున్నారని చెప్పారు. 15న ప్రతినిధుల సభకు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ(ఎంఎల్-లిబరేషన్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ నాయకులు, 20కి పైగా దేశాల కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీ ప్రతినిధులు హాజరై సౌహార్ద సందేశాలిస్తారని తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక విధానాలను ప్రజల ముందుకు తెచ్చేందుకు విజయవాడ మహాసభ వేదిక కానుందన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ 47 సంవత్సరాల తరువాత విజయవాడలో జరగనున్న జాతీయ మహాసభకు ప్రాముఖ్యత ఉన్నదని, ప్రస్తుతం సంధికాలం నడుస్తోందని తెలిపారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న నియంతృత్వ, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, ప్రజాతంత్ర, లౌకికశక్తులను కలుపుకొని వెళ్లేందుకు వేదిక దిశగా మహాసభలో కార్యాచరణ ఉండబోతుందన్నారు. భవిష్యత్తు రాజకీయాలపై తీర్మానాలు, నిర్ణయాలతో పాటు కార్యా చరణను మహాసభలో నిర్ణయించనున్నట్లు వెల్లడించారు. కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ విజయవాడ మహాసభ కమ్యూనిస్టు పార్టీల విలీనం దిశగా అడుగులు వేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. వందేమాతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పాటలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పల్లె నర్సింహ మాట్లాడుతూ పాటలకు వందేమాతరం శ్రీనివాస్ సంగీతం అందించగా చైతన్య ప్రసాద్, వెంకన్న, కేవీఎల్ సాహిత్యం అందించారని తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు విద్యుత్ బస్సులు

- ఏపీఎస్ఆర్టీసీకి 10 బస్సులు సరఫరా చేసిన ఒలెక్ట్రా
- తిరుమలకు సర్వీసులను ప్రారంభించిన సీఎం జగన్
- త్వరలో నెల్లూరు, కడప, మదనపల్లెకు కాలుష్యరహిత బస్సులు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుమల బ్రహ్మోత్సవాలకు కాలుష్యరహిత విద్యుత్ బస్సులను సీఎం జగన్ బుధవారం ప్రారంభించారు. దేశంలో ఎలక్ట్రిక్ బస్సుల తయారీ, ఎలక్ట్రిక్ మొబిలిటీలో అగ్రగామి సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఒలెక్ట్రా), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్‌టీసీ)కి 10 అత్యాధునిక విద్యుత్ బస్సులను సరఫరా చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ బస్సులను అలిపిరి డిపోలో జెండా ఊపి బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. గత ఏడాది నవంబర్‌లో ఒలెక్ట్రా, ఈవీ ట్రాన్స్‌ల కన్సార్టియంకు ఏపీఎస్ఆర్‌టీసీ విద్యుత్‌తో నడిచే 100 బస్సులకు ఆర్డర్ ఇచ్చింది. ఈ 100 ఈ-బస్సులను 12 సంవత్సరాల పాటు స్థూల వ్యయ కాంట్రాక్టు నమూనా ప్రాతిపదికన సరఫరా చేయడంతో పాటు నిర్వహణను కూడా ఒలెక్ట్రా చేపడుతుంది. మిగిలిన 90 విద్యుత్ బస్సులను అతి త్వరలో సరఫరా చేయనున్నది. వీటిని అలిపిరి (తిరుపతి)లో ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ బస్సుల డిపో నుంచి నిర్వహిస్తారు. 50 బస్సులను తిరుమల-తిరుపతి ఘాట్‌లో నడపనుండగా, మిగిలిన 50 బస్సులు నెల్లూరు, కడప, మదనపల్లెకు ఇంటర్‌సిటీ సర్వీసులుగా నడుస్తాయి. ఈ సందర్భంగా ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ప్రదీప్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వెళ్లే భక్తులకు సేవ చేయడం తమకు లభించిన ఆశీర్వాదంగా భావిస్తున్నామని తెలిపారు. తిరుమల-తిరుపతి ఘాట్ రోడ్డులో ఈ విద్యుత్ బస్సులు అత్యంత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తాయని అన్నారు. శేషాచల అడవులతో పాటు తిరుమల కొండల పర్యావరణాన్ని కాపాడతాయని తెలిపారు. ఈ 9 మీటర్ల ఎయిర్ కండిషన్డ్ బస్సులు 35... డ్రైవర్ సీటింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. బస్సుల్లో ప్రయాణికుల భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు, ప్రతి సీటుకు యూఎస్‌బీ సాకెట్లు, ఎమర్జెన్సీ బటన్‌లు ఉంటాయి. బస్సులో అమర్చబడిన లిథియం-అయాన్ బ్యాటరీ ట్రాఫిక్, ప్రయాణికుల లోడు పరిస్థితుల ఆధారంగా ఒకేఛార్జ్‌తో 180 కి.మీలు బస్సు ప్రయాణిస్తుంది. బస్సులో పునరుత్పాదక బ్రేకింగ్ వ్యవస్థ ఉందని ఆయన వివరించారు.

వెంకన్నకు పట్టువస్త్రాలు...

సంప్రదాయ దుస్తుల్లో సీఎం జగన్

విశాలాంధ్ర-తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సీఎం జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం రాత్రి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఏటా రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. సీఎం జగన్ స్వామివారికి నాల్గవసారి పట్టువస్త్రాలు అందజేశారు. తొలుత సాంప్రదాయ దుస్తులతో శ్రీ బేడీ ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకున్న సీఎంకు అర్చకస్వాములు పరివట్టంగా తలపాగ చుట్టగా పట్టు వస్త్రాలు తీసుకుని ఆలయానికి బయలుదేరారు. స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపంలో సీఎంకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి స్వామివారి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. పెద్దశేష వాహన సేవలో పాల్గొన్న సీఎం ఆ తరువాత తిరుమలలోని శ్రీ పద్మావతి అతిథి గృహానికి చేరుకున్నారు. రాత్రికి అక్కడే బసచేసి బుధవారం ఉదయం 6 గంటలకు మరోసారి స్వామివారిని దర్శనం చేసుకుంటారు. అనంతరం రూ.23 కోట్లతో నిర్మించిన పరాకామణి భవనాన్ని ప్రారంభిస్తారు. బాలాజీ నగర్ లో రెస్ట్ హౌస్‌ను ప్రారంభించి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, కొట్టు సత్యనారాయణ, రోజా, ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు సీఎం వెంట ఉన్నారు.

పీఎస్‌యూల పరిరక్షణకు పోరాడదాం

ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

విశాలాంధ్ర-కడప రూరల్: కేంద్రంలోని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలు వేగవంతం చేసి కార్మికులను, ప్రజలను కష్టాలపాలు చేస్తున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య అన్నారు. మంగళవారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశం అధ్యక్షుడు జి.వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్, జీఎస్‌టీ రేట్లు పెంచి ప్రజలపై భారం మోపిందని విమర్శించారు. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్, బస్సు చార్జీలు, ఆస్తి, చెత్త పన్నును పెంచి భారాలు వేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తెచ్చిన చట్టాలను రైతాంగం ప్రజల మద్దతుతో ఏడాదికిపైగా పోరాడి రద్దు చేయించుకున్నారని చెప్పారు. అయితే వారికి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోదీ ప్రభుత్వం మోసం చేస్తున్నదని తెలిపారు. యాజమాన్యాలకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చటం మోదీ కార్పొరేట్ అనుకూల విధానాలకు నిదర్శనమని, కార్మిక కోడ్‌ల రద్దుకు పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు, స్వచ్ఛ భారత్‌లోని క్లాఫ్ మిత్రలకు మూడు నెలల నుంచి ఆరు నెలల వరకు బకాయి ఉన్న వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రజల పన్నులతో నిర్మించిన ప్రభుత్వ రంగాన్ని, సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని, ఇది దేశద్రోహమని తెలిపారు. ప్రజల ఆస్తులయిన ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ఉద్యమిస్తామన్నారు. కార్మిక వర్గ పక్షపాతి సీపీఐ 24 జాతీయ మహాసభలు అక్టోబర్14 నుంచి 18 వరకు విజయవాడలో జరగనున్నాయని, వాటిని జయప్రదం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి కార్యక్రమాలను సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణ ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపప్రధాన కార్యదర్శి కె.సి.బాదుల్లా, నగర కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, ఉపాధ్యక్షులు చాంద్ బాషా, కార్యదర్శి శ్రీరాములు, జిల్లా సమితి సభ్యులు పి.చంద్రశేఖర్, శివారం, మేరీ, కామాక్షి, పార్వతి, కల్పన, శాంతి, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌కు అన్ని మౌలిక వసతులు కల్పిస్తాం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలన్నీ తమ ప్రభుత్వ హయాంలోనే కల్పించామని, భవిష్యత్తులోనూ అవసరమైన వాటిని సమకూరుస్తామని వైద్య ఆరోగ్య, వైద్య విద్యాశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎయిమ్స్‌ను పట్టించుకోవటం లేదంటూ కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారానికి పూనుకోవటం దారుణమన్నారు. మంగళవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2019 మార్చిలో ఎయిమ్స్ ప్రారంభమైందని, జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే ఎయిమ్స్‌కు మౌలిక వసతుల పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నదన్నారు. రోజుకు 3.25 లక్షల లీటర్ల నీటిని ఎయిమ్స్‌కు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఎయిమ్స్ విషయంలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు సమకూరుస్తున్నామని అన్నారు. కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకుండా ఎయిమ్స్ ప్రారంభమైందని, శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని వివరించారు. రోజుకు 25 లక్షల లీటర్ల నీటి సరఫరా ఎయిమ్స్‌కు అవసరమవుతుందని ఆమె తెలిపారు. శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా 26 జులై 2022న జీవో నంబరు 534 ద్వారా రూ.7.74 కోట్లతో సాంకేతికపరమైన అంచనాలతో రివర్స్ టెండరింగ్ ద్వారా ఎల్1 బిడ్డరు టెండరు జారీ చేశామన్నారు. ఎయిమ్స్‌కు రహదారి సౌకర్యం కల్పించామని, వీధి లైట్లకు రూ.10 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. పూర్తి స్థాయి విద్యుత్ సరఫరా కోసం రూ.35 కోట్లతో 132 కేవీ సబ్‌స్టేషన్ కూడా ఏర్పాటు చేశామన్నారు. అటవీ, కాలుష్య నియంత్రణ మండలి అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని, మెరుగైన వైద్య సేవలందించటంలో, ఎయిమ్స్ అభివృద్ధికి ఖర్చు ఎంతైనా భరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందని ఆమె స్పష్టం చేశారు ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ (కోవిడ్ వాక్సినేషన్, మేనేజమెంట్) ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర పాల్గొన్నారు.

పెరిగిన అంబేద్కర్ విగ్రహ నిర్మాణ వ్యయం

ఏప్రిల్ 14న ఆవిష్కరణ చేస్తాం: మేరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయవాడలో ఏర్పాటు చేస్తున్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ నిర్మాణం ఖర్చు రూ.100కోట్ల నుంచి రూ.265 కోట్లకు పెరిగిందని విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్వరాజ్ మైదాన్ ప్రాజెక్టులో భాగంగా విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో జరుగుతున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మీడియాతో మంత్రి నాగార్జున మాట్లాడుతూ ఎంత డబ్బు ఖర్చయినా సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం రాబోయే అంబేద్కర్ జయంతి నాటికి విగ్రహావిష్కరణ చేస్తామన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహంతో పాటు ఆయన జీవిత విశేషాలను తెలియజేసేలా చేపట్టిన స్వరాజ్ మైదాన్ పనులకు ముందుగా రూ.100 కోట్లు ఖర్చవుతాయని భావించామని, ప్రస్తుతం ఈ ఖర్చు రూ.265 కోట్లకు చేరిందన్నారు. విగ్రహావిష్కరణ పనులు పూర్తయి, ప్రాజెక్టు చివరి దశకు చేరుకొనే సమయానికి ఈ ఖర్చు మరింతగా పెరిగే అవకాశముందన్నారు. ఎంత ఖర్చు చేసైనా సీఎం కోరుకుంటున్న విధంగా అంబేద్కర్ స్వరాజ్ మైదాన్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రస్తుతం కీలక దశకు చేరుకున్నాయని, వాటిని వివిధ దశలుగా విభజించడం ద్వారా నిర్ణీత గడువులోగా విగ్రహావిష్కరణను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. 2023 ఏప్రిల్ 14న అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేసేలా యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇటీవల మంత్రుల బృందం హరియాణాకు వెళ్లి విగ్రహ నమూనాను పరిశీలించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, సీఎం సైతం ఈ విగ్రహ నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సలహాలు, సూచనలు ఇస్తున్నారని వెల్లడించారు. నిర్మాణ పనులు పరిశీలించిన అనంతరం మంత్రి నాగార్జున సంబంధిత అధికారులతో విగ్రహ నిర్మాణం, ఇతరత్రా నిర్మాణాలకు సంబంధించిన పనులు సమీక్షించారు. సాంఘిక సంక్షేమశాఖ సంచాలకులు కాటి హర్షవర్ధన్, ఏపీఐఐసీ ఇంజినీర్ ఇన్ చీఫ్ శ్రీనివాస్ ప్రసాద్, కేపీసీ ప్రాజెక్టు డైరెక్టర్ వాసుదేవరావు, ప్రాజెక్ట్ మేనేజర్లు జావేద్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రాజీనామాపై వెనక్కి తగ్గేది లేదు: యార్లగడ్డ

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): వైద్య విశ్వవిద్యాలయానికి ఉన్న ఎన్టీఆర్ పేరు మార్చి..వైఎస్సార్ పేరు పెట్టడం సబబు కాదని మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్‌తో ఉన్న అనుబంధం కారణంగా తనకున్న మూడు పదవులకు రాజీనామా చేశానని, అదే రోజు రాజీనామా పత్రాలు అధికారులకు పంపినట్లు తెలిపారు. అయితే తాను స్వరం మార్చినట్లుగా కొన్ని వార్తలు వచ్చాయని, తాను స్పష్టంగా చేపుతున్నానని, ఇప్పటికీ స్వరం మార్చలేదని, రాజీనామాపై వెనక్కి తగ్గేది లేదని అన్నారు. భాషాభివృద్ధికి పదవే అవసరం లేదని, పదవిలో లేకపోయినా భాషాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. రాజీనామా చేసి జగన్‌ను తిడుతున్నారెందుకని అమెరికా నుంచి అడుగుతున్నారని, తాను ఎప్పుడూ జగన్‌ను పల్లెత్తు మాట అనలేదన్నారు. మంచి చేసినప్పుడు మంచి చేశారని చెప్పానని, ఇప్పుడు వైద్య విశ్వ విద్యాలయానికి పేరు మార్చడం నచ్చకపోవడంతో రాజీనామా చేసి బయటకు వచ్చానని తెలిపారు. రాజీనామాపై వెనుకడుగు వేసేది లేదని, మళ్లీ తీసుకోమన్నా...వద్దనే చెబుతానన్నారు. లక్ష్మీపార్వతి వ్యాఖ్యలపై తాను స్పందించబోనని తెలిపారు. కొత్తగా ఏర్పడిన ఏపీలో రాజధానికి ఎన్టీఆర్ పేరు పెట్టాలని ఎప్పుడో చెప్పానని, ఆనాటి ప్రభుత్వం అమరావతి అని పేరు పెట్టిందన్నారు. దేవేంద్రుడు రాజధాని అమరావతి పేరు ఏపీకి ఎందుకని ప్రశ్నించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న వాజ్‌పేయి ప్రధానిగా ఉండగానే వచ్చిందని, అయితే అనాడు కేంద్రంలో చక్రం తిప్పినట్లుగా చెప్పుకుంటున్న వ్యక్తి అడ్డుకోవటంతో ఆగిపోయిందని చెప్పారు. భారతరత్న వస్తే దానిని లక్ష్మీపార్వతి తీసుకుంటుందని, అది ఇష్టంలేని వాళ్లు మోకాలడ్డారని వివరించారు. ఇకపై తాను రాజకీయాలు మాట్లాడనని, భాషాభివృద్ధికి మాత్రమే కృషి చేస్తానన్నారు. ఇకనైనా తనపై అబద్ధపు ప్రచారాలు ఆపాలని కోరుతున్నానని విజ్ఞప్తి చేశారు.

నయీం కేసును సీబీఐతో విచారించాలి: నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నయీం కేసు పునాదులు కదలాలంటే సీబీఐతో విచారించాలని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళశారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రాజకీయ నేతల అండదండలతోనే నయీం సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోగ లిగారన్నారు. నయీంను హతమార్చడం సంతోషమేనని, అయితే ఆ మూలాలు పోవాలని పేర్కొన్నారు. నయీం కేసుపై వేసిన సిట్ తప్పుల తడకగా మారిం దన్నారు. నయీం మూలాలను అంతం చేయకుంటే..మళ్లీ నయీంలు పుట్టకొస్తారని పేర్కొన్నారు.

పీఎఫ్ఐపై దాడులు ముమ్మరం

- ఎనిమిది రాష్ట్రాల్లో ఎన్ఐఏ విస్తృత సోదాలు
- ఇతర దర్యాప్తు సంస్థలతో కలిసి ఆపరేషన్ ఆక్టోపస్
- పోలీసుల అదుపులో వందల మంది

న్యూదిల్లీ : పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)పై ఎన్ఐఏ దాడులను ముమ్మరం చేసింది. ఆ ఇస్లామిక్ సంస్థతో సంబంధం ఉన్న ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఇతర దర్యాప్తు సంస్థలతో కలిసి మరోసారి దాడులు నిర్వహించింది. మంగళవారం ఎనిమిది రాష్ట్రాల్లో ఎన్ఐఏ, ఈడీ సంయుక్తంగా సోదాలు చేపట్టాయి. ఇప్పటికే ఆ సంస్థ అధ్యక్షులను అదుపులోకి తీసుకోగా, తాజా దాడుల్లో దేశవ్యాప్తంగా వంద మందికి పైగా పీఎఫ్ఐ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వివరించారు. ఈ దాడుల సందర్భంగా చాలా ముఖ్యమైన సమాచారాన్ని ఎన్ఐఏ స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతిస్తున్నారనే ఆరోపణలపై ఆపరేషన్ ఆక్టోపస్ కింద ఎన్ఐఏ, ఇతర దర్యాప్తు సంస్థలతో కలిసి ఆ సంస్థతో సంబంధం ఉన్న అనేక మంది సభ్యులు, సంస్థ కార్యాలయాల్లో సోదాలు చేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ, కేరళ, గుజరాత్, కర్ణాటక, అసోంలో ఈ దాడులు జరుగుతున్నాయి. ఈ ఆపరేషన్‌లో కేంద్ర నిఘా సంస్థ-ఐబీ, ఆయా రాష్ట్రాల పోలీసులు కూడా భాగమైనట్లు ఎన్ఐఏ కేంద్ర కార్యాలయం వెల్లడించింది దేశ రాజధాని దిల్లీలోని షాహీన్‌బాగ్, నిజాముద్దీన్, జామియా నగర్‌లలో దాడులు జరిగాయి. దాదాపు 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు సంస్థలతో పాటు దిల్లీ పోలీసు ప్రత్యేక విభాగం, స్థానిక పోలీస్ స్టేషన్ల బృందాలు పాల్గొన్నాయి. నవంబర్ 17 వరకు జామియా నగర్‌లో సీఆర్‌పీసీ సెక్షన్ 144 విధించారు. ఈశాన్య దిల్లీలోని అనేక ప్రదేశాల్లో అర్ధరాత్రి నుంచి సోదాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటకలో 75 మంది పీఎఫ్ఐ సభ్యులను 'ప్రివెంటివ్ కస్టడీ' కింద అదుపులోకి తీసుకున్నారు. బీదర్, మంగళూరు, కోలార్, విజయపుర, బాగల్‌కోట్, చిత్రదుర్గ, బళ్లారి, చామరాజనగర్‌లో దాడులు నిర్వహించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో పీఎఫ్ఐకు చెందిన అబ్దుల్ కరీం, సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) కార్యదర్శి షేక్ మస్నూద్ ఉన్నారు. ప్రస్తుతం దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాలో దాడులు కొనసాగుతున్నాయని దర్యాప్తు సంస్థల అధికారులు తెలిపారు. అసోంలో గోల్‌పరా, కామరూప్, బార్‌పేట, ధుబ్రి, బాగ్సా, దర్రాంగ్, ఉదల్‌గురి, కరీంగంజ్ జిల్లాల్లో దాడులు కొనసాగాయి. మొత్తం 21 మంది పీఎఫ్ఐ సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలో ఉగ్ర కార్యకలాపాలకు నిధుల మళ్లింపు ఆరోపణల క్రమంలో పోలీసులు పూణేలో ఆరుగురు పీఎఫ్ఐ మద్దతుదారులను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పీఎఫ్ఐ సభ్యులను ముంబ్రా నుంచి అరెస్టు చేయగా, ఒక్కొక్కరిని భివాండి, కళ్యాణ్ ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్నారు. ఎన్ఐఏ, ఏటీఎస్ సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించాయి. అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్‌తో సహ పీఎఫ్ఐపై దాడుల సందర్భంగా అరెస్టయిన ఐదుగురు నిందితుల సంబంధాలపై దర్యాప్తు చేయాలని, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను కూడా దర్యాప్తు చేయాలని మహారాష్ట్ర ఏటీఎస్ సోమవారం కోర్టుకు తెలిపింది. నిందితుల్లో ఒకరి నుంచి కొంత సాహిత్యాన్ని, 'హూ కిల్డ్ కర్కరే' అనే పుస్తకాన్ని స్వాధీనం చేసుకున్నామని, అతని ల్యాప్‌టాప్, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించింది. మధ్యప్రదేశ్‌లో 21 మంది పీఎఫ్ఐ సభ్యులను, ఉత్తరప్రదేశ్‌కు చెందిన లక్నోలోని బక్షి తలాబ్, ఇతౌంజా నుంచి పీఎఫ్ఐతో సంబంధం కలిగిన 10 మందిని దర్యాప్తు సంస్థలు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నాయి. గుజరాత్‌లో రాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం, ఎన్ఐఏ సంయుక్త బృందం కనీసం 10 మందిని ప్రశ్నించడానికి అదుపులోకి తీసుకున్నాయి. అయితే, పీఎఫ్ఐ లక్ష్యంగా కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేయడం గత రెండు వారాల్లో ఇది మూడోసారి. సెప్టెంబర్ 22న దేశవ్యాప్తంగా ఎన్ఐఏ విస్తృత సోదాలు నిర్వహించింది. దేశంలో తీవ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇస్తున్నారనే ఆరోపణలపై 11 రాష్ట్రాల్లోని 106 మంది పీఎఫ్ఐ కార్యకర్తలను అరెస్టు చేసింది. కేరళలో అత్యధికంగా 22 మందిని అరెస్టు చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక (20), తమిళనాడు (10), అసోం (9), ఉత్తరప్రదేశ్ (8), ఆంధ్రప్రదేశ్ (5), మధ్యప్రదేశ్ (4), పుదుచ్చేరి, ఢిల్లీ (3) రాజస్థాన్‌లో ఇద్దరిని అరెస్టు చేసింది. ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చేవారు, ముష్కరుల కోసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేవారు, నిషేధిత సంస్థల్లో చేరేలా ప్రజలను ప్రభావితం చేసేవారిని లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ చేపట్టామని ఎన్ఐఏ చెబుతోంది. పీఎఫ్ఐపై ఇంతకుముందు కూడా ఇలాంటి దాడులు జరిగాయి. పౌరసత్వ చట్టం వ్యతిరేక ఆందోళనలు, 2020 దిల్లీ అల్లర్లు, యూపీ హాత్రాస్‌లో దళిత బాలిక సామూహిక అత్యాచారం వ్యవహారంలో కుట్ర సహా మరికొన్ని సందర్భాల్లో పీఎఫ్ఐ ఆర్థిక వనరులు సమకూర్చిందన్న ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు చేస్తోంది. లక్నోలోని పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టులో ఇప్పటికే రెండు అభియోగ పత్రాలను కూడా దాఖలు చేసింది.

శ్రద్ధాంజలి

మా తల్లిగారైన
గంగిరెడ్డి లక్ష్మమ్మ గారు
తేది : 18-09-2022
ఆదివారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు
శాంతి చేకూరాలని
కోరుతూ...

కుమారులు : గంగిరెడ్డి రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి
మరియు కుటుంబ సభ్యులు

పెద్దకర్మ : తేది : 28-09-2022 బుధవారం ఉదయం హెచ్.ఎం.పాడు మండలం, గురువారెడ్డిపల్లి గ్రామంలోని మా స్వగృహమునందు జరుగును.



"రాజకీయ ఆందోళన విస్తరించాలంటే రాజకీయ కుట్రలను బహిర్గతం చేయవలసిందే."
- లెనిన్

CPI 24th PARTY CONGRESS 2022 October 14-18 VIJAYAWADA

COMMUNIST PARTY OF INDIA

సీపీఐ 24వ జాతీయ మహాసభలు

అక్టోబర్ 14-18, 2022 విజయవాడ

తొలి కమ్యూనిస్టు ముఖ్యమంత్రి

ఈఎంఎస్

అరుణ తారలు

ఎలంకుళం మనక్కల్ శంకరన్ నంబూద్రిపాద్

ఎలంకుళం మనక్కల్ శంకరన్ నంబూద్రిపాద్ (1909-1998) గొప్ప కమ్యూనిస్టు నాయకుడిగానే అందరికీ తెలుసు. కానీ ఆయనొక స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, సామ్రాజ్యవాద వ్యతిరేకి, మార్క్సిస్ట్ సిద్ధాంతకర్తల్లో ఒకరు, సామాజిక-రాజకీయ చరిత్రకారుడు, మేధావి, పాత్రికేయుడు, కాలమిస్టు, పార్టీ వ్యూహకర్త, ఎత్తుగడల్లో దిట్ట, ప్రజానాయకుడు, ముఖ్యమంత్రి కూడా. 50వ దశకం ఆఖరి వరకు కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేసిన వారిలో ఆయనొకరు. ఎన్ని విమర్శలు వచ్చినప్పటికీ, అధునాతన భారతదేశంలో పార్లమెంటరీ కమ్యూనిజం ఉండితీరాలని నమ్మిన వ్యక్తుల్లో ఈఎంఎస్ నంబూద్రిపాద్ ప్రథములు. అంటే దేశంలో చట్టసభల్లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం పెరగడం ద్వారానే సమస్యలకు అధిక పరిష్కారం లభిస్తుందని భావించే వ్యక్తి. ఆయనను అందరూ ఈఎంఎస్ అని పిలిచేవారు.

1909 జూన్ 14న కేరళలోని మళప్పురం జిల్లా పెరింథల్‌మన్నా తాలూకాలో జన్మించిన ఈఎంఎస్... తండ్రి పరమేశ్వరన్ నంబూద్రిపాద్ తన బాల్యంలోనే మరణించడంతో, తల్లి విష్ణదత్త అంతమ్‌జ్ఞానం ప్రభావం ఆయనపై ఎక్కువగా పడింది. చిన్నప్పుడే సంస్కృతం, వేదాలు, ఉపనిషత్తులను ఆపోసన పట్టారు. నంబూద్రి సమాజంలో కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడే వి.టి.భట్టతిరప్పాద్ నేతృత్వంలోని ప్రగతిశీల, సంస్కరణవాదుల గ్రూపు 'యోగసంక్షేమసభ' కార్యకర్తలతో ఈఎంఎస్ ఎక్కువ గడిపేవారు. 15వ ఏటనే 'యోగక్షేమసభ' అనే సంఘం కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత రాజకీయ జీవితం ఆరంభమైంది. పెరింథల్‌మన్నాలో పాఠశాల విద్య, పాలక్కడ్‌లో ఉన్నతపాఠశాల విద్య చదివిన తర్వాత విక్టోరియా కళాశాలలో విద్యార్థిగా చేరినప్పటి నుంచి బ్రిటిష్‌పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడం మొదలెట్టారు. 1929లో త్రిస్సూర్‌లోని సెయింట్ థామస్ కాలేజీలో చేరిన తర్వాత ఆయనకు రాజకీయ అనుభవం పెరిగింది. ప్రగతిశీల పత్రిక 'ఉన్ని నంబూద్రి'తో అనుబంధం వల్ల ఈఎంఎస్‌కు రాజకీయ దృక్పథంతోపాటు జర్నలిజంలో నైపుణ్యం పెరిగింది. మద్రాసు, పయన్నూర్, వడకర ప్రాంతాల్లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలకు హాజరైన ఈఎంఎస్ 1932లో కాలేజీకి స్వస్తిచెప్పి శాసనోల్లంఘన ఉద్యమంలో మమేకమయ్యారు. ఆ సమయంలోనే కాలికట్‌లో అరెస్టయి జైలుకెళ్లారు. 1934లో రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అనంతరం కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని పెట్టారు. ఆనాటి అభ్యుదయ శక్తులతో కలిసి తాను కూడా 1939లో పినరయిలో జరిగిన మహాసభలో భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అదే ఏడాదిలో ఈఎంఎస్ మద్రాసు శాసనసభకు ఎన్నిక కావడం విశేషం. అఖిలభారత కిసాన్ సభ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరిగా ఈఎంఎస్ మలబార్ రైతు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు.

ప్రత్యేక కేరళ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కమ్యూనిస్టు పార్టీ విస్తరణలో కీలకభూమిక వహించారు. 1957 సార్వత్రిక ఎన్నికల్లో నీలేశ్వరం నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఈఎంఎస్ కేరళ తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనేక ప్రగతిశీల చట్టాలను తీసుకువచ్చారు. విమోచనోద్యమం అతని మంత్రివర్గ బర్తరఫ్‌కు దారితీసింది. పార్టీలో చీలిక వచ్చాక ఈఎంఎస్ సీపీఐ(ఎం)వైపు మొగ్గుచూపారు. 1960, 1967, 1970లలో వరుసగా పట్టాంబి నియోజకవర్గం నుంచి, 1977లో అలాథుర్ నుంచి రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1967 నుంచి 69 వరకు కేరళ సీఎంగా, ఆ తర్వాత సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈఎంఎస్ 89వ యేట 1998 మార్చి 19వ తేదీన కన్నుమూశారు.

'నేను కమ్యూనిస్టును ఎలా అయ్యాను?', 'కేరళ సమాజం-రాజకీయాలు: ఒక చారిత్రక అధ్యయనం', 'నెహ్రూ, సిద్ధాంతం మరియు ఆచరణ', 'ది మహాత్మా అండ్ ఇజమ్', 'జాతీయ సమగ్రత సమస్యలు', 'కేరళ నాడు, నేడు, రేపు', 'సంక్షోభంలో భారత ప్రణాళిక', 'భారత స్వాతంత్ర్య సమర చరిత్ర' వంటి అనేక పుస్తకాలను ఈఎంఎస్ రాశారు.

- ఎ.బి.కూన

సాయుధ పోరులో

అగ్ని కణం

పండిత్ నెహ్రూ అమలు చేసిన సోషలిజం ఏ పాటిది అన్న ప్రశ్న ఉండొచ్చు కానీ ఆయన సోషలిస్టు భావాలు చాలా మందిని ప్రభావితం చేశాయి. అలాంటి వారు నెహ్రూ పరిధి దాటి చాలా ముందుకెళ్లిపోయారు. ప్రాణాలకు కూడా లెక్క చేయకుండా ప్రజాపోరాటాల్లో లీనమైపోయారు. అలాంటి వారిలో తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చిన ముగ్గురిలో బద్దం ఎల్లారెడ్డి (1906 - 1979) ఒకరు. 1930 1940లలో భూస్వామ్య కుటుంబంలో పుట్టిన చాలా మంది తమ వర్గ స్వభావాన్ని వదిలేసి ప్రజలపక్షాన నిలబడి విప్లవ కార్యాచరణకు అంకితమయ్యారు. బద్దం ఎల్లా రెడ్డి సరిగా ఆ కోవలోని వారే.

1930ల ఆరంభంలోనే నిజాం ఎన్ని ఆంక్షలు విధించినప్పటికీ కమ్యూనిజం వేపు ఆకర్షితులైన వారు అనేక మంది కనిపిస్తారు. వీరు మొదటి కాంగ్రెస్ లో ఉండి ఉండొచ్చు. లేదా ఆర్యసమాజంలో ఉండొచ్చు. బద్దం ఎల్లా రెడ్డి 1938లో రావి నారాయణ రెడ్డితో కలిసి కాకినాడ వెళ్లి సత్యాగ్రహం చేసి ఏడు నెలలు జైలు పాలయ్యారు. విద్యార్థి దశలోనే ఆయన సమర శీల భావాలు కలిగి ఉండేవారు. సాయుధ పోరాట కాలంలో అరెస్టయి మూడేళ్ల జైలు జీవితం గడిపారు. 1939లో హైదరాబాద్ సంస్థానంలో సీపీఐ కార్యకలాపాలు ప్రారంభించినప్పుడు బద్దం ఎల్లా రెడ్డి అందులో చురుకుగా పాల్గొన్నారు.

బద్దం ఎల్లా రెడ్డి

ఆంధ్ర మహాసభలో రావి నారాయణ రెడ్డితో కలిసి ఆ సంస్థను సచేతనంగా మార్చి వామపక్ష భావాలు నింపిన వారిలో బద్దం ఎల్లా రెడ్డి ప్రధానమైన పాత్ర పోషించారు.

1941 నుంచి ఆంధ్రమహాసభలో కమ్యూనిస్టు భావాల ప్రాబల్యం ఉన్న వారి ఆధిపత్యం పెరిగింది. బద్దం ఎల్లా రెడ్డి ఆంధ్ర మహాసభ ప్రధాన కార్యదర్శి కూడా అయ్యారు. కమ్యూనిస్టు భావాలున్న వారి ప్రభావంవల్లే ఆంధ్ర మహాసభ పోరాట పటిమగల సంస్థగా మారి సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీతో భుజం భుజం కలిసి నడవగలిగింది. తెలంగాణలో పౌరహక్కుల కోసం పోరాడిన తొలి దశ నాయకుల్లో ఎల్లా రెడ్డి పాత్ర అద్వితీయమైంది.

తొలి పార్లమెంటు ఎన్నికలలో బద్దం ఎల్లా రెడ్డి కరీంనగర్ నుంచి ప్రోగ్రెసివ్ డెమొక్రాటిక్ ఫ్రంట్ - పి.డి.ఎఫ్. (అప్పుడు కమ్యూనిస్టులు ఈ పేరుతోనే పోటీ చేశారు) లోకసభకు ఎన్నికయ్యారు. అప్పుడాయన కాంగ్రెస్ నాయకుడు పీవీ నరసింహా రావును ఓడించారు. 1958లో బుగ్గారం శాసన సభ నియోజకవర్గం నుంచి శాసన సభ్యుడిగా విజయం సాధించారు.

1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయినప్పుడు ఆయన ముందు సీపీఎంలో చేరారు. అయితే మూడు నెలల్లోనే మళ్లీ సీపీఐలో చేరారు. 1964 నుంచి 1970 దాకా రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 1972లో ఆయన కరీం నగర్ జిల్లా ఇందుర్తి నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. భూస్వాములు పేదలపై రుణభారం మోపి పీడించడం సహించలేని బద్దం ఎల్లా రెడ్డి ఆ రుణపత్రాలన్నింటినీ బహిరంగంగా కాల్చేసి తన ధిక్కార స్వభావాన్ని చాటుకున్నారు. కడదాకా కమ్యూనిస్టు బాట వీడని అగ్ని కణం బద్దం ఎల్లారెడ్డి.

-భరద్వాజ





పోరుబాట

20వేలమందిని బలిగొన్న

సంతాల్ పోరు

ఈస్టిండియా కంపెనీ, జమిందారుల దోపిడీ, అణచివేతలకు నిరసనగా 1855 జూన్ 30 నుంచి 1856 జనవరి 3 వరకు సంతాల్ గిరిజనులు సాయుధ తిరుగుబాటు జరిపారు. అడవిబిడ్డలు తమ హక్కులసాధన, జీవనోపాధి, మాతృభూమి సంరక్షణ యూరోపియన్ కాంట్రాక్టర్ల నిర్బంధవిధానం ఈ తిరుగుబాటుకు కారణమైంది. ప్రస్తుతం జార్ఖండ్ ప్రాంతం సంతాల్ తెగ గిరిజనులు అతి పెద్ద తెగ. అస్సాం, బీహార్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో వీరు కనిపిస్తారు. బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్‌లలో సైతం ఈ తెగ గిరిజనులు కనిపిస్తారు. ఆఫ్రో, ఏషియన్ తెగకు చెందిన సంతాలీ, ముండా భాషలను వీరు మాట్లాడతారు. వీరు ముందుగా వేటగాళ్లు. కాని తరువాతి కాలంలో వ్యవసాయజీవన విధానానికి అలవాటు పడ్డారు. వీరు అత్యధికభాగం అడవులపై ఆధారపడి జీవనం సాగిస్తారు. ప్రశాంత జీవనం సాగిస్తూ అడవితల్లిని నమ్ముకుని జీవిస్తున్న సంతాల్‌లకు ఆంగ్లేయులు తీసుకువచ్చిన కొత్త శాశ్వత భూమి పరిష్కార చట్టం తిరుగుబాటుకు దారి తీసింది.



సిద్దూముర్ము, కన్హూ ముర్ము, చాంద్ ముర్ము, బైర్‌వముర్ము అనే నలుగురు సోదరులు, ఫైలో, ఫూనో అనే సోదరీ మణులు ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. బ్రిటీష్ అధికారాన్ని ధిక్కరించి స్వంత చట్టాలను ఏర్పరచుకుని, గిరిజనులను వారి స్వంత భూముల నుండి తొలగించి వేలం ద్వారా వీరి భూములను జమిందారులకు బదలాయించే బ్రిటీష్ చట్టాలను తిరస్కరిస్తూ వీరు తిరుగబాటు బావుటా ఎగరవేశారు. అటవీ వనరులను తాము వినియోగించుకునే హక్కుకు విఘాతం కల్పించిన బ్రిటీష్ పాలన, జమిందారీ విధానాలను వీరు తీవ్రంగా ప్రతిఘటించారు. 1855 జులై 7న భోగనాడిహ్ గ్రామంలో వేలాదిమంది సంతలు సమావేశమయ్యారు. తమనుతాము స్వేచ్ఛా జీవులుగా ప్రకటించుకున్నారు. ఈస్టిండియా కంపెనీ జమిందారుల స్వాధీనంలోని తమ భూములను విడిపించుకోవాలని ప్రతిజ్ఞ పూనారు. సంతాల్‌ను బెదిరించి లొంగదీయాలని వచ్చిన పోలీస్ అధికారిని హత్యచేయడం జరిగింది. దీనితో పెద్ద ఎత్తున ఘర్షణలు జరిగాయి. బ్రిటీష్ జమిందార్లపైన తిరుగుబాట్లు ఉధృతమయ్యాయి.. జార్ఖండ్ నుంచి బెంగాల్‌వరకు అడవులు విముక్తి జరిగిందని ప్రకటించారు. దీనితో బ్రిటిష్ ప్రభుత్వం పెద్ద ఎత్తున సైన్యం, పోలీసులను సంతాల్‌పై ప్రయోగించింది. యుద్ధ తంత్రం తెలియని సాంప్రదాయక విల్లంబులనే ఆయుధాలుగా వినియోగించిన సంతాల్‌లు అపార ప్రాణనష్టాన్ని చవిచూశారు. సంతాల్‌లు నిలబడి యుద్ధరంగంలో బాణాలను ప్రయోగిస్తుంటే సైనికులు వారిపై కాల్పులకు తెగబడ్డారు. ఈ తిరుగుబాటులో సుమారు 20,000 మందికిపైగా సంతాల్ గిరిజన రైతులుప్రాణాలు కోల్పోయారు. వందలాదిగా బ్రిటీష్‌అధికారులు, జమిందారులు కూడా ఈ పోరాటంలో అశువులు బాసారు. తిరుగుబాటుకు ప్రధాన నేతృత్వం వహించిన సిద్ధూ,కన్హూలు కూడా వీరమరణం పొందారు. భూమికోసం, భుక్తికోసం, మాతృభూమి విముక్తి కోసం సంతాల్‌లు జరిపిన పోరాటం 1856 జనవరి 3న బ్రిటీష్ ప్రభుత్వం మార్షల్‌లా ఎత్తి వేయడంతో ముగిసింది.

జార్ఖండ్ సంతాల్‌లలో 54 శాతం మంది హిందువులు. వీరి పల్లకీలు ప్రసిద్ధి. ఇంటిగోడలు జంతువుల నమూనాలతో వేట దృశ్యాలతో, పలురకాల చిత్రాలతో, రేఖా గణితాలతో అలరించి ఉంటాయి. ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం జరిగిన 1957కు రెండు సంవత్సరాలకు ముందే సంతాల్ రైతులు బ్రిటీష్‌ల అధికారాన్ని ధిక్కరించి తిరుగుబాటు జరిపారు. చరిత్రలో వీరి సాహసం, ధైర్యం సువర్ణాక్షరాలతో లిఖించాలి.

- చలసాని వెంకట రామారావు

27 ఏళ్లకే ఎంపీ అయిన

కానేటి మోహన రావు

కానేటి మోహన రావు

కానేటి మోహన రావు (1917-2014) తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారే అయినప్పటికీ నిజాం పరిపాలనను వ్యతిరేకించినందుకు 1942 నుండి 1945 మధ్య రాజోలు, అమలాపురం, రాజమండ్రి, రామచంద్రాపురం, ఏలూరులలో కఠిన కారాగార శిక్షను అనుభవించారు. కడలూరు జైలులో ఇతనితో పాటు నీలం సంజీవరెడ్డి కూడా ఉన్నారు.

1952లో రాజమండ్రి లోకసభ ద్విసభ్య నియోజకవర్గం నుండి మొదటి లోకసభకు కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. పార్లమెంటు ఏర్పడి 60 సంవత్సరాలైన సందర్భంగా 2012లో ఉత్సవాలు నిర్వహించినప్పుడు అప్పటికి బతికి ఉన్న మొదటి పార్లమెంటు సభ్యులను కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. కానీ కానేటి మోహన రావు ఆ రోజుకు సజీవంగా ఉన్నాడని తెలియనందువల్ల ఆయనకు ఏ ఆహ్వానమూ అందలేదు. ఒక దినపత్రికలో ఆయన ఇంకా సజీవులేనని వార్త వస్తే హడావుడిగా ఆయనను ఢిల్లీ తీసుకెళ్లి సన్మానించారు.

అప్పటికి మోహనరావుకు 87 ఏళ్లు. "మొదటి లోకసభ సభ్యుల్లో ఎవరు సజీవంగా ఉన్నారో, ఎవరెక్కడో తెలియక అధికారులు తికమక పడ్డారు. చివరకు నాకు ఆహ్వానం అందినందుకు సంతోషం" అన్నారు అప్పట్లో మోహన రావు. అప్పుడాయన తూర్పు గోదావరి జిల్లా తాళ్లరేవు దగ్గర్లోని మట్ల పాలెం గ్రామంలో ఉండేవారు. మొదటి లోకసభ సభ్యుడయ్యే నాటికి ఆయనకు 27 ఏళ్లే. అప్పుడు అందరికన్నా చిన్నవాడాయనే. అప్పుడు రాజమండ్రి ద్విసభ్య నియోజకవర్గం. జనరల్ సీటు నుంచి పోటీ చేసిన దుర్గాబాయి దేశ్ ముఖ్ సోషలిస్టు అయిన నల్లారెడ్డి చేతిలో ఓడిపోయారు. కానేటి మోహన రావు కాంగ్రెస్ అభ్యర్థి పి.గోపాల కృష్ణను ఓడించారు.

అంబేద్కర్‌తో కలిసి పార్లమెంటులో కూర్చోగలిగినందుకు చాలా సంతోషపడేవారు మోహన రావు. "పార్లమెంటు సెంట్రల్ హాలులో కలిసి టీ తాగుతూ అనేక విషయాలు చర్చించుకునే వాళ్లం" అని మోహనరావు ఎంతో ఉత్సాహంగా చెప్పేవారు. 60 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భం గా సన్మానించడానికి ఢిల్లీ వెళ్లేదాకా ఆయన నెలకు రూ. 1400 పింఛన్ తోనే కాలం గడిపే వారు. ఆ పింఛన్ 2009లోనే 20,000కు పెరిగిన విషయమూ మోహన రావుకు తెలియదు. మొదటి లోకసభ సభ్యులుగా ఉండి పార్లమెంటు 60 ఏళ్ల ఉత్సవం జరిగే నాటికి నలుగురే సజీవంగా ఉన్నారు. మణిపూర్ కు చెందిన రిషాంగ్ కీషింగ్, మహారాష్ట్రకు చెందిన రేషం లాల్ జంగ్డే తో సహా మోహన రావుతో కలిసి సత్కారం అందుకున్న నాలుగో వ్యక్తి కూడా తెలుగువాడే. ఆయన కందాళ సుబ్రహ్మణ్య తిలక్. సన్మానం నాటికే ఆయనకు 92 ఏళ్లు. ఆయన విజయనగరం లోకసభ స్థానం నుంచి ఎన్నికయ్యారు.

-అనన్య వర్మ

చట్ట సభల మేటి

ఉత్తేజపర్చిన పెషావరు కుట్ర కేసు

భారతదేశ స్వాతంత్ర్య పోరాటం నుండి భారత కమ్యూనిస్టు పార్టీని వేరుచేసి క్రమంగా నిర్వీర్యం చేయాలన్న దుష్ట ఆలోచనతో బ్రిటీష్ ప్రభుత్వం కమ్యూనిస్టులపై కుట్ర కేసులు బనాయించింది. అప్పటికే కమ్యూనిస్టుల ప్రభావం వ్యాపిస్తున్న నేపథ్యంలో అక్రమంగా కమ్యూనిస్టులపై పెట్టిన కేసులు దేశ ప్రజలపైన పార్టీ పట్ల మరింత అభిమానాన్ని పెంచాయి. బ్రిటీషు వలస పాలకులు పెట్టిన కేసులలో పెషావరు కుట్ర కేసు ఒకటి. 1922-24 మధ్య కాలంలో ఈ కేసును బ్రిటీషు ప్రభుత్వం నాలుగు దఫాలుగా విచారణ జరిపింది. ప్రథమ ప్రపంచ యుద్ధ కాలంలో మన దేశంలో జరిగిన ఖిలాఫత్ ఉద్యమం, యుద్ధం ముగిసిన తర్వాత ప్రజ్వరిల్లింది హజరత్ ఉద్యమంలో పాల్గొన్న వందలాది మంది ముస్లిం యువకులు సాయుధ పోరాటం ద్వారా బ్రిటీషు పాలకులను వెళ్లగొట్టవచ్చునని యోచించారు. 'ముహిజరీన్‌లుగా' పేరు పొందిన వీరు ముందుగా టర్కీకి రహస్యంగా బయలుదేరారు. టర్కీ ప్రభుత్వం అనుమతించక పోవడంతో అప్పటికే సోషలిస్టు వ్యవస్థను నెలకొల్పిన సోవియట్ రిపబ్లిక్ వెళ్లారని, అక్కడే కమ్యూనిస్టులుగా మారారని, బ్రిటీషు ప్రభుత్వాన్ని కూల్చి వేయడానికి తాష్కెంట్, సమర్కండ్‌లలో కుట్రలు పన్నారని అభియోగాలు మోపి తప్పుడు కేసులు బనాయించారు. ముహిజరీన్‌లు భారతదేశానికి తిరిగి రాగానే అందరినీ పెషావర్‌లో అరెస్టు చేసి కోర్టులో విచారణ తంతు ముగించి శిక్షలు విధించారు.

భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించి ప్రసిద్ధి చెందిన షౌకత్ ఉస్మానీతో పాటు భోపాల్‌కు చెందిన రఫిక్ అహమ్మద్, పంజాబ్ నుండి ఇలాహికుర్బాన్, పెషావరు నివాసి అక్బర్‌షాలకు కోర్టు శిక్షలు విధించింది. బోల్షివిక్ సైన్యం భారతదేశంపై దాడిచేసి వలస పాలకులను వెళ్లగొట్టనున్నారన్న ఆరోపణలను ప్రచారంలో పెట్టారు. ఇందు కోసమే ముహిజరీన్‌లకు కమ్యూనిస్టు భావజాలంపై శిక్షణ, సైనిక తర్ఫీదు ఇచ్చారన్న ఆరోపణలూ చేసి కుట్ర కేసును నమోదు చేశారు. నాయకత్వం వహించిన గాంధీజీ తదితర నాయకులు ఇది బ్రిటీషు పాలకులు సాగించిన అబద్ధపు ప్రచారమని నిరసన తెలిపారు. ఈ కేసు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కఠిన శిక్షలు విధించినప్పటికీ విప్లవకారులు తమ పోరాటం కొనసాగించారు. కుట్ర కేసులో శిక్షలు అనుభవించిన తర్వాత షౌకత్ ఉస్మా, తదితరులు అనేక మంది కమ్యూనిస్టు పార్టీలో, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు.



- టి.వి. సుబ్బయ్య

సీబీఐకి మహాజన్‌పై అవినీతి కేసు

న్యూఢిల్లీ: మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహారాజ్‌పై అవినీతి ఆరోపణల మీద దర్యాప్తు బాధ్యతలను సీబీఐ చేపట్టినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. మహాజన్‌పై సీబీఐ దర్యాప్తు జరిపించాలని ఉప ముఖ్యమంత్రి దేవంద్ర ఫడ్నవీస్ నేతృత్వ మహారాష్ట్ర హోంశాఖ జులై 22న సిఫార్సు చేసింది. సెప్టెంబరు 2న డీఓపీటీ శాఖ ఈ మేరకు చర్యలను చేపట్టింది. జలగావ్‌కు చెందిన విద్యాసంస్థ ట్రస్ట్ డైరెక్టర్ చేసిన ఆరోపణల క్రమంలో గిరీశ్ మహాజన్‌పై ఎఫ్ఐఆర్‌ను సీబీఐ మరోమారు నమోదు చేసింది. పూనే పోలీసుల నుంచి కేసు బాధ్యతలను తీసుకుందని అధికారులు తెలిపారు.

బురఖా ధరించలేదని భార్యను హతమార్చిన భర్త

ముంబై: బురఖా ధరించడానికి నిరాకరించిన భార్యను కట్టుకున్న భర్తే కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన ముంబైలో వెలుగు చూసింది. ముంబైలో టాక్సీ డ్రైవరుగా పని చేస్తున్న ఇక్బాల్ షేక్ అనే వ్యక్తి తన భార్య రూపాలీ(జరా)ని బురఖా ధరించాలని ఒత్తిడి చేస్తూ నిత్యం గొడవపడుతున్నాడు. హిందూ మతానికి చెందిన మహిళ కావడంతోనే రూపాలీ బురఖా ధరించడానికి నిరాకరించగా తమ మతాచారాలను పాటించాలని భర్త ఆమెను నిత్యం వేధింపులకు గురిచేసినట్టు కేసు విచారిస్తోన్న ఎస్సై విలాస్ రాథోడ్ తెలిపారు. ఆ వేధింపులు భరించలేక భర్తకు దూరంగా ఉంటున్న రూపాలీని సోమవారం రాత్రి విడాకుల విషయంపై చర్చలకు పిలిచిన నిందితుడు... పిల్లల పెంపకంపై ఆమెతో గొడవపడినట్టు తెలిపారు. కోపంతో భార్యపై కత్తితో దాడి చేయగా ఆమె అక్కడికక్కడే మరణించినట్టు బాధితురాలి కుటుంబం ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. 2019లో ఇక్బాల్ షేక్ పెళ్లి చేసుకున్న రూపాలీ భర్త కోసం తన పేరును జరాగా మార్చుకుందని, వారికి కుమారుడు ఉన్నట్టు తెలిపారు. నిందితుడిపై ఐపీసీ 302 (హత్య) నేరం కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు తెలిపారు.

సీబీఐ జేడీల పదవీకాలం పొడిగింపు

న్యూఢిల్లీ: సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) విభాగంలో జాయింట్ డైరెక్టర్లుగా పనిచేస్తోన్న రాకేశ్ అగర్వాల్, సంపత్ మీనా పదవీకాలాన్ని పొడిగిస్తూ క్యాబి నెట్ నియామకాల కమిటీ నిర్ణయం తీసుకుంది ఈ మేరకు కేంద్ర సిబ్బంది మంత్రిత్వ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. హిమాచల్‌ప్రదేశ్ ఐపీఎస్ కేడర్‌కు చెందిన రాకేశ్ అగర్వాల్ పదవిని మరో ఆరు నెలల పాటు, జార్ఖండ్ కేడర్‌కు చెందిన ఐపీసీ అధికారి సంపత్ మీనా పదవీకాలాన్ని 2024 సెప్టెంబర్ 21 వరకు పొడిగించారు.

బీజేపీకి కాంగ్రెస్ మద్దతు

విశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ మాన్ విమర్శ

గురువారానికి సభ వాయిదా

చండీగఢ్: పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మంగళవారం అసెంబ్లీలో విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. విశ్వాస తీర్మానాన్ని మాన్ ప్రవేశపెట్టడానికి ముందే బీజేపీ ఎమ్మెల్యేలు అశ్వినీశర్మ, జంగీలాల్ మమజన్ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. కాంగ్రెస్ సభ్యులు నిరసనకు దిగారు. గందరగోళం మధ్య సభ రెండుసార్లు వాయిదా పడింది. చివరకు గురువారం దీనిపై చర్చ జరుగుతుందని స్పీకర్ వెల్లడించారు. అంతకుముందు బీజేపీ ఆపరేషన్ కమలానికి కాంగ్రెస్ మద్దతిస్తోందని మాన్ ఆరోపించారు. సభలో చర్చ నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు పారిపోయారని ఎద్దేవా చేశారు. రాజస్థాన్‌లో రాజకీయ పరిణామాలను మాన్ ప్రస్తావించారు. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌కు విశ్వసనీయులైన ఎమ్మెల్యేలు ఆ పార్టీ కేంద్ర పరిశీలకులను కలవలేదన్నారు. పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితుల్లో కాంగ్రెస్ ఉన్నదన్నారు. అన్నిచోట్ల తాము మాత్రమే అధికారంలో ఉండాలని కాషాయ పార్టీ భావిస్తోందన్నారు. పంజాబ్‌లోని మూడుకోట్ల మందికి ఆప్‌పై నమ్మకం ఉందని, తన 91 మంది సైనికుల(ఆప్ ఎమ్మెల్యేలు)పై తనకు పూర్తి విశ్వాసం ఉందని మాన్ అన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు ఇద్దరు వాకౌట్ చేసిన తర్వాత సభకు అంతరాయం కలిగిస్తున్నారంటూ కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల పేర్లను స్పీకర్ వెల్లడించారు. ఈ క్రమంలో రెండుసార్లు పది నిమిషాల పాటు సభ వాయిదా పడింది. రెండవసారి తిరిగి సమావేశమైనప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీని విడిచి వెళ్లలేదు. దీంతో స్పీకర్ మార్షల్లను పురమాయించారు. మొత్తం సెషన్‌కు రావద్దని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు స్పీకర్ సూచించారు. విపక్షాల తరపున ఎస్ఏడీ ఎమ్మెల్యేలతో పాటు బీఎస్పీ ఎమ్మెల్యే, స్వతంత్ర ఎమ్మెల్యే మాత్రమే సభలో ఉన్నారు. బీజేపీకి బీ-టీమ్‌లా కాంగ్రెస్ ఉందని ఆప్ మంత్రి అమన్ అరోరా విమర్శించారు. విశ్వాస తీర్మానంపై చర్చలో మాన్, అరోరా మాట్లాడిన తర్వాత సభను గురువారానికి స్పీకర్ వాయిదా వేశారు. అదేరోజు విశ్వాస తీర్మానంపై చర్చ నిర్వహిస్తారన్నారు. అంతకుముందు కాంగ్రెస్ శాసనసభపక్ష నేత ప్రతాప్ సింగ్ బాజ్వా మాట్లాడారు. విశ్వాస తీర్మానాన్ని పాలకపక్షం ప్రవేశపెట్టవచ్చు అని పంజాబ్ విధానసభ నిబంధనావళిలో ఎక్కడా లేదని అన్నారు. బిజినెస్ సలహా కమిటీ సమావేశమప్పుడు విశ్వాస తీర్మానంపై ప్రశ్నించగా ఎలాంటి సమాధానం లభించలేదని ఆయన స్పీకర్‌కు తెలిపారు. దీనిని బట్టి రాజ్యాంగబద్ధ అధినేతకు గౌరవం ఇవ్వడం లేదని అర్థమవుతోందన్నారు. జీరో అవర్‌లో కొన్ని అంశాలపై ప్రశ్నలను కాంగ్రెస్ సభ్యులు లేవనెత్తారు. మాన్, అరోరా మాట్లాడేం దుకు ప్రయత్నించగా కాంగ్రెస్ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో స్పీకర్ వారిని మందలించారు. నినాదాలు చేయొద్దు, వెల్‌లోకి వెళ్లవద్దని సూచించారు. ముందు మీ ఇల్లు చక్కబెట్టుకోండి ఆ తర్వాత మాకు చట్టాలు నేర్పండి అంటూ కాంగ్రెస్ సభ్యులనుద్దేశించి మాన్ విమర్శించారు. రాజస్థాన్, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల్లో సొంత సభలను సక్రమంగా నిర్వహించలేకపోయారని దుయ్యబట్టారు. ఇక్కడా ఏ విషయంపైనా మాట్లాడనివ్వడం లేదు, సభ ఎక్కువ సేపు జరగాలని మాత్రం బయట డిమాండు చేస్తారు. అంతే అర్థమేమిటి బాజ్వా.. ఆపరేషన్ కమలం విఫలం కావడంతో మీకు నష్టం జరిగినదా! అని మాన్ ఎద్దేవా చేశారు. కాగా, ఈనెల 22న ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించాలని మాన్ భావించారు. రూ.25 కోట్లకు తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనేయాలని బీజేపీ ఆరేషన్ కమలానికి పూనుకోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించా లనుకున్నారు. కానీ గవర్నర్ అందుకు అనుమతులను 21వ తేదీన ఉపసంహరించుకున్నారు. అనంతరం సభలో విద్యుత్ సరఫరా, పంట వ్యర్థాలపై చట్ట, జీఎస్టీపై చర్చిస్తామని ప్రభుత్వం చెప్పడంతో మంగళవారం సభ నిర్వహణకు గవర్నర్ ఒప్పుకున్నారు. సభలో మొత్తం 117 మంది సభ్యులు ఉండగా వీరిలో 92 మంది ఆప్ ఎమ్మెల్యేలు కాగా 18 మంది కాంగ్రెస్, ముగ్గురు ఎస్ఏడీ, ఇద్దరు బీజేపీ, ఒకరు బీఎస్పీ, ఒకరు స్వతంత్ర్య ఎమ్మెల్యే ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర

రాజస్థాన్ మంత్రి ప్రతాప్ సింగ్ కచారియవాస్

జైపూర్: రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ మళ్లీ కుట్ర పన్నుతోందని రాష్ట్ర మంత్రి ప్రతాప్ సింగ్ కచారియవాస్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రాజకీయ సంక్షోభంపై ఆయన స్పందించారు. కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్ పేరును మరొక మంత్రి రాజేంద్ర సింగ్ గూడా ప్రతిపాదించారు. 'ఈడీ, ఐటీ, సీబీఐ అధికారులంతా రాజస్థాన్‌లో తిష్టవేశారు. బీజేపీ ఆట మొదలైంది. రాజస్థాన్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ వ్యూహాలు రచిస్తోంది' అని మంగళవారం విలేకరులతో మాట్లాడిన ప్రతాప్ సింగ్ అన్నారు. రాష్ట్ర తాజా రాజకీయ పరిస్థితులపై కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునేదే తుది నిర్ణయమని, దానికి అంతా కట్టుబడతామని చెప్పారు. సీఎల్పీ సమావేశానికి ముందు గెహ్లాట్‌కు నమ్మకస్తులైన ఎమ్మెల్యేలు అనేకమంది రాజీనామాలు సమర్పించారు. పైలెట్‌ను ముఖ్యమంత్రిగా ప్రతిపాదించడాన్ని వ్యతిరేకించారు. ఈ పరిణామంతో ఆందోళనకుగురైన అధినేత్రి సోనియాగాంధీ వెంటనే రాతపూర్వకంగా నివేదికను సమర్పించాలని పార్టీ పరిశీలకులు మల్లికార్జున ఖర్గే, అజయ్ మాకేన్‌లకు సోమవారం సూచించారు. మరోవైపు పార్టీ అధ్యక్షుడిగా గెహ్లాట్‌కు అవకాశాలు సన్నగిల్లి కొత్త పేర్లు తెరపైకి రావడం చర్చకు దారితీసింది. ఎమ్మెల్యేల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రతాప్ సింగ్ కచారియవాస్ అన్నారు. పార్టీ అధిష్ఠానంపై తమకు పూర్తి నమ్మకం ఉన్నదని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సోనియాగాంధీని తల్లితో సమానంగా చూస్తారని, అమ్మ ఎప్పుడూ బిడ్డకు అన్యాయం చేయదని ఆయనన్నారు. సీఎల్పీ సమావేశానికి హాజరు కాకుండా గెహ్లాట్ నమ్మకస్తులు వేరుగా సమావేశం ఎందుకయ్యారన్న విలేకరుల ప్రశ్నకు '2020లో గెహ్లాట్‌పై తిరుగుబాటు చేసిన 19 మందిలో ఒకరు ముఖ్యమంత్రి కావడం వారికి నచ్చలేదు. అందుకే అసెంబ్లీ స్పీకర్ సీపీ జోషికి రాజీనామాలు సమర్పించారు. ఇప్పటికి కూడా మా ఇంచార్జి, అధిష్టానం, గెహ్లాట్ ఏమి నిర్ణయిస్తే దానిని అంగీకరిస్తాం' అని కచారియవాస్ బదులిచ్చారు.

మళ్లీ అఖిలేశ్‌కే ఎస్పీ పగ్గాలు

29న పార్టీ జాతీయ సదస్సులో ఎన్నిక

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్ష పదవిని వరుసగా మూడవ సారి అఖిలేశ్ యాదవ్ చేపట్టనున్నారు. ఈనెల 29న జరగబోయే పార్టీ జాతీయ సదస్సు క్రమంలో అధ్యక్షుడి ఎన్నిక జరగనుంది. 2024లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన ఎన్నికకు ప్రాధాన్యత ఏర్పడింది. బుధవారం రాష్ట్ర సదస్సు నిర్వహించి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకోవాలని ఎస్పీ నిర్ణయించినట్లు ఎస్పీ ప్రధాన అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి మంగళవారం తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికలు, త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల ప్రణాళికలనూ సమావేశం చర్చించనుంది. ఉత్తరప్రదేశ్‌లో ప్రతి ఎన్నికతో మరింత బలపడుతున్న అధికార బీజేపీని ఏ విధంగా ఎదుర్కోవాలన్న విషయంలోనూ చర్చలు జరగనున్నట్లు ఎస్పీ వర్గాలు వెల్లడించాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో; 2017-2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని సమాజ్‌వాదీ పార్టీ చవిచూసింది. ఈ క్రమంలో నేర్చుకున్న పాఠాలతో 2024 లోక్‌సభ ఎన్నికల్లో అధికారంలోకి రావాలని భావిస్తోంది. ఇందుకోసం పార్టీని బలోపేతం చేసుకుంటోంది. రమాబాయి అంబేద్కర్ ర్యాలీ స్థలిలో నిర్వహించే జాతీయ-రాష్ట్ర స్థాయి పార్టీ సదస్సుల్లో 25వేల మంది ప్రతినిధులు పాల్గొనున్నట్లు చౌదరి తెలిపారు.

వైద్యవిద్య మెరుగుదల పేరిట కాంగ్రెస్ లూటీ : అమిత్ షా

అహ్మదాబాద్: దేశంలో వైద్య విద్యను, మౌలిక వసతులను మెరుగుపరుస్తామన్న నెపంతో కాంగ్రెస్ నేతలు 2014కి ముందు లూటీ చేశారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మంగళవారం ఆరోపించారు. గుజరాత్ పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం గాంధీనగర్ జిల్లాలోని కలోల్ పట్టణంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. కాంగ్రెస్ గతపాలనపై విమర్శలు చేశారు. వైద్యులే లేని ఆసుపత్రులు ఎందుకంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో ఆ పార్టీ నేతలు డబ్బులు దండుకున్నారేగానీ వైద్యవిద్యను మెరుగుపర్చలేదన్నారు. 2013-14లో దేశంలో 387 వైద్య కళాశాలలు (ప్రభుత్వ-ప్రైవేటు కలిపి) ఉంటే మోదీ హయాంలో సంఖ్య 600కు పెరిగిందన్నారు. ఇప్పటికే పది ఎయిమ్స్ అందుబాటులోకి రాగా మరో 22 తర్వలోనే రాబోతున్నాయని చెప్పారు. ఆయుష్మాన్ భారత్‌ను శ్లాఘించారు. అమిత్‌షా అనంతరం గాంధీనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. కలోల్‌లో 150 పడకల ఈఎస్ఐఎస్ ఆసుపత్రికి, ఓ ట్రస్టు ద్వారా నిర్వహించే 750 పడకల ఆసుపత్రికి శంకుస్థాపనలు చేశారు. సెక్టార్ 15 అండర్‌పాస్‌ను గాంధీనగర్‌లో ప్రారంభించారు. లెకావడ గ్రామంలోని గుజరాత్ టెక్నోలాజికల్ యూనివర్సిటీ కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. నవరాత్రి సందర్భంగా బహుచర్ మాత ఆలయంలో 'ఆర్తీ'కీ ఆయన హాజరయ్యారు. ఈ ఆలయం అమిత్‌షా స్వస్థలమైన గాంధీ నగర్‌లోని మాన్సా పట్టణంలో ఉంది.

నవలఖ గృహ నిర్బంధంపై వివరణ ఇవ్వండి

ఎన్ఐఏ, మహారాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : ఎల్గార్-పరిషత్ కేసులో కార్యకర్త గౌతం నవలఖను జ్యుడిషియల్ కస్టడీకి బదులుగా గృహ నిర్బంధంలో ఉంచాలన్న విషయమై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)తో పాటు మహారాష్ట్ర ప్రభుత్వం వివరణను కోరుతూ సుప్రీంకోర్టు మంగళవారం నోటీసులు జారీ చేసింది. నవలఖ ప్రస్తుతం ముంబై సమీపంలోని తలోజా జైలులో ఉన్నారు. అయితే జైలులో సరైన వైద్య, ఇతర కనీస సదుపాయాలు లేని కార ణంగా తనను గృహ నిర్బంధంలో ఉంచేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను బాంబే హైకోర్టు తిరస్కరిస్తూ ఏప్రిల్ 26న ఉత్తర్వులు జారీ చేసింది. బాంబే హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టులో 70ఏళ్ల నవలఖ సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ కేఎం జోసఫ్, జస్టిస్ రిషికేశ్ రాయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. మీ వైఖరి తెలపండి అంటూ ఎన్ఐఏ, మహారాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణను 29వ తేదీకి వాయిదా వేసింది. అంతకుముందు నవలఖ తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. కార్యకర్త విజ్ఞప్తి మేరకు గతేడాది మేలో సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసిన ఉత్తర్వుల ఆధారంగా హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. తీవ్ర అనారోగ్యం కారణంగా గృహ నిర్బంధనానికి అనుమతి ఇవ్వాలని నవలఖ కోరారు. తనకు నేర చరిత్ర లేదని, గతంలోనూ గృహ నిర్బంధంలో ఉన్నట్లు నవలఖ తరపు న్యాయవాదులు తెలిపారు. తనకు కుర్చీ, ఓ జత చెప్పులు, కళ్లజోడు, పీజీ వోడేహౌస్ పుస్తకాన్ని ఇచ్చేందుకు జైలు సూపరింటెండెంట్ నిరాకరించినట్లు నవలఖ వాపోయారు. నవలఖ ఫిర్యాదు తగినది కాదని ఆయన విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించింది. 82 ఏళ్ల వరవరరావుకు సర్వోన్నత న్యాయస్థానం బెయిల్ ఇవ్వడం తెలిసిందే.

శరవేగంగా 'దసరా' చిత్రీకరణ

హైదరాబాద్: ఫలితం ఎలా ఉన్నా ప్రేక్షకులకు కొత్త కథలను చూపించాలకునే అతికొద్ది మంది నటులలో నాని ఒకరు. నాని ప్రస్తుతం ఒక మంచి హిట్టు కోసం ఎదురు చూస్తున్నాడు. నాని 'దసరా' చిత్రంతో గతంలో ఎన్నడు చేయలేని అవుట్ అండ్ అవుట్ యాక్షన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఈ చిత్రంతో ఎలాగైనా మాస్ ఫాలోయింగ్‌ను ఏర్పరుచుకోవాలని గట్టి ప్రయత్నాలే చేస్తున్నాడు. శ్రీకాంత్ ఓదెలా దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన పోస్టర్, గ్లింప్స్ సినిమాపై విపరీతమైన అంచనాలు క్రియేట్ చేశాయి. ఇదిలా ఉంటే ఈ చిత్రానికి సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ త్వరలోనే రాబోతున్నట్లు తెలుస్తుంది. ఈ సాంగ్ తెలంగాణ యాసలో ఉండే జానపద పాట అని టాక్. దీనిపై త్వరలోనే అధికారికంగా ప్రకటన రానుంది. సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా కీర్తి సురేష్ నటిస్తోంది. ఈ చిత్రంలో నాని, కీర్తి డీ గ్లామర్ పాత్రల్లో కనిపించనున్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంతోష్ నారాయణ్ సంగీతం అందిస్తున్నారు.

7న ఓటీటీలో బింబిసార

హైదరాబాద్: నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా 'బింబిసార' సినిమా తెరకెక్కింది. ఆయన సొంత బ్యానర్లో నిర్మితమైన ఈ సినిమాకి శ్రీ వశిష్ఠ దర్శకత్వం వహించాడు. ఆగస్టు 5వ తేదీన విడుదలైన ఈ సినిమా, అనూహ్యమైన విజయాన్ని అందుకుంది. కల్యాణ్ రామ్ కెరియర్లోనే ఈ సినిమా అత్యధిక వసూళ్లను రాబట్టింది. చారిత్రక నేపథ్యం, టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ ఈ సినిమాను కొత్తగా ఆవిష్కరించాయి. విభిన్న కథాకథనాలు, బలమైన ఎమోషన్ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యాయి. కీరవాణి అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకి అదనపు బలంగా నిలిచింది. ఇటీవలే ఈ సినిమా 50 రోజులను పూర్తి చేసుకుంది. దాంతో ఈ సినిమాను ఓటీటీలో చూడటానికి అంతా ఆసక్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమాను జీ 5 వారు అక్టోబర్ 7వ తేదీ నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ విషయంపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని అంటున్నారు.

'పొన్నియిన్ సెల్వన్'కు మెగా వాయిస్

హైదరాబాద్: మణిరత్నం దర్శకత్వంలో 'పొన్నియిన్ సెల్వన్' సినిమా రూపొందింది. లైకా ప్రొడక్షన్స్ వారు నిర్మించిన ఈ సినిమాలో, విక్రమ్, కార్తి , జయం రవి, శరత్ కుమార్, పార్తీబన్,ఐశ్వర్య రాయ్, త్రిష, ఐశ్వర్య లక్ష్మి ప్రధాన పాత్రలను పోషించారు. ఏఆర్ రెహ్మాన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాను, ఈ నెల 30వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ సినిమా విషయంలో చిరంజీవికి థ్యాంక్స్ చెప్పాలని మణిరత్నం ఒక సందర్భంలో అన్నారు. దాంతో ఈ సినిమాకి చిరూ వాయిస్ ఓవర్ చెప్పి ఉంటారని చాలామంది అనుకున్నారు... అది నిజమేననేది తాజా సమాచారం. తెలుగు వెర్షన్ కి సంబంధించి కథలోకి వెళ్లడానికి ముందు, ఆ తరువాత కొన్ని సన్నివేశాలను కలిపే సందర్భంలోను చిరంజీవి వాయిస్ ఓవర్ చెప్పినట్టుగా సమాచారం. ఇక తమిళంలో కమల్ తోను, కన్నడలో ఉపేంద్రతోను, మలయాళంలో మమ్ముట్టితోను, హిందీలో అజయ్ దేవగణ్ తోను వాయిస్ ఓవర్ చెప్పించారట. పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ అవుతున్న ఈ సినిమా, రికార్డు స్థాయి ఓపెనింగ్స్ ను రాబట్టడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సౌత్ నుంచి మరో సంచలనాన్ని ఈ సినిమా నమోదు చేస్తుందేమో చూడాలి.

గాడ్ ఫాదర్ నుంచి మరో పాట

హైదరాబాద్: వరుస సినిమాలను లైనప్ చేసిన మెగాస్టార్ చిరంజీవి... ఆయా చిత్రీకరణలతో తీరిక లేకుండా ఉన్నారు. ఈ క్రమంలో ముందు గాడ్ ఫాదర్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మలయాళ సూపర్ హిట్ లూసిఫర్ సినిమాకు రీమేక్ గా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. తాజాగా ఈ సినిమానుంచి మరో పాటను మంగళవారం విడుదల చేశారు. నజభజ అంటూ సాగే ఈ పాట అదిరిపోయిందనే చెప్పాలి. సినిమా విడుదల కంటే ముందే.. తన బాసిజాన్ని.. తన క్రేజ్‌ను మరో సారి అందరికీ దిమ్మతిరిగేలా రేంజ్‌లో చూపించబోతున్నారు మెగాస్టార్. అనంతపురాన్ని తన అడ్డాగా మార్చుకుని.. గాడ్ ఫాదర్ పేరును మారుమోగించనున్నారు. గాడ్ ఫాదర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను సెప్టెంబర్ 28న అనంతపూర్‌లో నిర్వహించనున్నారు. ఇక ఇప్పటికే అనంతపులోని గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాట్లు కూడా మొదలెట్టేశారు. గాడ్ ఫాదర్ సినిమాలో బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. అలాగే మెగాస్టార్, సల్మాన్ కలిసి ఒక పాటల్లోనూ స్టెప్పులేసి అలరించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పోస్టర్లు , టీజర్ సినిమా పై అంచనాలను పెంచేసాయి. ఇక థక్కర్ మార్ సాంగ్ ప్రేక్షకులను ఉర్రుతలూగించింది. ఎన్వీ ప్రసాద్, ఆర్ బి చౌదరి నిర్మించిన ఈ సినిమాకి తమన్ సంగీతాన్ని సమకూర్చాడు. ఇటీవలే ఈ సినిమా సెన్సార్ పనులను పూర్తి చేసుకుంది. అక్టోబర్ 5వ తేదీన ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతోంది. ఈ సినిమానే కాకుండా భోళా శంకర్, వాల్తేరు వీరయ్య చిత్రాల్లోనూ చిరు నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు సినిమాలు శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నాయి.

సెంచరీ కొట్టనివ్వొద్దు

రూపాయి పతనంపై మోదీకి కాంగ్రెస్ వినతి

న్యూఢిల్లీ: రూపాయి మారవ విలువ క్రమంలో పడిపోతుండటంపై కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. డాలరు విలువ 81.58 రూపాయలకు పెరగడాన్ని ప్రస్తావించింది. ఇది సెంచరీకి చేరకుండా చూడాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నామని కాంగ్రెస్ వెల్లడించింది. పార్టీ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనటే మంగళవారం కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారక విలువ తగ్గిపోతోందని, డాలరు విలువ రూ.82కు చేరుకుందని, చరిత్రలో ఇంత పతనం ఎప్పుడూ లేదని, ఈ ఘనత మోదీకే చెందుతుందని ఆమె వ్యాఖ్యానించారు. ఏడాది కిందట డాలరు విలువ 73 రూపాయలుగా ఉంటే ఇప్పుడు 81.62 రూపాయలకు పెరిగింది. 12 నెలల్లో 12శాతం మేర తగ్గుదల నమోదు అయిందని, ఆ మేరకు మోదీ పేరుప్రతిష్ఠలు దిగజారాయని ఎద్దేవా చేశారు. 'రూపాయి పతనం అయినంత మాత్రాన మీకు ఒరిగేది ఏమి ఉంటుంది? దిగుమతుల విలువ పెరుగుతుంది. ఒక డాలరుకు కొనుగోలు చేస్తే గతంలో రూ.73 చెల్లించే వారు ఇప్పుడు తొమ్మిది రూపాయలు అదనంగా చెల్లించాలి. దీని ప్రభావంతో ప్రజలపై భారం మరింతగా పెరుగుతుంది. ద్రవ్యోల్బణం పెరిగితే వడ్డీ రేటును ఆర్బీఐ పెంచుతుంది. రుణాలపై ఈఎంఐలు పెరుగుతాయి. ప్రజలపై భారం ఇంకా ఎక్కువ అవుతుంది. మోదీ ప్రభుత్వ విధానాలు వైఫల్యంతో మార్కెట్లలో పెట్టుబడుల భరోసా దెబ్బతింటోంది. వినియోగం, పెట్టుబడి, ఉపాధి మధ్య సమతుల్యం దెబ్బతింటోంది. రూపాయి మారకం పడిపోతుండటంతో విదేశీ విరాళాలు భారత్‌కు రావడం లేదు. సామూహిక వినాశాస్త్రాల దృష్టి వాస్తవ సమస్యలపై నుంచి మళ్లుతోంది. 2013 నుంచి రూపాయి పతనం దిశగా దూసుకెళుతోంది. డాలరును రూ.40కు తెస్తామన్న హామీలు ఏమయ్యాయి. రూపాయి పతనం మీరు, దేశం బలహీన పడుతుండటానికి నిదర్శమ'ని ఆమె చెప్పారు. డాలరు విలువ వంద రూపాయలకు చేరుకోకుండా చూడాలని మోదీని కోరుతున్నామని అన్నారు.

నేడు సఫారీలతో సమరం

ఆసీస్‌పై విజయంతో జోరుమీదున్న టీమిండియా

తిరువనంతపురం: భారత్, దక్షిణాఫ్రికా క్రికెట జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా తొలిమ్యాచ్ బుధవారం తిరువనంతపురం వేదికగా జరగనుంది. ఆసీస్‌పై 2-1తో టీ20 సిరీస్ నెగ్గిన టీమిండియా.. దక్షిణాఫ్రికాపై కూడా అదే జోరు ప్రదర్శించాలని కోరుకుంటోంది. బుధవారం రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌ను కూడా సొంతం చేసుకుని వచ్చే నెలలో ఆస్ట్రేలియాలో జరగనున్న టీ20 ప్రపంచకప్ కు ముందు ఆత్మవిశ్వాసం కూడగట్టుకోవాలని టీమిండియా భావిస్తోంది. ముఖ్యంగా చివరి ఓవర్లలో బౌలింగ్ ఆందోళన కలిగిస్తోంది. ఈ సమస్యను టీ20 ప్రపంచకప్ కంటే ముందే పరిష్కరించుకోవాలని చూస్తోంది. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు దక్షిణాఫ్రికాతో సిరీస్ కోసం విశ్రాంతినిచ్చారు. కొవిడ్ నుంచి ఇంకా కోలుకోని కారణంగా మహమ్మద్ షమీ కూడా ఈ సిరీస్‌కు అందుబాటులో లేడు. ప్రత్యర్థి బ్యాటర్లకు భారీగా పరుగులిస్తున్న పేసర్ హర్షల్ పటేల్... ఈ సిరీస్‌లో గాడిలో పడాల్సిన అవసరం ఉంది. ఇక ప్రపంచకప్ కోసం స్టాండ్‌బై ప్లేయర్‌గా ఎంపికైన దీపక్ చాహర్‌కు ఈ సిరీస్‌లో ఆడే అవకాశం దక్కనుంది. మరో పేసర్ అర్ష్‌దీప్ సింగ్ కూడా తిరిగి జట్టులో చేరాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో అదరగొట్టి ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గా నిలిచిన అక్షర్ పటేల్... దక్షిణాఫ్రికాపై కూడా అదే ఫామ్ కొనసాగించాలని కోరుకుంటున్నాడు. టీ20 ప్రపంచకప్ కంటే ముందు ఆటగాళ్లందరికీ ఆడే అవకాశం ఇవ్వాలని భావిస్తున్న కెప్టెన్ రోహిత్ శర్మ... అశ్విన్‌కు కూడా తుది జట్టులో చోటు ఇచ్చే అవకాశం ఉంది. బ్యాటింగ్ విభాగంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, సూర్య కుమార్ యాదవ్ ఫామ్‌లో ఉండగా, కేఎల్ రాహుల్ ఇంకా గాడిలో పడాల్సిన అవసరం ఉంది. ఇక దినేష్ కార్తీక్‌కు పెద్దగా క్రీజ్‌లో ఉండే అవకాశం దక్కలేదు. మరోవైపు వెన్నునొప్పి కారణంగా దీపక్ హుడా జట్టుకు దూరం కావ డం వల్ల అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్ జట్టులోకి రానున్నాడు. సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌ల్లో భారత్ ఒక్కదాంట్లో కూడా విజయం సాధించలేదు. టీ20 ప్రపంచ కప్‌లో ఒకే గ్రూప్‌లో ఉన్న భారత్, దక్షిణాఫ్రికా అక్కడ కూడా తలపడన్నాయి. అయితే ఆస్ట్రేలియాలో పిచ్ కండిషన్స్ వేరుగా ఉండటం సహా మైదానాలు కూడా పెద్దవిగా ఉంటాయి. బవుమా నేతృత్వంలో దక్షిణాఫ్రికా జట్టు... ఈ సిరీస్‌లో బరిలోకి దిగనుంది.

నెంబర్‌వన్ ర్యాంకు మరింత పటిష్ఠం

ఐసీసీ టీ20 టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు నెంబర్‌వన్ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. ఆసియాకప్‌లో ఆకట్టుకోలేకపోయినా ఆస్ట్రేలియాతో మూడు టీ20ల సిరీస్‌ను 2-1తో గెలిచిన భారత్... తాజా ర్యాంకింగ్స్‌లో 268 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అంతకుముందు రెండో స్థానంలో ఉన్న ఇంగ్లండ్‌కు భారత్‌కు మధ్య ఒక పాయింటే తేడాగా ఉండేది. కానీ పాక్‌తో నాలుగో టీ20లో ఇంగ్లండ్ ఓడడం రోహిత్ సేనకు కలిసొచ్చింది. అయితే వీరి సిరీస్‌లో మరో మూడు మ్యాచ్‌లు మిగిలి ఉండడంతో ర్యాంకింగ్స్‌లో ఆసక్తికర పోటీ నెలకొంది. ప్రస్తుతం ఇంగ్లండ్ 261 పాయింట్లతో ఉండగా, దక్షిణాఫ్రికా (258) మూడో స్థానంలో ఉంది. ఒకవేళ సఫారీలతో జరిగే టీ20 సిరీసను భారత్ క్లీన్‌స్వీప్ చేస్తే నెంబర్‌వన్ హోదాలో టీ20 ప్రపంచకప్‌లో అడుగుపెట్టవచ్చు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.